77

సృజన

మార్చి 1978

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక



నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సం॥ర చందా 15 రూపాయిలు
ఈ సంచిక రు. 1–50 పైసలు

విప్లవ రచయితల సంఘం 6వ మహాసభలు

29, 30 ఏప్రిల్, 1 మే - చీరాల (ప్రకాశం జిల్లా)

కార్యక్రమం:

29-4-78

ఉదయం 9-30 పతాకావిష్కరణ, ఆహ్వాన సంఘాధ్యక్షుని ఉపన్యాసం, కార్యదర్శి నివేదిక, సౌహార్ద ప్రతినిధుల ప్రసంగాలు.

మధ్యాహ్నం 3-00 (ప్రతినిధులకు మాత్రమే) సాహిత్య ప్రయోజనం - సాంప్రదాయిక శాస్త్రీయ దృక్పథాలు — త్రిపురనేని మధుసూదనరావు

సాయంత్రం 5-00 వ్యాపార సంస్కృతి — చలసాని ప్రసాద్

ప్రజా పోరాటాలు - సాహిత్యం — వరవరరావు

రాత్రి 8-00 కవిసమ్మేళనం యువత పిడికిళ్ళు ఎత్తితే (నాటిక) చీరాల జననాట్య మండలి, గుంటూరు జననాట్య మండలి కార్యక్రమాలు

30-4-78

ఉదయం 9-00 సర్వసభ్య సమావేశం

మధ్యాహ్నం 2-00 (ప్రతినిధులకు) చరిత్ర - మార్క్సిస్టు దృక్పథం — వి. రామకృష్ణ

సాయంత్రం 5-00 ప్రజా కళారూపాలు - చర్చ — అధ్యక్షుడు చెరబండరాజు

రాత్రి 8-00 'మీరైతే ఏంచేస్తారు?' (నాటిక) అరుణోదయ, చందలూరు

'టెంపరరీ లేబర్' (నాటిక) జననాట్య మండలి, వేటపాలెం

ఒంగోలు బృందం సాంస్కృతిక కార్యక్రమాలు

1-5-78

ఉదయం 9-00 (ప్రతినిధులకు మాత్రమే) చారిత్రక భౌతికవాదం — చలసాని ప్రసాద్

11-00 సర్వసభ్య సమావేశం

మధ్యాహ్నం 2-30 వర్ధమాన దేశాలలో సామ్రాజ్యవాద దోపిడీ - సి. వి. సుబ్బారావు

సాయంత్రం 4-30 ఊరేగింపు

6-00 బహిరంగసభ — అధ్యక్షుడు కె. వి. రమణారెడ్డి

ఉపన్యాసకులు: కాళోజీ, త్రిపురనేని మధుసూదనరావు, కాశీపతి, వరవరరావు

రాత్రి 8-00 'భూమిభాగోతం' విశాఖ జననాడ్య మండలి

'వెట్టిచాకిరీ' (బుర్రకథ) తెనాలి జననాట్య మండలి

పర్చూరు జననాట్య మండలి కార్యక్రమాలు

ప్రతినిధుల రుసుము: పది రూపాయలు

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

77

మార్చి 1978

కార్మిక కర్షక సంయోగంబే
కష్టజీవు లందరి ఐక్యతయే
పాటుపడే మన అందరి పక్షం
మనదే దేశము ప్రజలము మనమే

అంతర్జాతీయ సంస్థయే
అశేష మానవకులమై పోవును
ప్రధానమగు ఈ పోరాటంలో
పాల్గొన నందరు లేవండోయ్.

— అంతర్జాతీయ గీతం
యూజిని పాటిర్ 1871

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1–50 పైసలు

సృజన

మార్చి 1978 మాసపత్రిక 77

ముఖచిత్రం ; పారిస్ కమ్యూన్ వీరులు....

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా కార్మికవర్గ ప్రభుత్వం పారిస్ కమ్యూన్ ఏర్పడి ఈ మార్చి 18 కి 108 సంవత్సరాలయింది.

చూడండి: పారిస్ కమ్యూన్‌పై సి. వి. రచనలోంచి కొన్ని భాగాలు పే॥ 53 - 66

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal - 506 002 (A.P.)
Working Editor: Varavararao

ఎన్నికల ఫలితాలు

అందరి అంచనాలను, జోశ్యాలను, ఎందరివో ఆశలను, అత్యాశలను కూడ తలకిందులుచేసినవి ఎన్నికల ఫలితాలు. గెలిచిన ఇందిరమ్మకూడ ఇవ్వాళ ఏమైనాచెప్పవచ్చు గాని ఇంత మెజార్టీతో గెలుస్తాననిగానీ గెలిచి ఏకపక్షంగా ప్రభుత్వాలను స్థాపిస్తానని గానీ అనుకొనివుండదు.

ప్రజల మనోభావాలను పసికట్టడంలో మన పత్రికలు ఎంత 'పట్టణ మనస్తత్వం గల పరాయి సాధనాల'యినవో మళ్ళా ఒకసారి రుజువయింది. జాతీయ పత్రికలన్నీ కనీసం ఆంధ్రదేశం ఉదాహరణే తీసుకుంటే ఏ పార్టీ కూడ మెజారిటీ సాధించని స్థితి వుంటుందని, మూడింటిలోనూ రెడ్డి-రావుల కాంగ్రెస్‌కే ఎక్కువ స్థానాలు వస్తాయని ఊహించాయి. అధికారంలో వున్నవాళ్ళే మళ్ళీ అధికారంలోకి వస్తారని ఊహించడంలో చాల వెసులుబాటూ సౌలభ్యమూ వుంది.

ఎన్నికలమీద, ఎన్నికల ఫలితాలమీద భ్రమలులేని సృజన ఎవరు గెలుస్తారన్న ఊహాగానాలు చేయలేదు- కాని 'ఇందిరా భ్రమోత్పాతం' గురించి ఇంకొక సందర్భంలో హెచ్చరించింది.

ఉప్పెన, తుఫానులు తెలుగుదేశాన్ని ముంచెత్తినపుడు ఇందిరాగాంధీ గుంటూరు వచ్చింది. అప్పుడు పేదవర్గాల జనాలు ఏమనుకున్నారో రిపోర్టుచేస్తూ సృజనలో రాసిన మాటలు మళ్ళా ఒకసారి మననం చేసుకోవాల్సిందిగా పాఠకులకు గుర్తుచేస్తున్నాం. "దేశానికి తుఫాను బీభత్సమే కాదు, ఇందిరా భ్రమోత్పాతం కూడ ఇంకా తొలగలేదు- ఇందిరా గాంధీ ఇరవైసూత్రాలు సామ్యవాద పదజాలమూ వల్లించి, భూసంస్కరణల కల్లబొల్లి కబుర్లుచెప్పి పేదవర్గాల్లో ఏదో ఒక మేరకు ఇంకా భ్రమలను కల్పించగలుగుతున్నదంటే ఆ పేదల మధ్యన చైతన్యయుతమైన నిర్మాణాత్మక కృషి చేయడంలో కమ్యూనిస్టులు చేయవలసినంత చేయకపోవడమే...." (చూ॥ సృజన, ఫిబ్రవరి 78 పేజీలు 46, 47) అట్లాగే ఫిబ్రవరి సంచిక సంపాదకీయంలో "....నియంత ఇందిర ఇంకా 'ఎమర్జెన్సీ'ని సమర్థిస్తూ సజావుగా బలహీనవర్గాల ప్రజలలో భ్రమలు పోషిస్తూ తిరుగ గలుగుతూనే వున్నది." అని కూడ సృజన రాసింది.

ఇందిరాగాంధీ, ఆమె తండ్రి నెహ్రూ- వాళ్ళ 'మహాత్ముడు' గాంధీ ప్రజల 'భాష' పట్టుకున్నారు. ఆయా కాలాల్లో అవసరమైన భాషను అతి సమర్థవంతంగా మాట్లాడుతున్నారు. ఇవ్వాళ ఆమె భూసంస్కరణలు, బలహీనవర్గాల ప్రయోజనాలు ఏమొచ్చె- వర్గపోరాటం గురించి మాట్లాడుతున్నది. ఆమె నుంచి, ఆమె ప్రాతినిధ్యం వహించే బూర్జువా వర్గం నుంచి పార్లమెంటరీ రాజకీయాలు వంటబట్టిన 'కమ్యూనిస్టులు' ఆమె నోట తమ మాటలే కాదు, వేళ్ళు కూడ పెట్టి కూచున్నారు.

పట్టణాల్లోని తెల్లబట్టలవాళ్ళ పౌరహక్కుల గురించి, స్వేచ్ఛగురించి పెడబొబ్బలు పెట్టే జనతా ఆర్థిక రాజకీయ విధానమే ఒక నేతిబీరకాయ అని తేల్చుకోవడానికి ఏడాది ఎక్కువే అయింది.

ఎంత మంచి కుర్రవాళ్ళు!

సునీత

ఎంత మంచి కుర్రవాళ్ళు
ఎర్రెర్రని కుర్రవాళ్ళు
వెలుతురును చేరేందుకే
వేగిర పడుతున్నవాళ్ళు!

భయం బెదురు నెట్టివేసి
బతుకుకై పోరువాళ్ళు
బతుకును బలిచేసయినా
గమ్యానికి చేరువాళ్ళు!

పేద జనం కన్నుల్లో
వెలిగే ఆశాజ్యోతులు
పోరులోన నిలచిఉన్న
వీరుల వెచ్చని తలపులు!

భూస్వామ్య, బూర్జువాల
గుండెల్లో రేచులు
పీడించే వర్గాలకు
బుసకొట్టే త్రాచులు!

ఉరుకలెత్తు రక్తంతో,
ఉప్పొంగే శక్తులతో
ముసుముందుకె నడచువాళ్ళు
తుపాకుల, ఉరికొయ్యల
    గడగడ లాడించు వాళ్ళు!

అమర వీరుల మాట
మరచిపోని శూరులు
ఆగిపోని ఆశయాలబాట
వీడిపోని వీరులు!

త్యాగమూర్తులార
ధన్యజీవులార
ఉదయించే సూర్యులార!
ఎర్రెర్రని కాంతులార!
అందుకోండి లాల్‌సలామ్!

అన్నయ్యల అక్కయ్యల
లాల్ సలామ్! లాల్ సలామ్!
అందుకోండి అందుకోండి
అరుణారుణ స్వాగతం!

(ఆర్ ఎస్ యు సభలిచ్చిన ఉత్తేజంతో)

తన ఓటమే తన బలహీనతా తనకే సానుభూతి తెచ్చింది. జనతా వైఫల్యమూ ఆమెకే అండనిచ్చింది. వర్గపోరాట రాజకీయాలను, వ్యవసాయ విప్లవాన్ని అట్టడుగు వర్గాలలోకి, వ్యవసాయ కూలీల్లోకీ తీసుకపోయి నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే 'దున్నేవానికి భూమి', ఉత్పత్తి, ఉత్పత్తిసాధనాలు కష్టజీవి వశమవుతాయనే శాస్త్రీయ సత్యాన్ని వివరించడంలో, ప్రజల నిత్య జీవితాచరణలో పోరాటం ఒక అవసరంగా మలచడంలో విప్లవకారులు విఫలమైనంత కాలం మొసలి కన్నీరును అసలు కన్నీరు అనుకునే ప్రజల్ని తప్పుపట్టి ఏం ప్రయోజనం!

13-3-78

— సంపాదకుడు

వోలీ వోలీల రంగ వోలీ....

వి. బి. గద్దర్

వోలీ వోలీల రంగ వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

ఏడ బుట్టె ఏడ బెరిగె
ఏడి కొచ్చె ఏడ సచ్చె
ఎవరి కొరకు వచ్చినారు
ఎవరి కొరకు సచ్చినారు
ఏ తల్లి కడుపు పంటలోరీ
శెమ్మ కేలిల వోలీ
కూలి తల్లి కంటిపాప లోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ

పట్టణంలో బుట్టినారు
పెద్దసదువు సదివినారు
పల్లె పల్లె దిరిగినారు
మాలపల్లె కొచ్చినారు
గంజి గటక దాగినారు
గట్టుమీద పన్నారు
పాలికాపు కండలమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ
రైతు కూలి గుండెలమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

కూలి నాలి బతుకు కొరకు
కాశెబోశి కదిలినోళ్ళు
తిడితె తిరగ బడతరమ్మ
కొడితె కొట్టి తీర్తరమ్మ
వాంపేరు ఇంటెనమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ
ఊరిపెద్ద గుండెలదురు వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

దోసుకునే దొరల గుట్టు
పూస గుచ్చినట్టు జెప్పి
ముద్దు ముద్దు మాటలతో
బుద్దులెన్నొ జెప్పినారు
సూరులంటె సూరులమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ
సూరునంత బంటులమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

మాదిగోల్ల మల్లన్న
సాకలోల్ల సాయన్న
మాలోల్ల మైసన్న
కురుమోల్ల కొమ్రన్న
లంబడి లచ్చన్న తోటి
చెంచూ చెంద్రన్న తోటి
పాపకింద నీళ్ళలాగ వోలీ
శెమ్మ కేలిల వోలీ
సోపతేమొ జేశిరమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

పట్టపగలే బిడ్డలాను
పట్టుకోని యెమినోళ్ళు
కమిలి పోయెటట్టు గొట్టి
కీలుకీలు విరిచిపెట్టి
లాగులల్ల తొండలిడిసి రోలీ
శెమ్మ కేలిల వోలీ
తిరొక్క బాధపెట్టి రోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

కొడుకులాకు కండ్లు గట్టి
చిట్టడివికి దీసుకొచ్చి
చెట్లకు గట్టేసినారు
గన్నులు గురిపెట్టినారు
పిట్టలన్ని ఎగిరినాయి
పావురాలు పారిపోయె
తూటమీద తూట పేల్చిరోలీ
శెమ్మ కేలిల వోలీ
తూర్పు ఎర్ర బారెనమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ ॥వోలీ॥

కన్ను దెరిసి కన్ను మూస్తె
కండ్లల్లొ కదులుతుండ్రు
కాలుదీసి కాలువేస్తె
కాళ్ళల్లొ మెదులుతుండ్రు
సక్కనైన కొడుకులమ్మ వోలీ
శెమ్మ కేలిల వోలీ
సుక్కలల్లొ కలిశిరమ్మ వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

కొడుకులార మిమ్ములాను
కలల గూడ మరిసిపోము
బిడ్డలార మిమ్ములాను
బాధలల్ల మరిసిపోము
కసి దీర్చుకోనికి వోలీ
శెమ్మ కేలీల వోలీ
కాళమ్మ లౌతాము వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

మహా సంకల్పం

అజ్ఞాత సూరీడు

1

నా కలల్లో ఆవిష్కరించుకుంటూన్న
సమతా సమాజాన్ని గురించి మాట్లాడుతున్నాను నేను
అవును ! ఆ సమాజాన్ని వీక్షించాలనుకున్న
ఎన్నెన్నో కను రెప్పల్ని వాళ్లు
బలవంతంగా శాశ్వతంగా మూసేశారు.
గుండె అట్టడుగు పొరల్లోనూ
కొండల్లోనూ, కోనల్లోనూ
అడివిలోనూ, జనం మౌనంలోనూ
పెరుగుతున్న ఆలోచనల్ని
వెంటాడటాన్కి వీళ్లూ
ప్రయత్నం చేస్తున్నారు అంటున్నాను నేను!

నేను శ్వాస ఆడక మరణించినా సరే!
వీళ్ల ఆలోచనల డ్రైనేజీ గొట్టం
కడ్డంపడి, వూపిరాడక వీళ్లు
గిలగిల్లాడి చచ్చేలా చేస్తాను!

2

ఇదొక ఎత్తయిన కొండ శిఖరం
శిఖరం మీద అతి సన్నని కాలి బాట
బాట కిరువైపులా భయంకర అగాధాలు
ఎదురయ్యే అగ్ని కీలలు
ఎడతెగని మృత్యువు వేట!
సుతారంగా తప్పుకోక పోతే
సునాయాసంగా పోతుంది ప్రాణం!
కాలు జారిందా ఓ వైపు లోయలో
తాటి లోతు వూబి
మరోవైపు పాతబడ్డ బాయ్‌నెట్లు!
అటు పడితే ఊబి మింగేస్తుంది
ఇటు పడితే బాయ్‌నెట్లు తూట్లు పొడుస్తాయ్!
ఓ వేళ కాలు జారితే మాత్రం
బాయ్‌నెట్ల అగాధంలోకే దూకుతాను నేను!

3

కత్తి అంచుమీద నిల్చుని వ్రాస్తున్నానిది
మృత్యువు నా కెప్పుడూ మిల్లీమీటర్ల దూరంలోనే వుంటోంది
దాంతో ప్రతి క్షణం నా పోరాటం—
బ్రతుక్కీ, చావుకీ మధ్య వూపిరపీల్చే
విశ్రాంతి సమయాల్లో వ్రాస్తున్నా నిది!
నా మెదడులో క్రిక్కిరిసిన వేలాది ఆలోచనలు
నా కళ్ల ముందు పరుచుకునివున్న
కోట్లాది ప్రజల బాధలు!

ఆలోచనల్ని ఆచరణకు ముడిపెట్టి
బాధలకు పరిష్కారాలు వెతుకుతున్నాను!
ఈ మహత్తర కర్తవ్య నిర్వహణలో
ఎన్నడూ నేను చూడని, నాకేమీ కాని
కోట్లాది ప్రజల సహకారం!
వాళ్లు నా ఎడల చూపించే ఆప్యాయత
అనుభవించటానిక్కి అమితంగా వుంది!
వాళ్ల ఆప్యాయతకు తగ్గ ప్రతిఫలం
ఆచరణలో అందించాలనే తీవ్ర తపన!
నేను నడుస్తున్న ఈ దారి పొడుగునా
నాతో నడిచిన నా నేస్తాలూ, ఆత్మీయులూ
అయిన ఎందరో వీరులు
పోరాటంలో ఒరిగిపోయారు
వాళ్ల అమూల్య ఆశయాలు
తలకెత్తుకుని నడుస్తూనే వున్నాను–
చివరిదాకా చేరగలనో లేదో కానీ
చేరగలననే కొండంత విశ్వాసాన్ని మాత్రం
పదిలంగా పెంచుకుంటూన్నాను–

కవితలకు ఆహ్వానం

న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ 'ప్రగతి సాహితి' సంస్థ ద్వారలో తెలుగు కవితా సంకలనం ప్రచురించ నున్నది. సంకలనాన్ని కాళోజీ ఎడిట్ చేస్తారు. ఇందుకోసం కవితలు పంపవలసిందిగా పాత రచయితలను, కొత్త రచయితలను కూడా కోరుతున్నారు–

రచనలు పంపవలసిన అడ్రసు :

– టి. అశోక్
009 కావేరి హాస్టల్
జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ
న్యూ ఢిల్లీ – 110057

మెల్లి మెల్లిగా - జోరు జోరుగా

మెల్లి మెల్లగా వస్తోంది
చిట్టి పొట్టి అడుగుల చీమనడకలు సాగిసూ
వస్తోంది నింపాదిగా
విత్తనంలోంచి ఎదుగుతున్న వృక్షం లాగ
సావకాశంగా పరిపక్వం అవుతూ
గర్భంలో పెరుగుతున్న పిండం లాగ
నిశ్చయంగా వస్తోంది చీకట్ల గందరగోళం నుంచి
వేగు చుక్కలాగ నిరాఘాటంగా

* * * *

ఇంతలోనే వేగం పుంజుకొని
జోరు జోరుగా వస్తోంది
నా గొంతుకలో ఉప్పొంగుతున్న నినాదాల్లా గరపశిస్తూ
తుఫానులో సముద్ర తరంగాల్లాగ లేస్తూ
ఒక దేశం నుంచి మరో దేశం దాకా
పెద్ద పెద్ద అంగలు వేస్తూ
నెత్తురు ఉరకలు వేస్తూ
ఒక జీవితాన్ని మరు జీవితానికి పెన వేస్తూ
వస్తోంది వస్తోంది విప్లవం

మద్రాసు
19-11-77

— శ్రీ శ్రీ

సామ్రాజ్యవాదం చరిత్ర గురించి చదవడం

ఇంటా బయటా వచ్చి దోపిడీ, వాటిలో వాటికి పోటీ, ఒక దేశం పతనం చెంది మరొకటి కొత్తగా రావడం ఇవన్నీ కూడా సామ్రాజ్యవాదపు లక్షణాలు. అందుకే లెనిన్ సామ్రాజ్యవాదాన్ని 'కృశించిపోతున్న పెట్టుబడిదారీ విధానం'గా వర్ణించాడు. అప్పుడే శ్రామిక సామాజిక విప్లవం తొలిదశ మొదలవుతుంది. సామాజిక వైరుధ్యాల మూలంగానే పెట్టుబడిదారీ విధానం పతనమయి తీరుతుంది. సోషలిజం విజయవంత మవుతుంది. చారిత్రిక ఉద్యమ సూత్రాలే వీటన్నిటిని నిర్ణయిస్తాయి. క్షీణ పెట్టుబడి దారీ విధానపు వినాశ విపరీత బుద్ధులు సామ్రాజ్యవాద దశలో నగ్నంగా కనబడతాయి. అంతర్గతవైరుధ్యాలు కొట్టొచ్చినట్టుగా బయటపడతాయి.

వైరుధ్యం గురించి రాస్తూ, మావో గొప్పగా పరిశీలించాడు. ఆయన లెక్క ప్రకారం శ్రామికవర్గానికి, బూర్జువావర్గానికి వైరుధ్యం తీవ్రతరమయింది. గుత్త పెట్టు బడిదారీ విధానానికి ఉత్త పెట్టుబడిదారీ విధానానికి వైరుధ్యం వచ్చిపడింది. వలసలకు వలస రాజ్యాధిపతులకు వైరుధ్యం పెరిగింది. వివిధ పెట్టుబడిదారీ దేశాలమధ్య వాటి అభివృద్ధిలో హెచ్చుతగ్గు లుండడం వల్ల వైరుధ్యాలు తీవ్రమైనాయి. ఇలాంటి వైరు ధ్యాలన్నీ పెచ్చుపెరిగి సంఘర్షణ పడ్డ ఫలితంగానే శ్రామికవర్గ నాయకత్వం కింద సోషలిస్టు జనతా ప్రజాస్వామ్య విప్లవ విజయాలకి పూర్వరంగం సిద్ధమైంది. సామ్రా జ్యవాదాన్ని పరిశోధించిన లెనిన్ ఓమాట చెప్పాడు. వివిధ దేశాల రాజకీయ ఆర్థిక అభివృద్ధులలో తేడా వున్నందున, సామ్రాజ్యవాదం బాగా బలహీనంగా ఉన్న చోట బద్దలవుతుంది. లెనిన్ చెప్పింది నిజమేనని చరిత్ర రుజువుచేసింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జారిస్టు రష్యా సామ్రాజ్యవాదపు వైరుధ్యాలకు కేంద్రంగా వుండేది. సామ్రాజ్యవాదం అనే గొలుసులో అతి బలహీనమైన లింకు రష్యాయే. అందుకనే 1917 అక్టోబరు సోషలిస్టు విప్లవం అక్కడ లెనిన్ నాయకత్వాన నెగ్గి ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు దేశంగా వరవడిపెట్టి మానవజాతి చరిత్రలో కొత్తయుగం నెలకొల్పింది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత చైనా విప్లవ విజయం, ఆసియా యూరప్ దేశాల్లో విప్లవ విజయాలు అన్నీ కూడా మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతానికి సరికొత్త తార్కాణాలు.

సామ్రాజ్యవాదం దానంతటదిగా ఎప్పుడూ గద్దె దిగదని చరిత్ర మనకు చాటి చెబుతుంది. అవసానకాలం సమీపించినకొద్దీ సామ్రాజ్యవాదం మరింత బరితెగించి

సైనిక కుతంత్రాలకు రాజకీయ మోసాలకు పాల్పడుతుంది. అందుకే మావో అన్నాడు "చికాకు పెట్టడం, ఓడిపోవడం, మళ్లీ చికాకు పెట్టడం, మళ్లీ ఓడిపోవడం.... వాళ్ల కూలిపోయేవరకు ఇదే ప్రపంచమంతటా సామ్రాజ్యవాదులు, విప్లవ ప్రతీఘాతకులు అవలంబించే విధానం." రాజకీయ, ఆర్థిక సంక్షోభాల నుంచి తమ్ము తాము కాపాడుకోడానికి హిట్లరు జర్మనీలో ఫాసిస్టు నియంతృత్వం ప్రవేశపెట్టాడు. జర్మనీ ప్రజానీకాన్ని ఆర్థిక దోపిడీలకు రాజకీయ పీడనకు గురిచేశాడు. "తిండికి బదులు తూటాలు" అని ఎలుగెత్తి చాటాడు. రెండో ప్రపంచ యుద్ధాన్ని మొదలెట్టి ప్రపంచ ప్రజలను దోపిడీ చేశాడు. ప్రపంచ ప్రజానీకం ఫాసిజానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడ్డం వలన 12 ఏళ్లు తిరక్కముందే హిట్లర్ సర్వనాశనం అయ్యాడు. వెయ్యేళ్ల సామ్రాజ్యాన్ని నిర్మిద్దామని కలలుగని భస్మాసురుడిలా దహించుకుపోయాడు. మావో అన్నాడు కూడా– "ప్రపంచ ప్రజలను పోరాటంలోకి నెట్టి సామ్రాజ్యవాదాన్ని అంతం చేసే నూతన శకం ఆసన్నమయింది. అమెరికన్ సామ్రాజ్యవాదం, రష్యా సోషల్ సామ్రాజ్యవాదం ఇవాళ ప్రతి చోటా కూడా దురాక్రమణ, కూలదోయడం, అదుపు, జోక్యం ఇలాంటి వాటితో చివరకు తమ గొయ్యి తామే తవ్వుకుంటున్నాయి. చిన్నచిన్న దేశాలలో ప్రజలను పోరాటాలకు వాళ్లే రేకెత్తిస్తున్నారు. ప్రజల విప్లవ పోరాటాలే క్రమక్రమంగా సామ్రాజ్యవాదాన్ని బలహీనపరచి చివరకు దాన్ని సర్వనాశనంచేస్తాయి.

సామ్రాజ్యవాదానికి, అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాటం :

సామ్రాజ్యవాదులు తమ అవసానకాలంలో శ్రామికవర్గంలోని అవకాశవాద ముఠాని తమవైపు లాక్కొనడానికి ప్రయత్నంచేస్తారు. అలవిమాలిన లాభాలను గడించి, ఆ డబ్బుతో శ్రామికవర్గపు నాయకత్వాన్ని కొనగలరు. పాత కొత్త రివిజనిస్టులు బూర్జువావర్గానికి పూర్తిగా అమ్ముడుపోయి ఉత్త సజ్జుగా సామ్రాజ్యవాదపు బంటులుగా మిగిలిపోతారు. వీళ్లు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చోటుచేసుకుని, సామ్రాజ్యవాదంలోని వైరుధ్యాలను కప్పిపెట్టి ప్రజల పోరాటశక్తిని నీళ్లుకార్చాలని చూస్తారు. సామ్రాజ్యవాదుల చేసుకోలేని పని వీళ్లు చేసిపెడతారు. శ్రామికవర్గానికి తీరని ద్రోహం చేసే ఇలాంటి విద్రోహులనే లెనిన్ "మాటల్లో సోషలిజం, చేతల్లో సామ్రాజ్యవాదం వెరసి సోషల్ సామ్రాజ్యవాదం" అన్నాడు. అందుకే లెనిన్ చాలాసార్లు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని అవకాశవాద రివిజనిజాల వ్యతిరేక పోరాటంతో మేళవించమన్నాడు. అలా మేళవించకపోతే ఆ పోరాటం ఉత్త దండగమారిదని కూడా

నొక్కిచెప్పాడు. ఇవాళ సోవియట్ విద్రోహపు ముఠా సరిగ్గా లెనిన్ తిట్టినట్టే చేస్తున్నారు. సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నామమాత్రంగా జపిస్తూ- ఆచరణలో దోపిడీ విధానాన్ని, విస్తరణవాదాన్ని అమలు పరుస్తున్నారు. రష్యా రివిజనిస్టులు ముమ్మాటికీ సోషల్ సామ్రాజ్యవాదులే.

రెండో ప్రపంచ యుద్ధం తరవాత ప్రపంచ విప్లవం బాగా అభివృద్ధి చెందడం వల్ల సామ్రాజ్యవాదం ఎత్తుగడలు మార్చుకుంది. శ్రామికవర్గం అధికారానికి రానిచోట లంచాలిచ్చి జోక్యం కల్పించుకోవడం, శ్రామికవర్గం అధికారానికివస్తే కూలదోయడం, చాపకింద నీరులా చొచ్చుకుపోవడం ఇలాంటి పనులన్నీ బూర్జువావర్గం చేస్తూంది. సైనిక చర్యలు, సాయుధ దండయాత్ర, రాజకీయ కుతంత్రం ఇవీ వాళ్ల నయావలస విధానాలు. విద్రోహులకు, కీలుబొమ్మలకు లంచాలిచ్చి పరోక్షంగా వలస పాలన సాగించడం, లేదా సైనిక సాయం, ఆర్థిక సాయం ముసుగుల్లో విదేశాలకు సరుకులు గుప్పించి, పెట్టుబడులుపెట్టి బడుగు దేశాలను ఆర్థికంగా దోపిడీచేసి, సైనికంగా ఆర్థికంగా అదుపుచేయడం, లేదా ఇతర దేశాలను తమ మీద సొంతం ఆధారపడేటట్టు చేయడం ఇవీ సామ్రాజ్యవాదులుచేసే పనులు. ప్రజలను బానిసలుగాజేసి, ప్రపంచాధిపత్యం సంపాదించి, వలసపాలన కొనసాగించేందుకు సామ్రాజ్యవాదులు ఎలాంటి కుతంత్రాలయినా, కుట్రలయినా చేస్తారు. సామ్రాజ్యవాదులు ఎన్ని రకాల కొత్తకొత్త ఎత్తులెత్తినా దోపిడి అనేది పోరాటాన్ని, పీడన అనేది ప్రతిఘటనను రగుల్కొల్పక మానవు. వాళ్ల దురాక్రమణకు దిగినందువల్ల తమ మెడకు తామే ఉచ్చుబిగించుకుంటున్నారు. వెధవ పనులు ఎక్కువ చేసినకొద్దీ ఉచ్చు మరింత బిగుస్తుంది. వాళ్ల ఘాతుకాలన్నీ వాళ్లకు త్వరలోనే గోరీకట్టడానికి దారితీస్తాయి. ఎక్కువకాలం పనలేవు.

సామ్రాజ్యవాదానికి చావు మూడింది

మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతంమీద ఆధారపడి మావో, సామ్రాజ్యవాదపు గతాన్ని వర్తమానాన్ని పసికట్టి దానికి వ్యతిరేకంగా చైనా తదితర ప్రపంచ ప్రజలు జరిపిన పోరాటానుభవాలను పరిశీలించి వ్యూహం ఎత్తుగడలు రూపొందించాడు. ఇలా అన్నాడు కూడా: "మొదటి ప్రపంచ యుద్ధం, మొట్టమొదటి సోషలిస్టు విప్లవం (రష్యా అక్టోబరు విప్లవం) ప్రపంచ చరిత్రగతిని మార్చివేసి, కొత్తయుగానికి దారితీశాయి." ఈ యుగంలో సామ్రాజ్యవాదం "తన దివాళాకోరుతనాన్ని పూర్తిగా బయటపెట్టుకుంది." (మావో: నూతన ప్రజాస్వామ్యం). మావో ఇంకా ఇలా చెప్పారు.

"దీర్ఘకాలపు దృష్ట్యా పరిశీలించిచూస్తే సామ్రాజ్యవాదం ఇతర ప్రతిఘాతకులు కూడా కాగితం పులులు. ఇది వ్యూహం. మరో కోణంనుంచి చూస్తే వారు నిజం పులులు, ఇనప పులులు. ప్రజలను భక్షిస్తారు. ఎత్తుగడల రీత్యా ఇదీ మన ఆలోచన. సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి శాస్త్రీయ సిద్ధాంతమే గొప్ప ఆయుధం. సామ్రాజ్యవాదం చనిపోతున్న పెట్టుబడిదారీ విధానమేగాని, చనిపోయిన పెట్టుబడిదారీ విధానం కాదు. ప్రజల జీవన్మరణ పోరాటంలో ఈ సామ్రాజ్యవాదానిది ద్వంద్వ స్వభావం వుంది. సుదీర్ఘ, సాయుధ, ప్రజా పోరాటాలు లేకుండా సామ్రాజ్యవాదాన్ని ఉన్నదున్నట్టు సామ్రాజ్యవాదాన్ని కుడిచిపెట్టగలమనుకోవడం కల్ల. నదురుబెదురులేకుండా సుదీర్ఘ పోరాటాలు జరిపే ధైర్యసాహసాలుంటే మాత్రం సామ్రాజ్యవాదం నాశనమవుతుంది- విప్లవం విజయవంతమవుతుంది. దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు. ఇది చారిత్రక ధోరణి. సామ్రాజ్యవాదానికి చావుమూడింది. విజయ పరంపరలనేవి అనేక కష్టాలతో, నష్టాలతో కూడి వుంటాయి. "పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదాలు నాశనమయి, సోషలిస్టు జనతా ప్రజాస్వామ్య విప్లవాలు విజయం పొందే చారిత్రిక దశ ఇది-" అన్నాడు మావో. మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం అధ్యయనం చేస్తే సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదం స్వభావాలు అర్థమవుతాయి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి తేట తెల్లం అవుతుంది. విప్లవ విజయంపై నమ్మకం పెరుగుతుంది. సమస్త మానవజాతి విముక్తికి విప్లవ విధానాలను మరింత బాగా అమలు పర్చగలుగుతాం.

చరిత్రలో రాజులను, యువరాజులను, యోధులను, 'అగ్నిసాక్షి'గా వివాహమాడిన పతివ్రతా తిలకాలను మాత్రమే తిలకించదలచిన వారికి చరిత్ర గురించి హేతుబద్ధమైన, శాస్త్రీయమైన, వాస్తవికమైన దృక్పథం జీర్ణంకావడం కష్టం. "ఉత్పత్తి సాధనాల్లో సంబంధాల్లో వచ్చిన క్రమానుగత పరిణామాల వివరణయే చరిత్ర." చరిత్ర గురించి 'పవిత్ర' దృక్పథంగల 'మేధావులు' ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, సాహిత్యం, కళలు, మానవ శాస్త్రం, రాజకీయాలు, విజ్ఞాన శాస్త్రం, తత్వశాస్త్రం లాంటి 'యితర' విషయాలలో కూడ చరిత్ర ఆసక్తి కనబరచడాన్ని అపవిత్ర కార్యంగా భావించి అదిరిపడతారు. అటువంటి చరిత్రకూ చదువుకూ ఏమీ సంబంధంలేదని, అందువల్ల భారతీయ విశ్వవిద్యాలయాల్లో చరిత్ర విభాగాలు మూసివేయాలని సూచిస్తారు.

— భగవత్ ఎస్. గోయల్

మామిడి చెట్టు

పంజాబీ మూలం : **అమర్‌జిత్ చందన్**
— తెలుగుసేత : **నిఖిల్**

"చెట్లు మాట్లాడలేవు. కాని గుండెలోని —
భాషను గాలి ద్వారా వ్యక్తం చేయగలవు."
— ఒక పంజాబీ జానపద గేయం సారం.

పార్వతీ పురానికి వెళ్లేదారిలో
మామిడి తోటలో ఒక చెట్టు.
ప్రజల తల్లికి కొడుకైనవాడు
రెడ్డి చిన్నమనాయుడు
ఒక మహోజ్వలమైన మృత్యువు,
ఈనాటికీ సాక్షిగా నిలుచుంది మామిడి చెట్టు.

ఈ తోటలో
చెట్టుకు కట్టి కాల్చబడినా
అతని నినాదాలు
నిలిచిపోయిన రాత్రిని చీల్చుకుంటూ
ఇంకా పుట్టవలసిన చుక్కలను వెలిగిస్తూ;
కిరాయి తుపాకులు చావును కక్కినా
అతను అంతే ధైర్యంగా
తలెత్తి నినదించాడు —
"విప్లవం వర్ధిల్లాలి".
అక్కడికి వసంతాన్ని— శిశిరాన్ని
పాడుతూ వస్తాయి పక్షులు,
ఆ చెట్టుపై ఈనాటికీ తుపాకీ కాల్పుల గుర్తులు.
వానలు రక్తపు మరకలను కడిగినా
కాలం చెట్టు గాయాన్ని మాన్పినా
బాధతో విలవిలలాడుతోంది దాని గుండె.
నిరసనగా కేకలు వేయలేదు— రక్షించలేదు
అది కేవలం చెట్టు కాబట్టి.

ఆ చెట్టు ఫలాలు ఇస్తుంది
రేపు కూలుతుంది
రెడ్డి చిన్నమనాయుడిపేరు
కలకాలం నిలుస్తుంది.

[శ్రీకాకుళంలోని సరగుజ్జుల గ్రామం దగ్గరవున్న మామిడి తోటలో చెట్టుకు కట్టి పోలీసులచే కాల్చివేయబడిన కామ్రేడ్ రెడ్డి చిన్నమనాయుడు స్మృతిలో.......]

నా కవిత

సరోజ్ దత్తా

నా కవిత నా గాథ ఎప్పుడూ చెప్పదు
నువ్వు అకస్మాత్తుగా కూడా ఏ క్షణం లోనూ
నేను దుఃఖించడం చూడ జాలవు
నా కవిత బలహీనుల కష్టాలపై డబ్బుచేసుకోదు
నా నుంచి పరిపూర్తికాని కోరికల గురించి కాని
అశక్తమైన హృదయోద్విగ్నతలను గాని
నువ్విన జాలవు
అవి అహంకారంతోనూ వ్యక్తివాదంతోనూ
కూడిన ప్రేమలు ప్రతి ఫలించవు
బలవంతుల పాదాల చెంత
నేను నీచంగా ప్రార్థనలు చేయను
ప్రజల ఆకాశం నుంచి నిప్పుల రథాన్ని తోసుకవెళ్ళే
దేశస్థుల్లో నేనొకణ్ణి.
నన్ను నువ్వెప్పుడూ కవిత్వపు పేజీల్లో కనుక్కో లేవు
కష్టించే కోట్లాది జనం సాహచర్యంలో నేను
మమేకమై పోతాను
నేను నిలువనీరై కుళ్ళి
నాచుకప్పిన సరస్సుపైకి వరద జలాలను గుప్పించినాను
నా సమాధి నుంచి నా "భూతం"
మొరపెట్టుకొని ఏడ్వదు
గాఢమైన కాంక్షలుగల నిర్భయమైన బిందువును నేను

[సరోజ్ దత్తా కవి, పత్రికా రచయిత, కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు ప్రముఖ నాయకుడు. పార్టీ పత్రిక 'లిబరేషన్'కు కొంతకాలం సంపాదకుడు. అగస్టు 1971 లో కలకత్తా నగరంలో ఒకరోజు వేకువజామున పోలీసులు ఇతణ్ణి పట్టుకొని కాల్చివేసి నట్టుగా భావించబడుతున్నది.]

భగత్‌సింగ్ మరణశిక్ష - గాంధీ పాత్ర

1931 మార్చి 23 తేదీన ఉరికంబ మెక్కిన విప్లవకారులు

1930 అక్టోబర్ 7వ తేదీన ప్రత్యేక ట్రిబ్యునల్ భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఆ సమయంలో భగత్‌సింగ్ కోర్టులో లేడు. తర్వాత ప్రభుత్వ లాయర్, పోలీసు సూపరింటెండెంటుతో కలిసి జైలు దగ్గర కొచ్చాడు. లాయర్ భగత్‌సింగ్‌తో "కోర్టు నీకు మరణశిక్ష విధించింది, నేనెంతో విచారిస్తున్నా" అన్నాడు. భగత్‌సింగ్ ధీర, గంభీర స్వరంతో "యిందులో విచారించాల్సిందేం లేదు. నేనీ విషయాన్నప్పుడే విన్నాను" అన్నాడు. దాంతో అతడు ప్రభుత్వాన్ని క్షమాభిక్ష వేడాల్సిందిగా సలహా యిచ్చాడు. దానికి భగత్‌సింగ్ ఎర్రబడ్డ ముఖంతో, కోపంగా "మీ సామ్రాజ్యవాద న్యాయస్థానాల్నుంచి మేము న్యాయాన్నాశించం. ప్రస్తుతం బ్రిటిష్ అధికార్లు మా భారతీయ యువకుల్ని అణచడానికి ప్రయత్నిస్తున్నారు. క్షమాభిక్ష శత్రువు నుండి కోరడం కన్నా చావడమే మేలు" అంటూ జవాబిచ్చాడు.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను 14వ నెంబర్ 'సెల్'*లోనికి మార్చాల్సిందిగా జైలు అధికార్లకు ఉత్తర్వులిచ్చాడు పోలీసు సూపర్నెంటు. ఆ ఖైదీలు ఆ సెల్‌లో రాత్రింబవళ్ళు మరణశిక్ష అమలు జరిగేదాకా వుండాలి. తామంతకు ముందుంటున్న గదినుండీ 14వ సెల్‌కు మారేముందు తమ కామ్రేడ్లతో వీడ్కోలు తీసుకొంటూ వార్ని కౌగలించుకొన్నారు. వారికి భగత్‌సింగ్ యిలా సందేశమిచ్చాడు:

"కామ్రేడ్స్! ఈ కలయిక, వీడ్కోలు రెండూ ఆఖరువే. మనం మరలా కలవలేకపోవచ్చు. మీరు మీ జైలు శిక్ష ముగిసింతర్వాత సంసార జంజాటాల్లో చిక్కుపడి, కర్తవ్యాన్ని మరిచిపోకండి. బ్రిటిష్ పాలకుల్ని భారతదేశం నుండి తరిమివేసి, సోషలిస్టు రాజ్యాన్ని నెలకొల్పేదాకా విశ్రమించకండి. ఇదే మీకు నా సందేశం."

ఉరిశిక్ష విధించిన రోజు నుండి, అది అమలు జరిగేదాకా భగత్‌సింగ్ చాలా పుస్తకాలు చదివాడు. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగ్గవి 1. లెనిన్ జీవితం 2. కమ్యూనిస్టు మేనిఫెస్టో.

గదర్ ఉద్యమంలోపాల్గొని అదే జైల్లో శిక్ష పొందుతున్న 'బాబాసోహన్‌సింగ్' భగత్‌సింగ్‌ను తరుచు కలిసేవాడు.

---

* లాహోర్ సెంట్రల్ జైల్‌లోని 14వ నెంబరు సెల్ మరణశిక్ష విధించబడ్డ ఖైదీల నుంచే గది. ఇప్పటి 'కండెమ్డ్ సెల్స్' లాంటిది.

యువ విప్లవకారుడు భగత్ సింగ్‌తో ఆ వృద్ధ విప్లవకారుడు ఒకసారి కలిసినప్పుడు వారిమధ్య సంభాషణ యిలా జరిగింది— భగత్ సింగ్: "బాబా! బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రజల మనవిని ఆలకించరు. గాంధీ-వైస్రాయ్ సమావేశం యింతలోనే జరుగనున్నది. ఈ సమావేశాల ఫలితాలు మాకేం మేలు చేకూర్చవు. మేం ముగ్గురం తప్పకుండా ఉరితీయబడతాం. కాంగ్రెస్ సిద్ధాంతాలు చాలా బలహీనమైనవి. సంస్కరణవాదంతో కూడుకుని, సంవిధానానికి లోనైనది. ఈ కాంగ్రెస్ వాదు లెప్పుడూ విప్లవ కార్యాచరణకు పనికిరారు. ఎల్లప్పుడు వీరిచర్యలు శత్రువు బలాన్నే వృద్ధిచేయడానికి ఉపయోగపడతాయి. అవకాశవాదంతో శత్రువు కొంత యిచ్చి, పుచ్చుకొనే ధోరణిలో తన్ను తాను కాపాడుకొనడానికి ఏదో నామమాత్రమైన ఒప్పందాన్ని కుదుర్చుకొంటాడు. ఒప్పందం అమలు జరపాల్సి వచ్చేటప్పటికి ఆ ఒప్పందం కాగితాన్ని చెత్తబుట్ట పాల్జేస్తాడు. అందుకే యింతకుముందు చేసుకొన్న ఒప్పందాలు ఏవీ అమలు జరగలేదు."

బాబా: "నిజమే- నీవు చెప్పింది ప్రత్యక్షర సత్యం."

ఆమధ్య కాలంలో భగత్ సింగ్ తలిదండ్రులు అతన్ని చాలాసార్లు కలిశారు. భగత్ సింగ్ ఉరితీతకు ముందుగా వారి చివరి కలయిక 1931 మార్చి 2వ తేదీ (20 రోజుల ముందు). చాలా ఆసక్తిదాయకమైన కలయిక అది. భగత్ సింగ్ తండ్రి కిషన్ సింగ్ తన సంసారం మొత్తంగా వచ్చాడు. తండ్రిని చూచి భగత్ సింగ్ జైలు కటకటాల దగ్గరగా వచ్చాడు. కిషన్ సింగ్ తనయుడిని కటకటాలనుండే కౌగలించుకొన్నాడు. భగత్ సింగ్ చెల్లెలు బీబీ అమర్ కౌర్, తమ్ముళ్ళు కుల్బీర్ సింగ్, కుల్తార్ సింగ్ లు చిరునవ్వుతో పలకరించారు. భగత్ సింగ్ తల్లి అతన్ని ఆఖర్న కలిసింది. ఆమె అతన్ని మామూలుగా 'భగన్ వాలా' అని పిలిచేది. అతన్ని ముద్దుపెట్టుకుంటూ ఆమె "భగన్ వాలా! నీ ఆశయాన్ని విడనాడకు. ఏదో ఒకనాడు ప్రతివారూ మరణించాల్సిందే- కానీ ప్రపంచం మొత్తం జ్ఞాపకముంచుకొనే చావు ఉత్తమమైంది. ఈ త్యాగాన్ని ఒక మహోన్నత ఆశయంతో చేస్తున్న నీలాంటి పుత్రుని తల్లిగా నేను ఎంతో గర్విస్తున్నాను. నీవు ఉరికంబంపై ఊగుతూకూడా 'ఇంక్విలాబ్ జిందాబాద్' (విప్లవం వర్ధిల్లాలి) అంటూ ఎలుగెత్తి అరవాలి. నీ బరువు పెరగాలేకాని తరగరాదు."

మృత్యువును కౌగలించుకోబోయే కొమారుడికి వీడ్కోలు చెపుతూ ఆవిడ చెప్పిన మాటలు మరువరానివి. నేడు విప్లవానికి తమ తనయుల నర్పించిన మాతృమూర్తులు ఈవిడ త్రోవ ననుసరింతురు గాక!

తన తల్లి సామాన్య స్త్రీలా దుఃఖించక యిలా ధైర్య వచనాలు చెప్పుతుంటే భగత్‌సింగ్ ఆనందంతో పుబ్బి తబ్బిబ్బయ్యాడు.

"అమ్మా! నీ సందేశం తప్పక అమలు జరుపుతా" అంటూ హామీ యిచ్చాడు.

గాంధీ - ఇర్విన్ ఒడంబడిక కుదిరింది. దాన్ననుసరించి విప్లవకారులు మినహా మిగతా రాజకీయ ఖైదీలందరూ విడుదల చేయబడతారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురుల మరణశిక్ష మార్చడానికి ప్రభుత్వం అంగీకరించలేదు. పైగా ఈ ముగ్గుర్ని త్వరలో కరాచీలో జరగబోయే అఖిలభారత కాంగ్రెస్ మహాసభలకు ముందుగానే వురి తీయమని ప్రభుత్వాన్ని గాంధీ ప్రాధేయపడ్డాడు.

మరణశిక్షలు మార్చటానికి ప్రభుత్వం నిరాకరించిన వెంటనే దేశంలో తీవ్రమైన ఆందోళన చెలరేగింది. సంతకాల పత్ర్యమాలు దేశం వివిధ ప్రాంతాల నుండి టెలిగ్రాంలు ప్రభుత్వానికి కుప్పతెప్పలుగా రాసాగాయి. ప్రీవీ కౌన్సిల్ కూడా మరణ శిక్షను మార్చడానికి నిరాకరించింది. దీంతో పంజాబ్‌లోని యువకులు మండిపోయారు. ఈ అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందిగా దేశంలోని ప్రజల్ని ప్రబోధిస్తూ వారు ఎన్నో పోస్టర్లు వేశారు- కరపత్రాలు పంచారు. లాహోర్, ఫిల్లార్, అమృత్‌సర్‌లలో వేసిన పోస్టర్లలో ఉర్దూలో 'రక్తానికి రక్తం బదులుతీర్చుకొంటాం' అంటూ రాశారు. కరపత్రం యిలావుంది: "పీరులైన భారత యువకులు బ్రిటిష్‌వారు సాగిస్తున్న రోజువారి అణచివేత చర్యల్ని సహిస్తూ మిన్నకుంటున్నారు- ఎంత అవమానకరం! ఒక ప్రక్క- భారత స్వాతంత్ర్య సమరయోధుల్ని నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వం చంపేస్తోంటే మీరు చూస్తూ మిన్నకుండిపోతున్నారే? భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను వురికొయ్యల పాల్జేస్తూంటే మీ ఆత్మాభిమానం మీకు కర్తవ్య ప్రబోధం చేయడం లేదా? ప్రభుత్వం అనుసరిస్తోన్న ఈ విచ్చలవిడి చర్యకు మీరు తగిన గుణపాఠం నేర్పాలి. పనికిరాని ఒక పోలీస్ ఆఫీసరు (సాండర్స్) హత్య చేయబడడంతోటే, తమ బ్రిటిష్ సామ్రాజ్యం మొత్తం కూలదోయబడుతుందనే భయంతో గజగజలాడి ప్రభుత్వం ఈ దమనకాండకు పూనుకొంది. కానీ, మీ సోదరులు ముగ్గురిని వురి స్తంభాలెక్కిస్తుంటే- ప్రతీకారం తీర్చుకొనడానికి రంగంలోకి దూకకపోవడం ఎంత సిగ్గుచేటు!

"మరణశిక్ష వుత్తర్వులిచ్చిన వెంటనే మీరు ప్రతివారూ ఒక అగ్నిగోళంగా మండి, విప్లవాగ్ని రగిలించి, దేశంలో నలుమూలలా వ్యాపింపజేసి, గవర్నర్ ఒక్కడ్నే కాదు- అటువంటి వేలాది మందికి మరణ సందేశాన్ని అందించాల్సింది."

గాంధీ - ఇర్విన్ ఒడంబడిక

గాంధీ అప్పుడు వైస్‌రాయ్‌గావున్న ఇర్విన్‌తో 1941 ఫిబ్రవరి, మార్చిల్లో జరిపిన సంధి ఒడంబడికల ముందు ఈ విప్లవకారుల మరణశిక్ష మార్చడానికి నామ మాత్రంగా సంప్రదించాడు. వైస్‌రాయ్‌కి అలా మార్చడానికి అధికారమున్నా దాని కంగీకరించలేదు. గాంధీ తమ ఒడంబడికకు మరణశిక్షను ఒక షరతుగా పెట్టగలిగీ కూడా అతను పెట్టలేదు. తన 'యంగ్ ఇండియా'లో గాంధీ ఈ విషయమే రాసు కొన్నాడు.

'ఈ కుర్రాళ్ళను కరాచీ కాంగ్రెస్ సమావేశాలకు ముందుగానే వురితీయండ'ని ప్రభుత్వాన్ని కోరిన ఒక 'నాయకుడు' వీరి వురిశిక్ష మార్చడానికి ప్రయత్నిస్తాడను కొనడం పొరపాటు.

వార్ని (భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు) ఉరి తీసింతర్వాత వారి స్మారక సంఘానికి తన సహకారం నిరాకరిస్తూ గాంధీ రాసిన వుత్తరం అతని సంకుచిత తత్వాన్ని అద్దంపట్టి చూపుతుంది.

"భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు స్మారక సంఘ కార్యదర్శికి-

ప్రియ మిత్రుడా !

నీ 13వ తేదీ ఉత్తరం- నీవు చూపిన కారణాలు నాకు రుచించలేదు. స్మారకం ఎవరికోసమైతే నిర్మిస్తామో వారి చర్యల్ని మనం అనుసరించాలి. రాబోయే తరానికి కూడా అలా ఆచరించమని అది ఆదేశంగా వుంటుంది. నేను ఈ స్మారక నిర్మాణానికి ఏవిధంగానూ సహకరించను. మీ ఆశయాన్ని నేను గుర్తించను.

యం. కె. గాంధీ

20-6-1931"

గాంధీ - ఇర్విన్ ఒడంబడిక 1931 మార్చి 5వ తేదీకి ముగిసింది. దానివల్ల విప్లవకారులు మినహా మిగిలిన రాజకీయ ఖైదీలందరు విడుదల చేయబడ్డారు.

గాంధీ వైఖరి గురించి ఐ. ఎన్. ఏ. జనరల్ మోహన్‌సింగ్ ఇలా రాశాడు : "అతడు (గాంధీ) తలిస్తే భగత్‌సింగ్‌ను వురిశిక్ష నుండి తప్పించగలిగేవాడు- కానీ, అతడు వుద్దేశపూర్వకంగానే అతన్ని తప్పించలేదు. అతడు ఈ సాహస యువకుడి విడుదలని జాతీయ సమస్యగా చేయగలిగేవాడే! అప్పుడు దేశం మొత్తం త్యాగానికి సిద్ధపడేది. ఈ చర్యతో అతడు భగత్‌సింగ్‌ను అతని అనుచరుల్ని చావు నుండి

తప్పించ గల్గేవాడు. కానీ అతడు అహింసా మిధ్యావాదపు వూబిలో కూరుకుపోయి, భగత్‌సింగ్ విడుదల విప్లవకారులకు బలం చేకూర్చగలదనే ఆలోచనతో అటువంటి పరిస్థితిని భరించలేక పోయాడు."

గాంధీ-ఇర్విన్ ఒడంబడిక ప్రజాద్రోహంగా దేశంలోని యువకులు దాన్ని తీవ్రంగా నిరసించారు. అనేక ప్రజా సంస్థలు ఈ ఒడంబడికను లొంగుబాటు విధంగాను, ప్రజాద్రోహ చర్యగాను వర్ణిస్తూ దాన్ని త్రోసిపుచ్చారు.

గాంధీ-ఇర్విన్ ఒడంబడిక జరిగిన రెండు రోజుల తర్వాత 1931 మార్చి 7న ఢిల్లీలో గాంధీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఒక కరపత్రం పంచబడింది. అందులో యిలా వుంది:

"ఎక్కడుంది నేడు శాంతి? తుపాకి గుండ్లకు గురై మరణించిన తనయుల కొరకు దుఃఖిస్తున్న తల్లుల గుండెల్లోనా? ఉరిశిక్షల కెదురుచూస్తున్న కొడుకుల తలచి ఏడుస్తున్న మాతృహృదయాల్లోనా? తమ్ము విధవలుగా విడిచివెళ్ళిన భర్తలకోసం విలపిస్తున్న అమాయక ఆడబడచుల్ని- విదేశీ నిరంకుశ పాలకుల బంధిఖానాల్లో జీవిత ఖైదీలుగా మ్రగ్గుతున్న తమ భర్తలకోసం రోదిస్తున్న స్త్రీలని అడగండి- మీ శాంతి, అహింసలు ఎక్కడున్నాయి. ఈ నీచమైన ఒడంబడికకు మీరు భాగస్తులుగావుంటారా?"

'అహింసావాది' అసలు రంగు

రష్యా విప్లవ విజయంతో ప్రభావితులైన భగత్‌సింగ్ అతని అనుచరులు విప్లవ పథంలో భారతదేశాన్ని నడిపించి, దోపిడీలేని సోషలిస్ట్ సమాజాన్ని స్థాపించాలనే ధ్యేయంతో నడుస్తున్నారన్న విషయం గాంధీకి, కాంగ్రెస్ నాయకులకు బాగా తెలిసింది. తాను ఈ విప్లవకారుల మరణశిక్ష మార్పుకు తీవ్రంగా, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే దేశంలో అప్పటికి తన నాయకత్వం పట్ల ప్రజల కేర్పడిన గురి తప్పిపోతుందనీ, దేశం మొత్తం విప్లవపథంలో నడిచి, సాయుధ పోరాట మార్గంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని తరిమికొట్టి, శ్రామిక నియంతృత్వం ఏర్పడే ప్రమాదముందని గాంధీ భయపడ్డాడు. తన 'అహింసా సిద్ధాంతం', 'సత్యాగ్రహాల్ని' ఎవరూ ఖాతరు చేయరనే సత్యాన్ని ఆయన గ్రహించాడు. తన 'నాయకత్వం' చేజారిపోతుందని గుండెదడ పట్టుకొందతనికి. కరాచీ కాంగ్రెస్ లోపల, బయట తన్ను నిలవేసి భగత్‌సింగ్, అతని అనుచరులు వురిశిక్ష మార్పును ఇర్విన్‌తో ఒడంబడికకు ముందు ఒక షరతుగా ఎందుకు పెట్టలేదని అడగవచ్చు. ఇవన్నీ ఆలోచించే గాంధీ ఈ విప్లవ

కారుల్ని కరాచీ కాంగ్రెస్ సమావేశానికి ముందే వురితీయమని కోరాడు. స్వాతంత్ర్య పోరాటం సాగిస్తున్న దేశీయుల్ని వురితీయడానికి సామ్రాజ్యవాద ప్రభువులను, అందునా శత్రువును ప్రోత్సహించిన గాంధి అహింసావాదేనేమో ఆలోచించాలి.

ఉరిశిక్ష అమలు

బ్రిటిష్ పాలకులు దేశంలో యింత పెద్దఎత్తున ఆందోళన సాగుతున్నా, గాంధీ సహకారము, కాంగ్రెస్ వత్తాసు తమ కున్నాయనే ధైర్యంతో, గాంధీ కోరిక ప్రకారమే కరాచీ కాంగ్రెస్ సమావేశానికి పూర్వమే అనగా 1931 మార్చి 23 తేదీ రాత్రి 7 గంటలకు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారు.

ఆ రోజు సాయంకాలం 5 గం. నుండే వారు 'ఇంక్విలాబ్ జిందాబాద్' (విప్లవం వర్ధిల్లాలి), 'డౌన్‌డౌన్ యూనియన్ జాక్' (బ్రిటిష్ జండా దిగిపోవాలి), 'డౌన్ విత్ ఇంపీరియలిజం' (సామ్రాజ్యవాదం నశించాలి) అంటూ నినాదా లిచ్చారు.

చివరి నిముషందాకా వారు 'విప్లవం వర్ధిల్లాలి' అంటూ నినదించారు.

ఒక విప్లవ కారుడు మరణిస్తే
ప్రభవింతురు వేయి మంది.

[ఈవ్యాసం రాయడానికి నాకు ఈ క్రింది పుస్తకాలు ఆధారం: 1. Shaheed Bhagat Singh - A Biography by Punjab University, Patiala. 2. క్రాంతికారి భగత్‌సింగ్ (హిందీ) రచన: సుదేశ్ — ముదార్ వేణు]



నా రక్తం వృథాకాదు
నా మృత్యువు వృథాకాదు
నా నెత్తురు కోనేరులో
నవలోకం వికసించును

నా మృత్యువు సన్నిధిలో
జీవరవళి వినిపించును
ఉరికంబంమీద నిలిచి
విప్లవనాదం చేసెద
విజయ నినాదం చేసెద

కథ:

సంఘం

అల్లం రాజయ్య

1

వీరారెడ్డి ధుమధుమ లాడుతున్నడు- మాటిమాటికి తల విదిలించుకుంట కాలు గాలిన పిల్లోలె, నిప్పుతొక్కిన కోతోలె ఎగరెగిరి పడ్తండు. తన మనుసుల తనే ఏందేందో గులుక్కుంటాండు- వీరారెడ్డి దొర గిట్లెందుకున్నట్టు? దొరకు తక్కువైందేంది? అసలు వీరారెడ్డి ఇయ్యాల్ల మంచాల్నుంచి లేసుడే మంచి యాల్లన లేవలే- లేవంగనే రోజు లచ్చిందేవి పటాన్ని చూసేటోడు ఇయ్యాల్ల పెద్ద పెండ్లాం మొఖం సూడాల్సచ్చింది- గట్ల చూసినందుకే ఏం జరుగనున్నదోనని నారాజి అయిపోయిండు. గందుగనే పెద్ద పెండ్లాన్ని "ఏమే- పొద్దాల[1] పొద్దాల నాకండ్ల బడద్దని నీ కెన్నిసార్లు సెప్పిన ఖాతరు చేత్తలేవ్[2]" అన్నడు. అలవాటుపడ్డ మనిషిగన్క- ముఖం ముడ్సుకొని ఎల్లిపోయింది. ముఖం మాడిన మక్క కంకోలె మాడ్సుకొని మంచాల్నుంచి లేసి సుట్ట ముట్టిచ్చి లోగింట్ల[3] నుంచి ఈవలకచ్చిండు- ఈవలకచ్చి ముఖం ఇంకింత మాడ్సుకున్నడు.

బంకుల[4]ముందు చేతులుకట్టుకొని తలలు వేల్లాడేసుకొని పాలేరోల్లునిలుసున్నరు. "నాగండ్లు కట్టబోయినోల్లు గిట్లచ్చిండ్రేంద"ని వీరారెడ్డి అనుకోకముందే పెదపాలేరు గట్టయ్య ముంగటి కచ్చిండు.

"అగ్గెరుఘాము[5] నాగండ్లేసుకొని లచ్చుపల్లని బాపతు గుట్టకింది సెలుకలకు[6] దున్నబోయినమ్ పటేలా! నాగండ్ల కొడారిప్పి[7] సయిజేసుకునేటాల్లకు నీ బాంచెన్ ఎక్కన్నుంచచ్చిండో లచ్చిమల్ల దురికచ్చి నాగండ్లిప్పేసిండుండ్రి" సావు కబురు సల్లంగ చెప్పిండు.

"మీరేం జేసిండ్రి ఆడిగుల్ల లంజకొడుకుల్లాలా! వాడు ఆ గులాపు[8] లంజకొడుకు నా నాగండ్ల కడ్డమత్తె గిద్దెలకుగిద్దెలు పెట్టుబడి తీస్తుంట మీరు చేతులూపుకుంట గీడికచ్చిండ్రి- మూసాలు లేవు బంచత్[9].... దొర పాలేరోల్లంటె ఖదరు లేకుంటయ్యింది. తు: మీ నోట్లె.... ఏంపుటక పుట్టిండ్రి- ఆడిపుటుక[10]పుడితె ఎవడన్న సేసుక బతుకు- తు:...."

---

1. పొద్దటివేళ 2. లెక్కచేస్తూలేవు 3. లోపలి యిల్లు 4. ఇంటి ముందరి అరుగు 5. ఉదయం 6. చేన్లకు 7. కొడారి (తాడు)ను విప్పి 8. బానిస 9. తిట్టుమాట 10. ఆడజన్మ

"అదిగాదు పటేలా! అయినన్నడు...."

"అయినెవ్వరాఁ- నీ మొగుడు! వాని పెండ్లాన్ని పెదమాదిగోడెత్తుక పోను- వాడేమంటడు?"

గట్టయ్య ముఖం మాడ్చుకున్నడు. వాలిపోయిన చెవులు రాసుకున్నడు. మనుసులోపటి మంట ముఖంలోపటి మంట కన్పియ్యకుంట తల వంచుకున్నడు. తలవంచి అలుకు జల్లిన ఆకిలి[11]ని అటెనుక[12] వీరారెడ్డి కాల్లను, కాల్లకున్న చెప్పులను చూసిండు. అత నెనుకున్న ముసలి పాలేరు ఏంముంచుక రాగలదోనని గడగడ వనికిండు. అసలే అంగిపోయిన[13]మనిషి ఇంకింత అంగిండు. ఇగ అందట్ల పడుసోడు దొరగారి బఱ్ఱె పెయ్యోలె నిమ్మకు నీరెత్తినట్టు నిలుసుండి మొగులుకెల్లి[14] అటునుంచి ఏపసెట్టు కొమ్మల్లకు సూసుకుంట నిలుసున్నడు మాట పలుకు లేకుంట- పడుసోనికి వీరారెడ్డి మొఖం సూడాల్నంటె రోతగ వున్నది. అతను గుడుక[15] రైతు కూలి సంఘంల చేరిండు మరి.

వీరారెడ్డి కొత్తకొండీరన్న పూనినట్టుగ తిడ్తనే ఉన్నడు. నోట్లెనుంచి పురుగులు రాలినట్టుగ, గబ్బువాసన గుప్పుమన్నట్టుగ, ఒకటే బూతులు. కూలోల్లను, రైతులను, సంఘాన్ని కలివిడిగా విడివిడిగా అంకసెండాలం కడిగిపోత్తండు. తిట్టి తిట్టి నీర్స మచ్చింది- గొంతు బొంగురు బోయింది. పొద్గాల[16] ఇంకా చాయ్ గుడుక తాగలే- అదిగాక సారన్న[17] పుక్కిలించలే- ఇగ మరెట్ల? అలసటచ్చింది. అరుగుమీని కుర్చిల కూకున్నడు- కూకుండి గద్దకండ్ల టపటప లాడిచ్చిండు- గప్పుడు బక్కసిక్కిన గట్టయ్యను సూసిండు.

"తాములు[18]పటేలా తాములుకురాండిఁ- మామీన ఉరుకులాడ్తెట్ల?" గట్టయ్య అన్నడు.

"అవుతల ఇల్లుగాలిపోతంటె పేలాలేరుక బుక్తుత నన్నట్టు తాములేందిర?.... తాములు తర్దెం.... ఇల్లు ముంచిండ్రు గదరా!"

గప్పుడు గట్టయ్య అసలు సంగతి చెప్పిండు;

"అబ్బ! ఆడెక్కన్నుంచచ్చిండో పటేలా! ఒడిసెల రాయోల్గె అచ్చిండు. అచ్చినోడు సీదా నాగండ్ల కాడికి రాలే- తూర్పు పుట్టగడ్డమీనికెక్కి నిలుసుండి సేనంత పారసూసిండు- సూసి కీకేసిండు- పులితీర్గ[19] అరిసిండు. గానితోనేందని[20] నాగండ్లు

11. వాకిలిని 12. ఆ తరువాత 13. వంగిపోయిన 14. మబ్బులవైపు 15. కూడా 16. పొద్దున 17. సారా అయినా 18. శాంతం 19. వలె 20. వానితో ఏమని

సాగిచ్చినం. అయిలిగాని నాగలి ఓసుట్టు పోయచ్చింది- ఇగ నీబాంచెన్ ! అట్ల ఉరి కచ్చిండు బాణం పుల్లోలె ! అచ్చి, అయిలిగాని నాగలి ముంగట నిలబడ్డడు."

"ఎందుకోంట ? మెడబలిమి లమ్డికొడుకు ! పురుగు బుసి దిని పుట్టలుండ బుద్ధ యితలేదా ? మాకెలవుడా ![21] ఏమనుకున్నాడో ? నేను తలుచుకుంటె- వారీ ! గట్టిగ- మసిరా.... మసి జేత్త- నీ తల్లి ఏమనుకుంటండో- వాని తాడుదొంగ[22]...."

"అడన్నడు.... గీ సేను మీ పటేల్‌దిగాదు- ఇగో గీ రెండు రెక్కలు ఇరుసు కొని పెల్లపెల్లకు పురిసెడు సెత్తురు సారెడు సెమట జేసుకొని సాపు జేసుకొన్న- ఏడేండ్లవట్టి ఏదో దున్నుకున్నడు నా కడుపుమీసకొట్టి, నా పోరగాండ్లను ఆకలికి సంపిండు. ఇగ గా ఆటలేం సాగయి- ఇగో మంచి మాటకు సెప్పుతన్న; నాగండ్లి దుసుకొని సీదా ఎల్లిపోండ్రి-'' గట్టయ్య యిట్ల చెప్పి 'గంతేకాదుర అడన్నది' అని అందరికెల్లి సూసిండు.

గట్ల లచ్చింపల్లయ్య అనలేదని అల్లందరి కెరికె- పడుసోడు లచ్చింపల్ల య్యన్న మాటల యాదికి తెచ్చుకున్నడు: ''వారీ ! గట్టన్నా ! మీకండ్ల ముంగట్నె నా కడుపుమీస కొట్టిండు- సూర్యాపాలిచ్చి ఏడేండ్లు దున్నుకున్నడు- మల్ల బాకి ముట్ట లేదంటండు- గిది నాయమేన ? మీరే ఆలోసించుండ్రి'' 'నిచ్చమే'[23] నన్నరు పాలే రోల్లు. అందరు కూడబలుక్కొని గిట్లంటె గిట్లందా మనుకొని ఇంటికచ్చింద్రు.

"వాని నోట్లె మొ.... గప్పుడు మీరేంజేసింద్ర లంజకొడుకా'' వీరారెడ్డి అరిచిండు.

"దెహెః లంజకొడుకు, గింజకొడుకని నోటికచ్చినట్టదురుతన్నవ్- మంచిమాట రాదా ?" సోరోడు బానయ్య అన్నడు గట్టిగ.

"ఏందేందిర !.... నీయవ్వను కుక్కలు దెం....! ఇప్పటి మాటేందిర ?" వీరారెడ్డి పక్కల బాంబుపడ్డట్టుగ ఉలికిపడి అన్నడు. అని ఊకుండలే- ఊకుండకుంట ఏంజేయాల్నో తోచలే- తోచక చెప్పందుకున్నడు- ఇసిరేసిండు. సెప్పు సోరోనికి తాకుతెట్లుండేదో ? ముసులోనికి తాకింది- నొసలుకు బొడుసచ్చింది. అసలే ఫికరు పడ్తున్న ముసులోనికి మూలిగే నక్కమీన తాటిపండు పడ్డట్టయ్యింది. ఎందుకో ముసు లోడు నొసలు సూసుకొని మెడెత్తి చూసిండు. నోరుమీద కప్పుకున్న మీసాల సందుల్లో "అన్నన్న ! సంపుతివి గదరా దొరోడా !" అన్నమాట ఆగిపోయింది- కని[24] కండ్లల్ల గసొంటి[25]బావం దొరకు కన్పిచ్చింది.

21, 22 తిట్టు మాటలు 23. నిజమే 24. కాని 25. అటువంటి

బానయ్య ముసలోని నుదురు వునికి సూసిండు. వీరారెడ్డి బస్మసురుడే_ అడెవడో బాగోతం సెప్పినట్టుగ గ సేతులతోని ఎందరి కొంపల్నో బస్మం జేసిండు. కని బానయ్య సివుడు కాడు_ సివునికి మూడో కన్ను వున్నదో? లేదో? ఉంటే అది మండేదో? బస్మంచేసేదో నా కెరుకలే గని సివుని సడ్డకుని తీర్గ అతని రెండుకండ్లు మండుతున్నయి. గ సూపుల్ల మంటలే ఉంటే వీరారెడ్డి, గయినె బంగుల కాలి బూడి దయ్యేదే। పాలేరోల్లు గజగజ వనికిండ్రు_ బానయ్య ఏంజేత్తడోనని. కని బానయ్య ఏంజెయ్యకుంటనే పెద్దపెద్ద జంగలేసుకుంట పెద్దరువాజకెల్లి నడిసిండు_ పెద్దరువాజను ఝాడిచ్చి తన్ని బయటి కెల్లిపోయిండు_ బిలబిల సూడంగ.

వీరారెడ్డి తల గిర్రున తిరిగింది_ అయిదు నూర్లెకరాల దొరను, బార్లమేడలు గల్గిన దొరను_ ఎండి బంగారు, పాటికి బర్లు, నాగటికెడ్లు, పెద్దనోరు, ఊరునిండా, ఊరవతలా పలుకుబడి గల్గిన ఫలాని ఖాందానికి వారసుడైన దొరను_ ఇద్దరుపెండ్లాలు, ఇనుపపెట్టెల డబ్బు, పట్నంల కొడుకులు, పరాయిదేశంల కూతురు గల్గిన దొరను.... పెయికంగిలేని[26] మూతిమీద సరిగ్గ మీసాలన్న మొలువని బానడు_ కాకుంటె తొస్సె దుర్గి, తొంటె కొంరని కొడుకు బానడు_ గంత మాటన్నడు.

'మారె జనం తెలివి మీరిపోతండ్రు_ సాటుమాటుకు కమునిట్టు నా కొడుకు లత్తండ్రంటే ఆల్లేం జేత్తరనుకున్న_ తొండలు ముదిరి పోతస్నయ్_ ఎట్లా?.... ఈ లంజకొడుకుల నెట్ల అనుగ్గొట్టాలె?' వీరారెడ్డి లేసి నిలబడ్డడు.

ముసలోడు ఇంకా వనుకుతనే ఉన్నడు.

"బానని కెంత పొగరచ్చింది. ఈపు మీన ముల్లు బెరిగింది బంచత్। వానవ్వ వాని పదమంచకుంటె నీ తల్లి.... సూస్కో_ అదిగొ.... అదెపాయె పిల్లకాకంటె...." వీరారెడ్డి పండ్లు పటపట కొరికిండు.

గట్టయ్య ఏందో చెప్పుతనే ఉన్నడు. వీరారెడ్డి మనసు కెక్కలే_ ఇంట్లకు నడిసిండు. పొద్దు పైకి నడిసింది_ పాలేరోల్లు ఎడ్లకొట్టంకెల్లి నడిసిండ్రు నవ్వుకుంట.

2

గుంపు చింత కింద, మైసమ్మ గుడిముంగట అంబటాల్లకు_ జనం కుప్ప కూడిండ్రు. సంకల్ల పిలగండ్ల నెత్తుకొని, నెత్తిగోక్కుంట ఆడోల్లు_ పేస్తున్న తాళ్లు

26. వంటిపై చొక్కాలేని

సేసుకుంటనే, ముడుత్తన్న సెప్పు ముడుసుకుంటనే సబ్బండ వర్ణాలు మాదుగులు, మన్నేలు, కాపులు, పెర్కలు, గొల్ల, కుర్మ, సాకల్లు, మంగల్లు, కుమ్మరి, కమ్మర్లు– ఎందరైతేంది? ఎన్ని కులాలోల్లయితేంది? కూటికి లేనోల్లంత కుప్పకూడిండ్రు. ఆకలికి కులం లేదని, అన్నానికి ఏరుడ్డం[27] లేదని ఎరుక సేసుకోవటానికి అల్లకు సానేండ్లే పట్టింది. గదంత అటెన్కగని గాళ్ళంతయితె జమయ్యిండ్రు. గట్ల కూడిన దాన్నే రైతు కూలి సంఘ మనుకున్నరు....

లచ్చిం మల్లయ్య దుబ్బల[28] పిచ్చి గీతలు గీసుకుంట తన కడుపు నొప్పేందో ఎరిక జెప్పుకొంటడట. గందుకనే రైతు కూలి సంఘం పెద్ద బొత్తయ్య "వారీ! లచ్చిం మల్లు! గీ కిర్కాట మేందిర?" అన్నడు ఎత్తుబండమీన కూసుండి తుపుక్కున ఊంచి– బొత్తయ్యకు నిచ్చానికి బొత్త ఎత్తుగలేదు– ఈడ్సుక పోయున్నది. సిన్నప్పుడు కూడు దొరకక ఆకలికి అగక మన్నుదింటె బొత్త సీల్లకాగోల్లె అయితె బొత్తోడుగ పేరువడ్డది. బొత్త పెద్దగ ఇప్పుడు లేకున్నా సేతులు పొడుగ్గా, సండ్రు సాగ కర్రిలోల్లె ఉన్నయి. అతని శరీరం మాగిన కుందోల్గున్నది. అతని కండ్లు చిన్నగున్నా బడే తేజుగున్నయి. అతనికి గియ్యన్నున్నా అయ్యన్నిటిని కప్పుకునేటందుకు పూరగ పేలికలేదు. ముడ్డికట్టుకున్న పేగు ఏరంగుదో ఎన్నేండ్లదో?– బొత్తయ్య గీ సంగం గింగం లేకముందు ఎత్తుబండల జూసినా ఎర్రెకండ్ల దొరను చూసినా బుగులు పడేటోడు. గ ఎత్తుబండ లెక్కేంత తీరుపాటం ఉండేదిగాదు– వారాల తరబడి సేన్లమీదనే ఉండెటోడు– గ పల్లెల అందరికన్న పూరగ బీదోడెవడంటె గ బొత్తయ్యే– అయినె పెండ్లాం సుక్కపోసు రయికె లేక ఉప్పుమిరపకాయకు ఊల్లెకు బోదు– పక్కున సవ్వెరుగదు– పదిమందితోని మాట్లాడెరుగదు– బొత్తయ్యకు ఆకలెరికె– మల్ల గ ఆకలితోటట్టు తను అరుగాలం కట్ట పడ్డా కడుపు నిండక పోవటానికి దొరలే కారణమని అతనికి ఎవలు చెప్పకుంటనే తెలుసు– సిన్నమెత్తు కట్టపడకుంట ఆళ్లెట్ల ఎంత మందిని ముంచి పైకచ్చిండ్రో ఇగురంగ ఎరికే.... మల్ల మల్ల దోపుకం[29] పోవాలంటే ఎదురుతిరుగుడు తప్ప ఇగ వేరే దారి లేదని ఈ మజ్జెన ఎరుక జేసుకున్నడు. తన తీర్గ తనొక్కడే కాదని కోట్లమందున్నరని– అల్లంత కుప్పకూడుతండ్రని, కూడి కలెబడతండ్రని, గెలుపు ఎప్పటికయినా తన సొంటిదేనని అతనికి మా దండినమ్మకం. గరీబెత్తం ఎంత ముదనష్టపుదో అదెట్లా కూలోల్ల కొంపలు కూలగొట్టగలదో? గ గరీబెత్తం ఎవలు కారణమో అతని కెరకె– అతని పసిపిలగండ్లిద్దరు కూడులేక కండ్లముంగట సచ్చిండ్రు. మల్ల వీరారెడ్డి

27. పేర్పాటు 28. మట్టిలో 29. దోపిడి

కొడుకులు పున్నమి సంద్రునితీర్గ దినదినం ఎట్ల ఎదిగి పోయిండ్రో అతని కెరుకే- గయ్యన్ని ఎరుకజేసుకొని గ ఊళ్ళోల్లకు ఎరుకజేత్తుండు గన్కనే సంఘము పెద్దజేసింద్రు.

"కిర్తాట మేందే బొత్తన్నా! మీకందరి కెరికలేందేంది? కడుపుకు సాలక నేనుంటె కడుపుల కత్తులు పారుడయినట్టుగ కములపోతు గుండాపచ్చి సచ్చె- కాల్రెక్క లిరిగి కుప్పబడినట్టాయె. అనీని కాల్లు గడుపులు మొక్కంగ గ ఈరెడ్డి కాడ గుట్టకింది సేను రయినుకు[30]బెట్టి నూరు రూపాలు తెచ్చుకున్న- మా బక్కరాజి పుటుక- ఎన్నేండ్లయ్యిందో?...." ఎన్నేండ్లో లెక్కతేలక తల గోక్కున్నడు లచ్చింపల్లు.

ఎవడో కిసుక్కున నవ్వి 'ఏడేండ్ల'న్నడు.

"అగో ఏడేండ్లయ్యిందట- ఏటా గ సేను దున్నుకొని పండిన పంట తీస్కుంటుండు- మల్ల రెండేండ్లు కల్లంమీనిచ్చి అడ్డి[31] గావాల్నని కుంచం బిందేసి కిటకిట మూడు బత్తాలు నింపుక పోయిండు- అప్పిచ్చినప్పుడు సేనుకు మునాఫా[32]లేదు, రూపాలకు అడ్డి లేదన్నడు- కని ఇప్పటిదన్క ఈరెడ్డి కెంతముట్టిందో మీరే లెక్కచేయిండ్రి."

"అమ్మ! లంజకొడుకు! నాలెముచ్చు.... గిట్లజేసే గంత సంపాయించిండు" ఎవలో అరిచిండ్రు.

బొత్తయ్య తలగోక్కొని ఏల్లు మలిసి పిటపిట సదివిండు.

"బొ.... నిచ్చమే.... ఎంత లేదన్న ఏలు ముట్టినయ్"

"బొ.... నిచ్చమే- నిచ్చమే...." మరిన్ని గొంతికలు పలికినయ్.

"మల్ల ఏంజేత్తామంటరు ?...." బొత్తయ్య.

"చేసేటి దేమున్నది? అంగుతె తొక్కుతరు- నిలబడాల్ననె గద మనం సంఘం పెట్టుకున్నది? గీ ఊళ్లె దొరలు గింతగనం సెల్లిచ్చుకుంటాంటె ఇగ ఎక్కడూకుంటం- సంఘ మెందుకున్నది- గిసొంటి ఏల్లల ఆదుకోకుంటె- సప్పట్లుగొట్టి సెమ్మ సెక్క లాడుకోనా? పాటలు పాడి అదచ్చె ఇదచ్చెనని సంబరపడటానికా? నా కెరుకలేకడుగుత- గన్నెకురాల భూమి ఆడు గద్దాము మీని కుక్కోలె ముడ్డికింద పెట్టుకునేదేంది? దున్నెటోన్కె భూముండాలె...." బాసయ్య అన్నడు.

"సోరోనివయిస[33] రామసక్కదనాల మాట సెప్పినావురా బానాలు" ఓ ముసలోడు మెచ్చుకున్నడు.

---

30. తాకట్టు 31. వడ్డీ 32. పంటలో వాటా 33. పడుచువాడు

“నసరాదురా! ఉచ్చిలోడా! అన్ని ఒక్కపారే అత్తయా? ఎనుకా ముంగట ఇసారం సేయద్దా?” బొత్తయ్య ముసిముసి నవ్వుత అన్నడు.

“హుం.... గుడిసెలు కాలిపోతుంటే ఎడ్డి బొమ్మడు అయ్య వారాని వచ్చినట్టు గున్నది సూడవోతే.... నపుతండు సూడు!” ఆడమనిషి గునిసింది.

రాయమల్లు నెత్తి గోక్కుంట నిలుసున్నదల్ల నోరు తెరిచింది.

“ఏందయ్య సూసేటిది? మా దండి పెద్దమొగోల్లు– తునికాకుల[34] కోతలప్పుడు కట్టకు ఏకాని[35]య్యమంటె గిట్లనే నీల్గలేదా? ఏకానకు మూడు జోడా లేసుకుంటననె– అని సొమ్మేం పోయింది? రాల్లల్ల రప్పల్ల చెట్టుచెట్టుకు దిర్గి కొమ్మకొమ్మకు పాకి ఆకులు కోస్తత్తె లేతాకనె, పచ్చలాకనె, ఆకరికత్తె గాలికి తూరుపాల బట్టె, పందిరిమీన ఇసిరేసుకునె, ఉల్వ[36] కట్టలకోసం జూసె– ఆఖరుకు దిగచ్చిండా లేదా? ఎక్కువతక్కువ మాట్లాడ్తె ఎండిన కట్టలు కల్లం మీనియి ఎవలయాళ్ల కట్టుకపోతమని ఎగబడితె– గప్పుడు రోగం దిర్గి అన్నంత పారేసిండు. అడుగంది అవ్వయిన బెట్టది– గింత మందుండంగ గ శంకర్రెడ్డి పచేలు మొగులుమీని కెగిరి పోతడా? గట్ల సాతగాక పోతె గాజులు పెట్టిచ్చుకోరాదుండ్రి” చేతులు తిప్పుకుంట చెప్పింది.

"ఔన"న్నరు కొందరు....

బొత్తయ్య పత్తాయించిండు.

“సరే! ఇయ్యాల్నె పంచాతు[37]” అన్నడు ఆఖరుకు.

“ఇంతకు మునుపు లెక్క– పంచాతి మూడు పానాదుల కాడి రాలసెట్టుకిందద్దు– గ భూమిల్నె జరుగాలె” వోటుగాలెంకటి అన్నడు.

“ఇంక పంచాతేందుర్ర? అహం నాకెరుక లే కడుగుత– భూమి లచ్చింపల్లనిది, సోకు పటేల్ది– సొమ్మోడు సొమ్మెత్తుక పోంగ ఇంక బిడ్డమొఖం సూరపోక....”

“నసరాదుర్ర.... పనగ్గాకున్న ఆళ్లకు గావాలెగద” బొత్తయ్య సదిరిచెప్పిండు.

సభ అఖరయ్యింది....

3

పంచాతు రాలసెట్టుకింద గాదు, గుట్టకింది రాల్ల సేన్ల– తీర్పు పెద్దలు పట్వారి ధర్మయ్య, పెద్దిరెడ్డి, నారాయణ, లచ్చుమారావు కాకుండ– సబ్బండవర్నాలు; మాదు

34. బీడీ ఆకులు 35. ఒక అణా 36. మామూలు (లంచం) 37. పంచాయతి

గులు, మన్నేలు, కాపులు, పెర్కలు, గొల్ల, కుర్మ, సాకల్లు, మంగల్లు, కుమ్మర్లు, కమ్మర్లు.... ఎవలైతేంది కూలి నా కొడుకులని తెలిపి వీరారెడ్డి తోకతొక్కిన తాసుపాము లెక్క ఎగిరిండు. కాని కాటెయ్యటానికెవడు దొరుకలే- పడగ నేలకేసి కొట్టుకున్నంత బాధ పడ్డడు. గ గులాపు లస్కికొడుకుల కాడికి పోకూడదనుకున్నడు. తనెనుక ఊరి పెద్దలున్నరు. తేజినిపాజి[38] పాజినితేజి సేస్తరని నమ్మి ఆరునూరయిన నూరు ఆరయిన పంచాతు కాడికి పోవాలె ననుకున్నడు.

"ఊరు చరిత్రల అన్ని పంచాతులు రాలసెట్టుకింద జర్గెయి- ఊరికేదో నాశిద గాలం బుట్టింది. కూలి లంజకొడుకులు తెగబడ్డరు. దురు జెట్టకాలమచ్చింది. పారటీలు కడుతుండ్రు. సేస్లె పంచాతంటె ఇదెక్కడి సోద్యం!" ఊరి పెద్దలు సెవులు కొరుక్కున్నరు. తీరుపు ముందే అనుకొని పకడ్బందిగ దాడి చెయ్యటానికి ఏలు కుదరనందుకు తెగ బాధ పడి పోయిండ్రు.

4

ఆ ఊరి రైతుకూలి సంఘ అధ్యక్షుడు బొత్తయ్య ఆనవాయితి పకారంగ ఆ మాటను పొరుగూల్ల సంఘాల కెరుకజేసిండు. పొరుగూరి సంఘం పెద్మలు[39] పంచాతు కోసరం హుటాహుటిన అచ్చిండ్రు.

5

నెత్తిమీనికి పొద్దచ్చింది- మాడ మాడిపోయెటంత మండుటెండ- మృగశిర తొలి పాదం ఉన్నది. వారం రోజుల కింద భూమి తడుపు వాన కొట్టింది- గదాన్ని సూసుకొనే వీరారెడ్డి తొలిసాలు కోసం నాగండ్లు కట్టిచ్చిండు.

ఎర్రటెండల సేస్లె కచ్చిండ్రు రావాల్సిన వాల్లంత- సేస్లె అటిటు దిర్గిండ్రు- పెద్దమనుషులకు చిర్రెత్తుకత్తాంది. గీ పంచాతంత ఉల్టా ఉన్నది. ఉత్తరపు గెట్టు మీది చేకు చెట్టుకిందికి చేరిండ్రు పెద్దలు- గడంచలు, కుర్సీలు లేనందుకు సుంకరోల్లు, వంతగాల్లు లేనందుకు ఏసుక్కొని తలో పెద్ద రాయి సూసుకొని కూసున్నరు. అంత దూరం నడిసచ్చినందుకు ధర్మయ్యకు నిలువెల్ల సెముటల్ కార్తున్నయి- పెద్దిరెడ్డికి ఎర్రటెండను సూత్తె పెద్దమ్మ పూనినట్టుగున్నది.

ఇగ వీరారెడ్డికైతె ఇదంత చాన రోతగా, తలకొట్టేసినంత నామర్దాగ[40] ఉన్నది. అదిగాక సుంకరోల్లను గెదిమి గీల్లను తను పనుల కాడోల్లను ఇగ్గుకచ్చేది బోయింది-

38. సత్యాన్ని అసత్యంగా 39. పెద్దలు 40. అవమానంగా

బాకున్నందుకు లచ్చిమల్లని ఈవు చీరేసి బండలెత్తేది బోయింది- మాట్లాడటానికి గజగజ వనికే మంది గిక్కడ కుప్పకూడి తననే పంచాతుకు పిలిసిండ్రు- ఏకుమేక యింది. ఒంటిగ ఎవనికాడు ఉండి కులతప్పులతో తన్నుకొని సచ్చే కాలం బోయింది. ఏ మచ్చుమందు జల్లినట్టు గీల్లంత ఎట్ల ఒక్కటయినట్టు ? పెయి కంగీలు లేని కూలి నా కొడుకులు, పూటకు గతి లేని లంజకొడుకులు ఎంతకు తెగిచ్చిండ్రు ! ఒక్కొక్కన్ని మట్లకు గట్టేయించి ఎర్రబెండల చింతబరిగెలతోని తోలు ఒలిపిచ్చి కారంపొడి అద్దాలె బంచత్.... సకురాలు సేత్తండ్రు- రాజ్జెం మంచిగలేదు. కాసూళ్లెక్కువయినయి- కోరుళ్లెక్కువయినయి. గీ లంజకొడుకుల జేల్లకు తోలాలె- వీల్ల అంతం సూత్త.... ఏడికి బోతరో సూత్త- కానున్న పనిని గంధర్వులే సేత్తరు. మా అంబె యిన్ని రూపాల్ అమీన్ మొఖాస గొడ్తె...." అనుకుంటాండు మనుసుల.

బొత్తయ్య దూరంగా ముంగాల్లమీద కూకున్నడు- అతనెనుక మిగిలిన మంది. పొరుగూరి బండయ్య బొత్తయ్య పక్కకు నిలుసున్నడు- అతని పక్కకు ఇంకో ఊరి సంఘ పెద్ద రామలచ్చులు పర్వతమోలె నిలుసున్నడు ఊరి పెద్దల అసహ్యంగ సూసుకుంట....

అందరు మాటపలుకు లేకుంటున్నరు- కని అందరి మనసుల్ల ఇసారాలున్నయి.

ధర్మయ్య అగ్గిపుల్ల గీకి సుట్ట ముట్టిచ్చిండు- ముట్టిచ్చి నిలుసునోల్లను, కూకునోల్లను ఓపారి కలెజూసిండు- ఎవనెవని మనుసు లేమున్నదో అల్ల ముఖాలె చెప్పు తన్నయి. ఓ ఎత్తుబండ కాని నిలుసున్న వీరారెడ్డి ముఖంలకు సూసి "పర్వాలేద" న్నట్టుగా బుచ్చికారి[41]నవ్వొకటి నవ్వి పొగనూదిండు. అవెనుక సేనును కలెసూసిండు. "సేను బంగారి తునుకే- అరుపైనా[42] ఆనయినా పుట్టెడు జొండ్లు ఒల్లఖ్ఖాలకు పార బోత్తది.... అబ్బో రెడ్డోని కన్ను మంచిదే- ఏదేరిన కంటికి ఆనిందాన్నే[43] ఏరుతడు" అనుకొని సేను పక్కకున్న అడివిని సూసిండు- "ఎంత కట్టె దెచ్చుయినా గిదీంట్ల పాతర బెడితె ఒకనయ్యకు తెల్వదు. మాగినయో[44] అడిగెటోడెవడుండడు" అనుకున్నడు.

"సూడుబిడ్డా ! బొత్తన్నా ! పిల్లజెల్ల మంచిగున్నర్రా ! మంచిగనే ఉంటరులే- కనిపిచ్చుడు బందేసేసినవ్- ముక్కైమంత్రినోంటిది కన్నత్తడు గని నువు కనపడలేవ్.... సరె- ఏందుర్రో ఎవడు మాట్లాడ్తలేరు ! బెల్లం గొట్టిన రాయోలె ఎందుకుంటర్ర ? సల్లకచ్చి ముంత దాసేటిదేంది ? గిది గుర్రం గిది మైదానం.... ఏదో అనరాదుర్రా !

41. కపటం 42. వానలేకున్నా 43. అనిన దానినే 44. పాతబడిన తర్వాత

ఎర్ర ఎండల గింతదూరం నడిపిస్తిరి" అన్నడు ధర్మయ్య- దసిలి తువ్వాల్ల చెప్పుపెట్టి మెత్తంగ గొట్టాల్నని మనుసుల అనుకొని.

"పంతులూ! మీ కెరుకలేం దేమున్నది- ఏడేండ్ల కింద అక్కెరబడి నూర్రూపాలు తీస్కున్న- ఏడేండ్లబట్టి ఏదో నాటపాసనత్తి[45] ఇంతింత కట్టుకుంటనేఅత్తన్న- పైసలిచ్చినేడు, పర్కోటేడు కల్లంమీన కుంచమేసుకొని ఏటా మూడు గిద్దెల జొండ్లు కొంటబోయిండు. నీ బాంచెన్- సంక లేవడితె ఖార్జం కండ్లబడ్తది.... గరీబోన్ని- పైసలియ్యంగ సేనుకు మునాఫా లేదన్నడు రూపాల కడ్డి లేదన్నడు. అసలు పందము కొల్సుక పోయిండు. ఇగ గరీబోన్ని, ఏ దిక్కు లేనోన్ని నా సేను నా కిడిసిపెట్టుండ్రి అని గట్టుకు మొక్కినట్టుగ మొక్కిన- సెషామంటె[46] సెషామన్నడు.... రయిను కాయితం నా దగ్గెరున్నది, నీ తాత్తోటి చెప్పుక పొమ్మన్నడు. ఇగ ఏడబోవాలె బాంచెన్...." లచ్చింమల్లయ్య మందిని జరుపుకుంట ముంగటి కచ్చి అన్నడు.

ఏడి నుంచచ్చిందో లచ్చింమల్లయ్య పెండ్లాం ఎల్లమ్మ సంటిపిలగాన్ని సంకల నుంచి పెద్దోల్ల కాల్ల మీనేసింది.

"గీ పోరని మొఖం సూడుండ్రి బాంచెన్- మావోల్లె కడుపుకు సచ్చె కాలం రాకుంట గ భూమి సెక్క సంపాయించినం.... గది...." అన్నది దీలెపడి.

పెద్దోల్ల కాల్లు ఎనుకకు పోయినయ్....

ధర్మయ్య అఖరి పీల్పు పీల్సి ముక్కులనుంచి పొగ ఊది సుట్ట చెప్పు కాలుకిం దేసి నలిసిండు.

"గదేబిడ్డా! మంచోల్లమో సెడ్డోల్లమో నలుగురం గీడ కుప్ప కూడినమ్. నలుగురున్న కాడ నారాయుడున్నడు- నా కండ్ల ముంగట గిసొంటి భూమి పంచాతులు నా ఎంటికలన్ని సూసిన- మాటమాటకు గిల్లెగిర పడ్డోన్ని నిన్నొక్కన్నే సూత్తన్న. నలుగురుండంగ ఆసకూసక నాగండ్ల కడ్డంబోతివి. అదెరా! ఈ ఊల్లె పెద్దమనుషులు సచ్చిండ్రనుకున్నవ! ఊరు పాడుపడ్డ దనుకున్నవ? సరెరా! సరె.... ఎనకటి నుంచచ్చె ఇలవరిసె[47] కాదని నువు కొత్తసిరత్త[48] తొక్కినవ్- అదెపాయె[49] బిడ్డా! అదెపాయె! మీరంత ఎవలకాల్లు తెలివిమంతులై పోయి, కానూన్‌లు గినూన్‌లు ఎరుక జేసుకుంటె కాదన్నమా? మీటింగులు బెట్టొని పాటలు పాడుకుంటె అడ్దన్నమా?.... ఊరు తెలివిమీది కత్తె మంచిదే గదరా! గదేమాట గాంధీ గుడుకన్నడుగద- గాంధ

45. ఓపిక కొద్ది 46. కాదంటే 47. ఆచారం 48. మార్గం 49. అయితే అయింది

సోంటోడు మీరు తెలివికి రావాల్నని అసంగ మాదేం లెక్క! కూలోల్లు బాగు పడాల్నని గద మేమంత అనుకునేది- గందుకనె సవారాజ్జం గుడుక తెచ్చిపెట్టిపాయె గాంధి. సచ్చేలోకంలున్నడో మారాజు! అయినా అత్తకు కోడలుమీన కన్నైయినట్టు మీకు మామీన కన్ను! కట్టంల, రోగాలల్ల, నొప్పుల్ల, ఆపతికి, సంపతికి ఎంతాదుకున్నా మీకు మామీన నమ్మకం లేకుంటయిపోయింది. కాలం మంచిగలేదు. దునియ చెడిపోతంది. దురుకెట్ట కాలమచ్చింది. నడిత్తాల్లె[50] దిని కొసిత్తాల్లె[51] ఏగ్గపోయే[52] కాలమచ్చింది. మీరంటె మీరుగాదు- మంది మాటలు బట్టుకొని సంఘాలు గింగాలంటే మీరే చెడిపోతరు. మా కాలంల సంఘాలుంటెనే బతికినమా? ఎనుకటెవడో ఏరుగబోయి చెరువుమీన అలిగిండట- చెరువుకచ్చే నట్టమేమున్నది? అని ముద్దే ఎండిపోద్ది. మంది మాటలు బట్టుకొని మారుమానం[53]బోతె మల్లచ్చేటాల్లకు ఇల్లు గాలిపోయిందట- మీకెవలమీన్నో మాకంటెక్కువ నమ్మక మేర్పడిపోయింది. ఆసక నేను సూడకపోను- నమ్మి నానబోత్తె పుచ్చి బుర్రిలు కాకపోవు.... అయినదానికి కానిదానికి కట్టగట్టుకొని అత్తండ్రు. మీకు గిన్నిసేత్తే మా మీన్నే కారాలు మిరియాలు నూరుతండ్రు" ధర్మయ్య గుక్కతిప్పుకున్నడు.

"గదంతెందుకు ధర్మయ్యా! ఎవని కర్మ వాడే అనుభగిత్తడు- మల్ల పంచాతంటె ఎకురారునామ[54] ముచ్చిలుకలు[55] దడావతు[56] లేమన్న ఉన్నయా?" పెద్దిరెడ్డి కాండ్రికిచ్చి ఊంచి అన్నడు.

పోత్తయ్య అసహనంగా కదిలిండు- అటిటు సూసిండు.

పొరుగూరి బండయ కలుగజేసుకొని "దడావతులు గిడావతులేంది? కడుపుకు గంజిలేనోనికి గ పైసలేన్నుంచత్తయి?" అన్నడు.

"అదిగాదురాప్రి! దడావతులు లేకుంట పంచాతేడ సదుత్తది? మున్సెఫ కచ్చేరణోంటిది[57] తప్పుదండుగు నేయించి సిచ్చేత్తది గాదు[ర- వారీ! అన్ని మీయే సాగాలంటెట్లరాప్రి! ఊళ్లె పంచాతంటె గీడికి పట్టుకత్తిరి. ఇగ తప్పు నాయం నేయ్యంచకుంటెట్ల?" ధర్మయ్య.

"పుర్రెలు పలిగినయా? నెత్తురు కారిందా? లచ్చింమల్లనిది భూమి. అనికప్పయ్యాలంటె మల్ల దడావతులేంది మజ్జెన? ఎనుకటి కెవడో శాత్తరం చెప్పినట్టు

---

50. నడి విస్తరిలో 51. కొస విస్తరిలో 52. మలవిసర్జన చేసే 53. రెండో పెండ్లి 54. ముద్దాయిలు ఉమ్మడిగా రాసుకునే ఒప్పందం 55. ముద్దాయిల వ్యక్తిగత పూచీ పత్రాలు 56. మధ్యవర్తి వద్ద వుండే డబ్బు 57. మున్సిఫ్ కోర్టు కూడా

గున్నది కత : పంచాతు చెప్పు పెద్దన్నంటె సుక్కేసుకోవాలె పైకం గావాలన్నడట ! ఊరుగా లొకదేడిత్తె ....గాలొక దేడిసినట్టున్నది ఎవారం" ఇంకో ఊరి రామలచ్చులు.

"నిన్నెవడు మాట్లాడుమన్న్రా? అంబిట్ల తెడ్డొలె మజ్జెతుకత్తన్నవ్" వీరా రెడ్డి కసిరిండు. అతని కండ్లయితె ఎర్రంగ మండుతన్నయ్.

ధర్మయ్య్య "సయిసు[58] సయిసు...." మని చెయ్యూపిండు- అతనికిదంతా తలకిందుగా జర్గుతున్నట్టుగా అనిపిచ్చింది. తాపేది చెప్పుతె అది ఊఁ అనేటోల్లు ఆల్లే చెప్పుతండ్రు. అయినా తామూలుకచ్చి బయటపడకుంట కాండ్రికిచ్చి ఊంచిండు.

"ఇగో బొత్తయ్యా ! ఊరన్నకాడ మాదిగిండ్లుంటయి- కట్టం సుకం ఉంటయి- దొరలు, దాతలుంటరు- పనిపాటలోల్లు, అడ్డోడు, కమ్మరోడు, కుమ్మరోడు, కూలోడు ఎందరో ఉంటరు. ఎవల పనాల్లు జెయ్యకుంటెల్లెల్లుతది ? మల్ల అందరికి అక్కెర సక్కెర్లుంటయి- వారీ ! మనల నెవడడిగిండురా ! అరిచ్చంద్ర మారాజసోంటోనికి ఓమాటకత్తె అక్కెరబడ్డది- మాటా మరోటా ! మాటకోసం పెండ్లాం పిల్లల అమ్మి మాట నిలబెట్టుకున్నడు- అప్పుగట్టిండు. ఎందుకురా ? అరిచ్చంద్రి మారాజు నీతి మంతుడు. సచ్చెమంతుడు- ఎవని రుడంల పడిపోయినా నరకం తప్పదని ముంగటి కాలాన్నెరిగినోడు.... వారీ ! ఈ ఊల్లె అక్కెర బడనోడెవడు ? అప్పు తీస్కోనోదెవడు ? అప్పున్నకాడ అడ్డి ఉంటది- ఉత్తగెవడిత్తరాని ? మీదాకెందుకు ? నాట్లమీద నాకక్కెర బడ్డది- షావుకారి నంబయ్య కాడికి బోతె ఉత్తసెయ్యి సూపిండు. మల్ల దొర్సాని కంటె, కోడలుమీని గొలుసు తీస్కపోతె పైసలిచ్చిండు- మల్ల నగలు బెట్టిన్నని అడ్డి తీస్కోలేదా ? నూటికి మూడు రూపాలు దంచి పుచ్చుకున్నడు- చెప్పచ్చేదేమంటే- కొలువా కుమ్మరియ్య[60] మూడె ముచ్చట్లు- కట్టె కొట్టె తెచ్చె నన్నట్టుగ- ఎవలవద్ద మాడినా[61] అద్దమసొంటి కాయితమున్నది- ఈడ నలుగురున్నరు- లెక్క సేపిచ్చుకో- నువ్విచ్చేటి యేమున్నయో అయి ఈర్రెడ్డి ముఖంమీసకొట్టు- నీ సేను నువు బాజాప్తగ[62] తీసుకో...."

వీరారెడ్డి పక్కజేబుల్నుంచి కాయితంతీసి ధర్మయ్య సేతి కిచ్చిండు. ధర్మయ్య అద్దాలు పెట్టుకొని ఏందో పేరు సదివిండు. రాగం తీసుకుంట కాయితమెల్ల సదివిండు. "తీసుకున్న రూపాలు అక్షరాల ఇన్నూరు ... ఇందుకు అడ్డి నెల ఒకంటికి నెకడ[63] ఒకంటికి పదిరూపాల సొప్పున అడ్డి అసలిచ్చి నా దస్తవేజు నేను తీసుకొందును-

---

58. అగు 59. (మెడ) నగ 60. కొలవడమూ, కుమ్మరియ్యడమూ
61. ఎవరు అబద్ధమాడినా 62. చిట్ట ప్రకారంగా 63. నూరు

ఇందు నిమిత్తము సర్వే నంబరు 204 గల నా స్వంత చేను కాస్తు[64] చేసుకొని ఫల సాయము అనుభవించగలవు– ఇది నా యిష్ట పూర్వకంగా వ్రాయించి యిచ్చిన దస్తావేజు సహీ.... దస్తూరి పెద్దిరెడ్డి...."

"అవద్దం...." లచ్చింమల్లయ్య అరిచిండు.

"ఏవోయి పెద్దిరెడ్డి నువ్వే రాసినవ్ గద?"

"ఔ.... గప్పుడు రాసింది యాదికే మున్నది గని– ఇన్నూరు రూపాలు నాసేతులతోనే ఇచ్చిన...." అన్నడు పెద్దిరెడ్డి.

"మీసేత మీరే ఒక్క నూరు రూపాల నోటిత్తిరి– సిల్లర నాకేడ దొరుకుతది బాంచెనని నేనంటె, నాకాడస్న లేదని మీరంటిరి– నూటికి అయిదు రూపాల అద్దని అయిదేల్లు సూపితిరి...." లచ్చింమల్లయ్య యాదికి తెచ్చిండు.

"ఆగాగు.... కింద నీ ఏలు ముద్దెరున్నది...." ధర్మయ్య.

"ఔను పంతులా! సదువా సొత్తరమా! పసురమసొంటోల్లం! ఎంతరాసినా ఏలుముద్దరేత్తాం" లచ్చింమల్లయ్య గొంతిక జీరబోయింది.

పెద్దిరెడ్డికి గయ్యన్ని యాదికి రాలేగని, తనకిచ్చిన పదిరూపాల నోటు గురుతు కచ్చింది.

"అడ్డి నూటికి పది రూపాలు.... ఎన్నేండ్లయ్యింది.... ఏడేండ్ల పది నెల్లు.... అధిక మాసాలు రెండు గలుపుకుంటె ఎనిమిదేండ్లు...." అని పోంటీను[66]దీసి కాయితం ఎనుక కెల్లి లెక్క జేసిండు ధర్మయ్య.

"ఇన్నూటికి నూటికి పది సొప్పున ఇరువై రూపాలు.... ఏడాదికి ఇన్నూట నలువై.... ఎనమిదేండ్లకు వడ్డి అసలు గలిపి రెండు వేల ఒకవంద ఇరువై.... ఇన్నారురాత్రి! అడ్డికడ్డి గట్టలే– దానంతుకు ఏమో ఇత్తులు గొలిసిన్నంటివి. అదిగాక పంట గుడుక తీసుకున్న డంటిరి." ధర్మయ్య ఆఖరు గీత తిరుగులేని గీత గీసి కండ్లద్దాలు తీసి పట్టుకొని అందరి ముఖాల సూసుకుంటు అన్నడు.

ఆడ నిలబడ్డోల్లు ఒకల మొఖాలొకలు సూసుకున్నరు బీరిపోయి.

బొత్తయ్య కొంచం ముంగటికి జర్గిండు.

"ఇంతవరదనుక తమరు సాత్త్రాలు పురండాలు సెప్పిండ్రు– ఇగ నేను జెప్పుతినుండ్రి. దచ్చినాన కొండపురి రాజ్జెముండేదట– కొండపురిని చండ భూపాలరాజు

64. వ్యవసాయం 65. నిజము 66. పెన్

ఏలెటోడట- గసోంటి రాజ్జెంల ఉన్నట్టుండి ఉన్నోల్లు ఇంకింత బలిసిపోయి, లేనోల్లు ఆకలికి సచ్చె దెపున[67] వచ్చిందట- ఇగ ఆకలికి సచ్చె కూలి జనమంత కట్టకట్టుకొని రాజు కాడికెల్లి మొరపెట్టుకున్నరట- "హే రాజా! ఇగ నువ్వు ఆదుకోకుంటె మా పానాలు పోత" యని. రాజ్జమంత పీనుగుల పెంటయి పోతందని సూసినోల్లు రాజు దగ్గెర చెప్పింగ్రట, రాజు గప్పుడు కండ్లు తెరిసి మంత్రిని బిలిసి ఖజానా ఖాలైనా పరువలేదు, ధాన్యం గిన్యం అందరికీ పంచిపెట్టన్నడట- మంతిరి నవ్వి "హే రాజా! ఉత్తగిత్తె జనం పనులు మానుకుంటరు- ఏట గిదే ఏషమేత్తరు- మనకుసుత పైక మెట్లత్తది?" అన్నడట- అని అందుకొక ఉపాయం జెప్పిండట- మన రాజ్జెంల తొవ్వలు బరాబర్ లేవు- కనుక ఇయ్యేడు తొవ్వలేయించుదాం- ఆ పైకం గుడుక ఆళ్లకందాలంటె సేపిచ్చెటోన్ని ఉన్నోన్ని పెట్టద్దు- గ బీదోల్లండ్లోన్నే ఏరుకొని అనికి పైకమప్ప చెప్పి పని జేయించుకుందాం- పనికి పని, ఆళ్ల ఆకలికి ఆకలి తీర్తది- రాజు సరే నన్నడు. గరీబోల్ల ఎతికెతికి అతిలావు దొద్దైన పుల్లయ్యను పెకెదారు[68] చేసిండట. అయిపాయె పని మొదలైంది- కూలోల్లు పనిజేత్తండ్రు- కడుపుకు తింటండ్రు- ఉన్నట్టుండి పుల్లయ్య పెయికంగి దొడిగిండు. తెల్లారి పని ఇసిరెలు[69] తట్టలు, పారలు, గడ్డపారలు గొన్నడు. జనానికి అనుమాన మచ్చింది- నిలదీసిండ్రు- మీరు పనికి రాకుంటె మాయె అన్నడు- ఏరే దేశం మనుషుల తెత్తనన్నడు. జనం పని చేయాల్నంటె తట్టలు, పారలు, గడ్డపారలు గావాలె- గయ్యి పుల్లయ్య దగ్గెరున్నయి- ఎనుక ముందాడిన పల్లె పుల్లయ్య కిందికే పనికి బోతండ్రు- పుల్లయ్య గిప్పుడు సలువ బట్టలేసుకొని సేతులూపుకుంట అటిటు తిర్గుతండు- పని సూసెటాన్కి పెకెదారును బెట్టుకొన్నడు. ఊల్లె భూములు, బంగుళాలు కట్టిచ్చుకున్నడు. అయిపాయె తొవ్వలయిపోయినయ్- రాజుగారిచ్చిన పైకం లెక్కసూపెట్టిండు- పల్లె కూలోల్లకు ఏమి మిగులలే- పుల్లయ్య మాత్రిం పాలేరోల్ల బెట్టుకున్నడు. గిదింట్ల పుల్లయ్య ఏడినుంచి పెర్గిపోయిండో? ఎట్లా పెరగిపోయిండో? పల్లె కట్టపడ్డ జనం కట్టంల్నే ఉంటె పుల్లయ్యొక్కడు ఎట్లా పెరగిపోయిండు?" బొత్తయ్య కత సెప్పుట మాపిండు- అందరిని సూసిండు- "గీ కతల ఇంకొక సిన్న లిటిగేషనున్నది పంతులూ! బీదోల్ల నుంచి పైకచ్చిన పుల్లయ్య బీదోల్లకు నోటు తప్పెడు అప్పిచ్చి, భూములు రాయించుకున్నడు- గిప్పుడు గ పుల్లయ్య అప్పులియ్య గలడు- అడ్డీలు తీస్కోగలడు. గట్ల అప్పిచ్చేటానికి పైక మేడినుంచచ్చింది?" బొత్తయ్య కతాపిండు....

---

67. దినం 68. పనిచేయించే గుమాస్తా 69. పనిముట్లు

"ఎట్లంటవా ? రాజుగారు బంటకు[70] గింతియ్యమని సెప్పుతె అందట్లది సగం జేబులేసుకున్నడు. పల్ల పెకెదారుగిరి జేసినందుకు కయికిలి[71]చ్చిరి. అదిది గలిపి ఎక్కువయ్యింది- గట్ల పెరిగిపోయింది...." పొరుగూరి రామలచ్చ.

"గదంత భారత మెందుకు ? కూలోల్ల ఆకలి బతుకుల్ల నుంచి సాయారం దీల్చి పుట్టకుక్కోలె పొడుసుక పైకిపోయిండు" ఇంకెవరో అన్నరు.

"అగ్గదీ.... పల్ల పుల్లయ్య అప్పిచ్చిన పైకమేడిది ?" బొత్తయ్యన్నడు.

"కూలోల్లదే...." చాలా మందన్నరు.

"వారీ ! అదురుట్టమురా్రి.... సేతికున్న ఏల్లన్ని ఎందుకు ఒక్కంత పొడుగు లేవు సెప్పండ్రి...." ధర్మయ్య ముఖం జేవురించంగ అన్నడు.

"గయ్యన్ని సాత్తరాలు తీరుపాటంగ చెప్పుకునేరు గని ముంగలబడ్డ దాని గురించి మాట్లాడుండ్రి...." పెద్దిరెడ్డి.

గప్పుడు ఒక్క పోశాలు గుకుపకట్టెపోసిన గద్దువానించి నిలుసున్నోడు కవ్వోళ్లె నోరు తెరిసిండు; "ముంగల బడ్డదేందుండ్రి.... ముంగల బడ్డదీ ! కతంటె గుర్తు కచ్చింది. పెండ్లి సేసుకొని, సాది, సవరిచ్చెనసేసి కూడుబెట్టి, కోక గొని, తలకు సమరు[72] గొన్నంక.... తీరా సమర్తయి ఎదిగిన దాన్ని.... ఎదిగింది నాదే బంచోతన్న డట ఎనుకబెవడో గిసోంటి దొర. గీ సెలుక లచ్చింపల్లనిది- ఆడు సాదెడు రకుతం పురసెడు సేసుకొని గిదీన్ని సేను పోవడికి దెచ్చిండు.[73] సూర్రూపాలిచ్చి కొంటబో యేటియన్ని కొంటబోయి పల్ల నాదంటె గిదెక్కడి నాయెం ?" అన్నడు.

ధర్మయ్య పండ్లు పటపట గొరికిండు.... 'బక్క పోశడు తన పాలేరే ! లంజ కొడుకులకు మదమెక్కింది ! మాటకు మాటందిత్తండ్రు' అనుకున్నడు మనుసుల. అనుకొని లేసి నిలబడ్డడు- భుజం మీని పంచె యూడిచ్చి దులిపిండు కోపంగ.

"అప్పట్నుంచి సూత్తన్న- నువు తాములుగ సముజ[74]కొద్ది మాట్లాడ్తాంటె, అల్ల తీకునాలు దీసి మాట్లాడ్తండ్రు- దమ్ము కాత్తన్న"[75] వీరారెడ్డి నిట్టనిలువుగ నిలుసుండి అన్నడు.

"మదమెక్కింది బాంచోతు" పెద్దిరెడ్డి.

"నువు గడ్డలకు గడ్డలు తీసి పెడితె...." పందిల ఎవతో గునిసింది.

బొత్తయ్య సుత లేసి నిలబడ్డడు- సేతులూపుకుంట....

70. నిర్ణీత కొలతలుగల మట్టిపొక్క 71. కూలి 72. నూనె
73. చేను వలె చేసాడు 74 అర్థం 75. ఓపిక పడ్తున్నా

"తమరు పెద్దలోకులు- ఇప్పటికే సమజ్ సేసుకోవాలె- ఈడిదనుకచ్చిండ్రు- లచ్చింమల్లడు తీసుకున్నయి నూర్రూపాలు. రెండేండ్లు ఆరు బత్తాల జొండ్లు కొలుసుక పొయిండు పటేల్. ఎంత లేదన్నా గయ్యే మున్నూరయితయి. ఏటా ఫసలు తీసుకుంటాండ్రు. ఏటా ఎంత లేదన్న పది గిద్దెల జొండ్లయితె భూమి పాలు గట్టుండ్రి. ఏటయిదు గిద్దెలు రెండు పుట్లయితయి. గ లెక్కన సూత్తె ఈర్రెడ్డి పటేలే లచ్చింమల్లనికి బాకి తేలుతడు. మల్లింక పెద్దలకు మేం చెప్పేదేమి లేదు. గరీబోల్లం, గులాపోల్లం. దొరలు పారసూసుకోవాలె. కాదంటిరా మీ తొవ్వ మీది మా తొవ్వ మాది...." అన్నడు సిట్ట సివరకు.

"ఎందిర మీ తొవ్వ?" వీరారెడ్డి అరిచిండు.

"వారీ! లచ్చింమల్లా! నాగలి గట్టు- నీ సేను నువ్వు దున్నుకో- మంచి మాటకు సెప్పినం- ఇగ దొరలిట్టం...." బొత్తయ్య.

"బొత్తన్నకూ - జై" అన్నరు అందరు.

వీరారెడ్డి కెటు పాలుపోలే- గిదగిద బొత్తయ్యమీని కురికచ్చిండు. బొత్తయ్య ఒడుపుగ తప్పుకోకుంటె దవుడ పలిగేదే.

వీరారెడ్డిని ధర్మయ్య పట్టుకున్నడు.

అరుపులు కేకలు మొగులు ముట్టినయ్- ధర్మయ్య వీరారెడ్డిని తీస్కొని అచ్చిన దారి బట్టకుంటె ఏమయ్యేదో?

లచ్చింమల్లయ్య నాగలి కట్టిండు- నాగలి నడిచింది.

"లంజ కొడుకుల్లాలా! మీరంత కమినిట్లయి పోయిండ్రు. పోలీసోల్ల తీస్కచ్చి చితల్‌చితల్ కొడిపిస్త ఏమనుకున్నరో?" గిట్ల అంతుపొంతు లేకుంట అదురుకుంట[76] పెద్దమనుషులు ఎంటరాంగ వీరారెడ్డి ఊరికెల్లి ఎల్లిపోయిండు.

"అన్నిటికి తయారుగున్నం. ఎవడచ్చినా బే ఫికరే.... పోలీసోల్లుగాదు, ఆల్ల తాతల దీస్కరా! నాయెం మా ఎనుకున్నది. అంతదాకత్తె- తెగిన బొక్కెన నూతిల దాక. మా రెక్కలే మాకు బలం. ఇవ్వారుదనుక అంగిసె నడుమెత్తకుంట కట్టం జేసి కడుపుకు సచ్చినమ్. కడుపుకు సాలక గీ రెక్కల్నే మర్రేసినమ్" బొత్తయ్య అన్నడు.

"మా మద్దతు గుడుక ఉంటది. ఏం జేత్తరో?" పొరుగూరోల్లు అన్నరు.

"సంఘానికీ"

"జై" అన్నరు అందరు. అడివి పిట్టలు గుడుక బదులు పలికినయ్ "జై" అంటున్నట్టు.

---

76. వదురుతూ

సంసార వృక్షం - అరెస్సుదర్శనం తాత్విక గందరగోళం

జైరామ్

"హేతువాదంతో పూర్వ సంస్కారాలు ఛేదించి సమదర్శిత్వం అలవరుచుకోడానికి మేధోపజీవి చేసిన సాధనను చిత్రిస్తూ, అద్వైతానుభూతికోసం ఆర్తి చెందే వారిని అది స్వీకరిస్తుందని నిరూపించే నవల" అని "ఆధునిక భావాలకు మన సంస్కృతిలోని మూల తత్వానికీ వంతెన నిర్మించ బూనిన రచన- దాంపత్య ధర్మాన్నీ, రొమాంటిక్ ప్రేమనీ మేళవించిన ఇతివృత్తం" అని ఈ నవలని పరిచయం చేశారు ప్రకాశకులు.

ముఖచిత్రం ఇందులోని లాయరు పాత్రకు వచ్చిన కలకు చిత్రీకరణ. పాముచే చుట్టబడిన నగ్నసుందరి- వెనుక రావి చెట్టు ఆకులు, శాపవిముక్తురాలి నంటున్న హేమ సుందరి ముకుళిత హస్తాలు, పెడముఖం పెట్టి చెయ్యెత్తి ఆశీర్వాదం పోజులో నిలబడ్డ లాయరు పాత్ర.

ఈ నవలలో ప్రధాన పాత్రలు 'నేను' అనే పిల్లలులేని లాయరు (కథానాయకుడు, మేధోపజీవి)- ఆయన భార్య సావిత్రి, భావనారాయణ, భౌతికవాది డాక్టరు వీరభద్రరావు తక్షినవి హేమసుందరి, నల్లచెరువు స్వామీజీ, నారాయణరెడ్డి, పూనా దగ్గరి ఆశ్రమం గురూజీ. అమృత, హోమో సెక్సువల్ అలెన్, కలకత్తాలోని అమీయ బాబా, కొంతమంది పిల్లలు, కుక్క మొ॥

పిల్లలులేని లాయరు భార్య సంతానం కోసం పరితపిస్తుంది. పాత విశ్వాసాలు కలిగిన భావనారాయణ లాయరుకు వచ్చిన కలవిన్న తర్వాత అశ్వత్థ వృక్షానికి పూజ చెయ్యమని చెబుతాడు. మూఢ నమ్మకాలు, భక్తిలేని, నిర్లిప్తతను కోరుకునే మన కథానాయకుడు లాయరు అవన్నీ మూఢ విశ్వాసాలు అని కొట్టిపారేస్తాడు. భావనారాయణ ప్రోద్బలంతో భావనారాయణ, లాయరు, అభ్యుదయ భావాలు కలిగిన డాక్టరు వీరభద్రరావు నల్ల చెరువు స్వామీజీ దగ్గరి కెళ్తారు. అక్కడ ఒక సందర్భంలో స్వామీజీ చూసిన చూపుతో లాయరుకు ఆనందానుభూతి కలుగుతుంది.

లాయరు హైదరాబాదు వెళ్లిన సందర్భంలో అతని భార్య సావిత్రి పడకగదిలో పాము ప్రవేశిస్తుంది. పిల్లలు డాక్టరును పిలుచుకువస్తే అతను దాన్ని పిస్తోలుతో కాల్చివేస్తాడు. తన ఇంట్లో పాముని చంపడం (చంపింది డాక్టరైనా) హిందూ సంస్కారం కలిగిన సావిత్రి తనకు జన్మజన్మలకీ నిష్కృతిలేదనీ, సంతాన యోగం లేదనీ బాధపడుతుంది. అది మూఢవిశ్వాసమని భార్యను ఓదార్చడానికి ప్రయత్నిస్తాడు లాయరు. డాక్టరు వీరభద్రరావు సావిత్రికి మనో విశ్లేషణ చికిత్స చేస్తాడు. వాళ్లిద్దరి

మధ్య స్నేహం పెరుగుతుంది. ఇది చూసి లాయరుభర్త అనుమానంతో, అసూయతో, బాధతో లోపల్లోపలే కుమిలిపోతుంటాడు. లాయరు తాత్కాలిక ప్రియురాలు హేమ సుందరిని డాక్టరు పెళ్లాడుతాడు. ఏదో పోగొట్టుకున్నట్లు అనుభూతి చెందుతాడు లాయరు. లాయరు అన్నగారు తమ కుమారుణ్ణి దత్తత తీసుకోమని కోరతాడు. దత్తత తెచ్చుకోవడం లాయరుకు ఇష్టంలేదు: సంతానయోగం వున్నదో లేదో తేల్చు కోడానికి డాక్టరు వీరభద్రిరావుతో పరీక్ష చేయించుకొంటాడు. పరీక్ష జేసిన డాక్టరు అతన వీర్యకణాల్లో జీవం లేదని సంతానోత్పాదకశక్తి లేదనీ, పుట్టుక నుంచీ లోపం అనీ చెబుతాడు. భార్యతో ఈ విషయం చెప్పలేక సతమతమవుతాడు లాయరు. వాళ్ల అన్నకు జబ్బుచేస్తే సావిత్రి, తనూ వెళ్తారు. డాక్టరు పరీక్షతో సావిత్రి గర్భవతి అని రుజువవుతుంది. లాయరులో అనుమానం మొలకెత్తుతుంది. వీరభద్రిరావుపై అను మానం వేస్తుంది. డాక్టరు పరీక్షలో తన వీర్యకణాలు నిర్జీవం అని తేలిన తర్వాత సావిత్రి గర్భం రావడంతో విపరీతంగా మానసికాందోళనకు గురి అవుతాడు. పేపర్లో వార్తను చూసి పూనా దగ్గరి ఆశ్రమం గురూజీ దగ్గరికి వెళ్తాడు. అతని మనస్సులో అనుమానం ఇక్కడ కూడా తీరదు, మనశ్శాంతి రాదు. ఆశ్రమంలో పరిచయమైన ఒక విదేశస్తుడు నీలండి ఉత్తరం చూసి కలకత్తా అమియ బాబా దగ్గరికి వెళ్తాడు. అక్కడి నుండి క్షితీశ్ అనే వ్యక్తివెంట బంగ్లాదేశ్ శిబిరానికి వెళ్తాడు. ఒక రోజు కల వస్తుంది. కలలో సావిత్రి, పాపాయి కనిపిస్తారు. అతని మెదడు పొరలలో దాగివున్న గృహస్థాశ్రమ జీవితమే అతనికి స్వప్నంలో కనిపిస్తుంది. కొద్ది రోజులకు జ్వరం వస్తుంది. అమియబాబా ఇచ్చిన జావతో తనకు జ్వరం పోయిందనుకొంటాడు. మందులు కూడా పని చేసాయనుకుంటాడు.

అమియ బాబాతో తన సమస్య చెబుతాడు. బాధను వెళ్లగక్కి ఏడుస్తాడు. తప్పు నీలో వుందో సైన్సులో వుందో తేల్చుకోమంటాడు బాబా. డాక్టరుతో పరీక్ష చేయిస్తే తన వీర్యకణాలు సజీవమే అని తేలుతుంది. అనుమానం తీరక మరోచోట పరీక్ష– అక్కడ కూడా వీర్యకణాలు సజీవమే అని తెలుతుంది. అంతటితో అను మానం తీరుతుంది– గృహస్థాశ్రమం వైపు తిరిగి వస్తాడు.

— ఇదీ ఈ నవలలోని ఇతివృత్తం.

డాక్టరు వీరభద్రిరావు పరీక్షతో వీర్యకణాలు సజీవంగా లేవనె భార్య గర్భాన్ని అనుమానించేటట్లుచేసి మేధోపజీవిని అద్వైతానుభూతికోసం ఉత్తరదేశ యాత్రి తిప్పి అక్కడ డాక్టర్లతో వీర్యకణాలు సజీవం అనిపించి అనుమాన నివృత్తిచేసి 'గజం మిథ్య

పలాయనం మిధ్య' అనిపిస్తాడు రచయిత. మరల వీరభద్రరావుతో పరీక్ష చేయించే అవకాశం ఇవ్వలేదు. ఒకవేళ కథానాయకుని ఉత్తరదేశ యాత్రలో కొత్త నీరు, కొత్త అహారం, కొత్త వాతావరణంలో వీర్యకణాలకు జీవం వచ్చే అవకాశం వుంటే సావిత్రి గర్భ కారణం అనుమానాస్పదమే. ఒక డాక్టరు అన్నట్లు వీర్యం శాంపిల్స్ తారు మారు అయివుంటే లాయర్ వీర్యంతో బాటు మరికొందరి శాంపిల్స్ కూడా ఆ సందర్భంలో వీరభద్రరావు పరీక్ష చేస్తూవుండాలి. అటువంటి శాంపిల్స్ మరి కొందరివి ఆ సందర్భంలో వున్నాయో లేదో తెలుసుకొనే అవకాశం గాని రచయిత యివ్వలేదు. సైన్సును నమ్మి అనుమానంతో దేశపర్యటన చేసి ఆఖరుకు సైన్సుతోనే అనుమాన నివృత్తి తీరుతుంది కథానాయకునికి. కాని గురూజీ, అమీయ బాబాలు అనుమాన నివృత్తి చెయ్యలేక పోతారు. భార్యపై లాయరుకు వచ్చిన అనుమానం అనే కల్మషం అమీయ బాబా సందర్శన భాగ్యంలో అద్వైతంతో ప్రక్షాళనం అయిందని చెప్పడం రచయిత ముఖ్యోద్దేశం అయినా డాక్టర్లు చెప్పిందానిపై నమ్మకంతోనే అనుమాన నివృత్తి అవుతుంది లాయరుకు.

ఇందులో లాయరు పాత్ర, డా॥ వీరభద్రరావు, భావనారాయణకున్న భావాలు రచయిత గందరగోళం తాత్విక దృక్పథాన్ని తెలుసుకోడానికి ఉపయోగపడతాయి. ఆఖరులో లాయరు అంటాడు "వీరభద్రరావు నా మనస్సులో సర్పమై ప్రవేశించి, మబ్బుగా మసలి అద్వైతానుభూతి వర్షించి నన్ను క్షాళనంచేసి నాలో ఏకమైనాడు. వీరభద్రరావు ఎవరో కాదు- నాలోని వాడే" అని.

రచయితలోని మార్క్సిస్టు భావం అస్తిత్వవాదంలో ఇమిడిపోయి చివరికి అస్తిత్వ వాదం అంటే స్వీయాత్మక భావవాదం మిగులుతుంది. వీరభద్రరావు పాత్ర ద్వారా రచయితకు మార్క్సిస్టు పరిజ్ఞానం వున్నట్లు స్పష్టమవుతూ వుంది.

రచయిత ముఖ్యోద్దేశం గతి తార్కిక భౌతికవాదాన్ని, మార్క్సిజాన్ని అపఖ్యాతి పాలు చెయ్యడం; హిందూ ఆధ్యాత్మికవాదం, అద్వైతం, అస్తిత్వవాదాలను గొప్పగా ప్రతిపాదించ పూనుకోవడం, తాను గందరగోళపడి పాఠకులను గందరగోళపరుస్తాడు.

ఒకచోట భావనారాయణతో తర్కిస్తూ లాయరు "నేను వైయక్తికవాదం నుంచి సామాజిక వాదాన్ని, కమ్యూనిజాన్ని సమర్థిస్తాను. అయితే నేను మార్క్స యొక్క భౌతిక వాదాన్ని అంగీకరించను. తొలి వస్తువు పదార్థమైనా మనస్సైనా యిబ్బంది లేదు. ఈనాడు రెండూ పదార్థమూ - మనస్సు ఒక దానిమీద ఒకటి పనిచేస్తున్నట్లు

గమనించేది మనస్సే కాబట్టి మనస్సుకే ప్రాధాన్యం- నాది భౌతికవాదం కాదు- మానవతా వాదం" అంటాడు.

ప్రకృతి భౌతికం. మానవుని మనస్సుకు బయట దానిమీద ఆధారపడకుండా స్వతంత్రంగా వుంటుంది ప్రకృతి. ప్రకృతిలోని పదార్థం, పదార్థ ధర్మం, ప్రకృతి నియమాలు మానవుని ఆలోచనతో సంబంధంలేని స్వతంత్ర శక్తులు. పదార్థం అంటే మన ఇంద్రియానుభూతుల్లో ప్రతిబింబించే ప్రతిదీ పదార్థమే. మనస్సుతో నిమిత్తం లేకుండా మనస్సుకు వెలుపల వుండే సమస్త విశ్వమూ పదార్థసంబంధమే. ఈ పదార్థ సంబంధమైన భౌతిక వాస్తవికతే మానవుని మనస్సులో ప్రతిబింబించేది, ఇది గతి తార్కిక భౌతికవాదం.

ఈ శాస్త్రీయ తాత్విక దృక్పథానికి విరుద్ధంగా లాయరు పాత్రలో అస్తిత్వ వాదానికి ప్రాధాన్యత కల్పించాలని చూశాడు రచయిత.

అస్తిత్వవాదం (Existentialism) సమాజం నుండి వ్యక్తిని వేరుచేసి 'వ్యక్తి అస్తిత్వానికి' ప్రాధాన్యత నిస్తుంది. జీన్‌పాల్ సార్త్రే అతనికి మూలమైన కీర్క్‌గార్డ్ ప్రతిపాదించిన 'అస్తిత్వవాదం' వ్యక్తి చైతన్యానికి ప్రాధాన్యతనిస్తూ 'నేను' నుండి సమాజాన్ని చూస్తుంది. జగత్తు యొక్క ప్రతిబింబంగా 'నేను'ను చూడకుండా 'నేను' యొక్క ప్రతిబింబంగా జగత్తును చూస్తుంది. ఇది అశాస్త్రీయమైన ఆధునిక బూర్జువా తాత్విక ధోరణి. దీన్నే ఆధునికంగా భావించి హిందూ సంస్కృతిలోని మూల తత్వానికి (ఆధ్యాత్మికం) వంతెన నిర్మించ బూనుకున్నా ననుకుంటాడు రచయిత;

అస్తిత్వవాది స్వీయాత్మక భావవాదికంటె భిన్నంకాడు. సమాజం నుండి వేరు చేయబడిన వ్యక్తి అస్తిత్వం ఎలా గిలగిలా కొట్టుకుంటుందో ఇందులోని మేధోపజీవి లాయరుపాత్ర ఉదాహరణ. అస్తిత్వవాదియైన కథానాయకుడు అడుగడుగునా అసంతృప్తి, ఆందోళన, నిరాశ, నిస్పృహ, భయంతో కృంగిపోతాడు. ఈ భయం, ఆందోళనే స్వామీజీ చూపు సోకినపుడు పొందిన అనుభూతి. అమియ బాబా గుండెల మీద చెయ్యి వేసినపుడు లాయరుపాత్ర పొందిన అనుభూతి. వైయక్తిక వాదానికి, స్వీయాత్మక భావవాదానికి భిన్నమైన దేమీ కాదు అస్తిత్వవాదం.

మేధోపజీవిగా చెప్పబడిన లాయరు ఇందులో ఒకచోట 'నేను' అంటే ఎవరు అనే సంశయంలో పడతాడు. "నేనూ ఈ శరీరమూ ఒకటికాదు. నేనూ యీ సుఖానుభూతీ ఒకటికాదు. ఈ శరీరమూ, ఈ సుఖానుభూతీ నాకు చెందినవే. నాకు

రెండింటిమీద మమకారం వుంది. అయితే రెండటం వేరు తాదాత్మ్యం వేరు. ఇప్పుడు శరీరం నశించిపోవడం, దాంపత్య సుఖం నాకు వెలుపలే వున్నాయి. నేను అన్నింటికీ వెలుపలే అతీతంగానే ఉంటోంది. నేను వేరు శరీరం వేరు- నేను అనేది శరీరానికి అతీతమైన ఆత్మ" అని బాహ్యాత్మక భావవాదంలో పడతాడు. తన వీర్యకణాలు చైతన్య రహితమైనవిగా డాక్టరుద్వారా తెలుసుకొని నమ్మిన తర్వాత భార్యా సంగమ సందర్భంలో మేధోపజీవి ఆధ్యాత్మిక దృష్టి ఇది. సైన్సుపై నమ్మకం, ఆత్మసిద్ధాంతం (హిందూ సంస్కృతి) మానసికాందోళన, నిర్లిప్తత, నిరాశ పరస్పర విరుద్ధ ప్రకృతిలో ఆందోళన చెందుతాడు లాయరు.

మెదడు అనే పదార్థం లేకుండా ఆలోచనేలేదు. భౌతిక ప్రపంచంయొక్క వాస్త వికత, అస్తిత్వం మెదడు అనే పదార్థంలో ప్రతిబింబించడంవల్ల ఉద్భవించే మనోవ్యా పారం ఆలోచన, చైతన్యం.

మేధోపజీవి లాయరు. "పదార్థమూ మనస్సు ఒకదానిమీద ఒకటి పనిచేస్తుంటా" యని "అలా పని చేస్తున్నట్లు గమనించేది మనస్సే కాబట్టి మనస్సుకే ప్రాధాన్యం" అంటూ "నాది భౌతికవాదం కాదు మానవతావాదం" అంటాడు.

పదార్థం యొక్క ప్రభావం మనస్సు మీద వుంటుంది కాని మనస్సు యొక్క ప్రభా వం పదార్థం మీద వుండదు- కాబట్టి పదార్థం మనస్సు ఒకదానిమీద ఒకటి పనిచేస్తున్నా యనడం అశాస్త్రీయం. పదార్థం చైతన్యం ఒకటే ననుకోవడం కూడా అశాస్త్రీయమే. ఈయనది మానవతావాదం కాదు గాని భావవాదమే. స్వీయాత్మక, బాహ్యాత్మక భావ వాదం కలగలిసిన గందరగోళం. It reveals the confusion with the mix-ture of subjective and objective idealism in the mind of the writer. మార్క్సిజంలోనే మానవతావాదం వుంది.

పదార్థానికీ చైతన్యానికీ వున్న సంబంధం, వ్యత్యాసంపై రచయితకు శాస్త్రీయ మైన అవగాహనలేదు. పదార్థానికీ చైతన్యానికీ సంబంధమూ వుంది, వ్యత్యాసమూ వుంది. పదార్థం మనస్సుకు వెలుపలవున్న భౌతిక అస్తిత్వం. చైతన్యం ఆ పదార్థ అస్తిత్వం యొక్క ప్రతిబింబంతో మెదడు యొక్క పరిణామక్రమంలో ఉద్భవించిందే.

రెండింటినీ విడదీసి పదార్థానికీ చైతన్యానికీ సంబంధంలేదు అని మార్క్సిజం చెబుతుంది అని గతితార్కిక భౌతికవాదాన్ని అపఖ్యాతిపాలుచేసి చిత్రీకరించే రచయిత లున్నారు- అది మార్క్సిజం కాదు సైకోఫిజికల్ పారలలిజమే.

ఈ రచయిత ఇతర రచనల్లోనూ, సాహిత్య విమర్శల్లోనూ కనిపించేది ప్రధానంగా భౌతికవాద వ్యతిరేకతే. ఆ వ్యతిరేకతే ఈ నవల్లోనూ కనిపిస్తోంది.

ఈ మేధోపజీవి అనుభూతి చూడండి. తంజావూరు బృహదీశ్వ రాలయం గంటల లయాత్మక ధ్వనిలో (భక్తిలేకపోయినా) ఒక ప్రశాంత మనస్సుని ఆవరించి, ఒక శ్రుతి, ఒక వేణుగానం జగమంతా నిండి ఆనంద పరవశం చేసే మురళీగానం తాలూకు భావన, అమీయబాబా హస్తస్పర్శతో ఆనందానుభూతి కలగడం, ఒంటిగాచేసే ధ్యానంలో తన చుట్టూ కాంతి వలయం, మంత్రం ప్రారంభిస్తే మనస్సు ప్రశాంతం గావడం- ఇవన్నీ హిందూ సంస్కృతిలో రచయిత గొప్పగా అనుకున్న మూలతత్వం. ఈ తత్వంతో తన అస్తిత్వవాద ఆధునిక భావానికి పూన్చిన వంతెన అయోమయం-జరామయం.

సెక్స్‌పై అమృతభావాలు విన్నతర్వాత మేధోపజీవి అంటాడు: "నేనొక సిద్ధాంతం చేసుకున్నాను. జంతువు స్థాయిలో జగత్తూ మనస్సూ ఒకటి. మనిషి తన స్థాయిలో జగత్తు నుంచి మనస్సును వేరుచేసి చూడగలుగుతున్నాడు. మనిషి పొందవలసిన పరిణామంలో తర్వాతి మెట్టు జాగృతిని మనస్సు నుంచి వేరుచెయ్యడం. అదే ఆత్మాన్వేషణ- అది సాధించనిదే మనిషికి స్థిరమైన ఆనందం సిద్ధించదు."

అస్తిత్వ పదార్థం యొక్క ప్రతిబింబం మనస్సు నుండి జాగృతిని వేరుచేసి 'వ్యక్తి'కి స్వయం రూపాన్ని స్వతంత్ర అస్తిత్వాన్ని కల్పించే అస్తిత్వవాదమే ఇది.

మనస్సుకు అతీతంగా జగత్తు వుంటుంది. ఆ జగత్తు ప్రతిబింబించే మనస్సు శరీరధర్మమైన ఇంద్రియానుభూతి, జాగృతి మనస్సు నుండి వేరుచేసి చూడాలి అనే ద్వైదీభావం (Dualism) భావవాదానికే దారితీస్తుంది. ఇక్కడ ఆధునిక భావమూ లేదు పూర్వ సంస్కారాన్ని ఛేదించడమూ లేదు.

వీర్య పరీక్షలో బీజకణాలు చైతన్యవంతం అని తేలింతర్వాత మనస్సులోని అనుమానం తేలికపడుతుంది. అప్పుడు అనుకుంటాడు "జగత్తూ మనస్సూ ఒక్కటే- వేరువేరుగాలేవు. వ్యక్తిలోని అహంత వాటిని వేరుగా తోపింపచేస్తుంది. జగత్తూ మనస్సూ ఒక్కటే. కాబట్టి మనిషి మనస్సులోని అపభ్రంశమే జగత్తులోనూ రూపుదాల్చి కనిపిస్తూ వుంటుంది. ఒక వ్యక్తి జీవితం అతని మనస్సు యొక్క ప్రతిబింబమే. నాకు జరిగిన దానికి నేనే బాధ్యుణ్ణి."

ఇది రచయిత స్వీయాత్మక భావవాదం నుండి పుట్టిన అభివృద్ధినిరోధక ఆధునిక బూర్జువా తాత్విక ధోరణికి చెందిన అస్తిత్వవాదం. లాయరు జీవితం అతని మనస్సు

యొక్క ప్రతిబింబమే అయితే, తనకు జరిగిన దానికి తానే బాధ్యుడైతే మరి డా॥ వీర భద్రిరావు, అతని భార్య, భావనారాయణ, వీర్యపరీక్ష— వీటి మాటేమిటి?

అద్వైతం అనుభూతమైన తర్వాత అహంత హద్దులు పట్టుపరదాల లాంటివి. ఇచ్ఛామాత్రంగా తొలగిపోతాయి. బాబా నాకీ భాగ్యం కలిగించాడు" అంటాడు. రచయిత ఆధునిక భావం అంటే— అస్తిత్వ వాదానికీ హిందూ సంస్కృతిలోని మూలతత్వానికీ (ఆధ్యాత్మిక భావంకీ) వంతెన నిర్మించ పూనుకోవటం. ఇందులో ఎక్కడా హేతువాదమూలేదు. పూర్వసంస్కారాలను ఛేదించడమూ లేదు. రచయిత పూర్వ సంస్కారమనుకునేదాన్ని స్థిరీకరింప చెయ్యడమే జరిగింది.

"పాతని బతికించడానికి
కొత్త చిట్కాని అందంగా అల్లే
గతి తప్పిన మేధావుల కొనవూపిరి
యత్నం"లో భాగమే ఇది.

దాశరథి రంగాచార్యుల నవల 'రానున్నది' పరిశీలన :

అ.ర.సం. కలగంటున్న సోషలిజం?!

కె. వి. రమణారెడ్డి

పా.మ. అంటే పాతమంత్రి ఒక కలగన్నారు— పగటికలో పడకింటికలోకాదు, మీటింగుహాలు కథ. తాను గాక వ్యవస్థకు వ్యవస్థే నేలగూలినట్టు, తనని అరెస్టుజేసి జైల్లో పెట్టినట్టు, కొత్త ప్రధానమంత్రి జైలుసూపర్నెంటూ ఇంజినీరూ గ్రామ సంక్షేమాధికారీ వేర్వేరు సన్నివేశాల్లో స్థలాల్లో తీరిగ్గా వోపిగ్గా కొత్తవ్యవస్థ గురించి తనకు నచ్చజెప్పి హృదయ పరివర్తన కలిగించేందుకు ప్రయత్నించినట్టు, కొత్తది పాతదాని కన్నా కానాకానా బాగున్నట్టు— కల. కనీసం ఒక గంటసేపటి నిరంతరాయమైన కల. కలలోనేమో హృదయపరివర్తన కలిగినట్టు అనిపించి, మెలకువ రాగానే ఉలికిపాటుతో కొత్తను అడ్డేందుకు పాత రోత పద్ధతుల నవలంబించేందుకు పూనుకుంటాడు పా.మ. అంటే, ఆ మేరకు కలలోనూ హృదయ పరివర్తన కలగలేదన్నమాట. 'రానున్నది' రచయిత దాశరధి రంగాచార్యుల (ప్రస్తుత అ.ర.స. కార్యదర్శి!) ప్రయత్నం కలలో సైతం నిరుకారిందని అర్థం. ఇంతకూ కల ఆ పా.మ. ది మట్టుకే కాదు, రచయితది కూడా. ఆశ్చర్యమైనా విషాదమైనా ఇందుమూలంగానే—

రానున్నది ఏది నిజం?
అది ఒకటే— సోషలిజం!

ఏదో ఒక రచయితల సంఘానికి కట్టుబడిన రంగాచార్యులు ఆ సంఘ తత్వానికి రచన ద్వారా ప్రతినిధి కాగలుగుతున్నాడా ? ఆ సంఘం అనుబంధమైవున్న పార్టీ ఆశయాలను ప్రతిబింబిస్తున్నాడా ? అవునంటే, ఆ సంఘానికీ పార్టీకీ సిగ్గోట్టు ! ఎందు చేతనంటే, పా.మ. కల– రంగాచార్యుల కల– ఆ సంఘానికీ పార్టీకీ గూడా యోగ్యమైనదిగా కనిపించదు. ఇందిరా గాంధీనైతే తలదాల్చారుగాని, సిపిఐవాళ్లు మహాత్మా గాంధీని తలదాల్చ లేదుగదా ! 'హృదయ పరివర్తన' సిద్ధాంతంలో నమ్మకం పెంచుకుని దీనికి హిందూ మతతత్వాన్నీ ఉపనిషత్ సూక్తాన్నీ (సహనా భవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై) తగిలించేదాకా రాలేదింకా. సిపిఐ వాళ్లు నోటితోనైనా మార్క్సు, లెనిన్‌ల నిత్యపారాయణం యధావిధిగా చేస్తున్నారు. రంగాచార్యుల కలలోనైనా మార్క్సు లెనిన్‌లు కనిపించరూ వినిపించరూ– దాదాపుగా 'నస్మరంతి' గాళ్లయ్యారు పాపం ! ఈ దేశంలో ఇందిరా కమ్యూనిస్టులకు "రానున్నది" రంగాచార్యులకు వచ్చేసింది– సిద్ధాంత జాడ్యంతోబాటు ఆచరణ హైన్యం.

దేశంలోని కుళ్లూ కంపూ పోవాలంటే సమాజాన్ని 'సమూలంగా' నాశనంచెయ్యబూనినవాళ్లు– 'యువకులు'– తిరగబడి 'రెచ్చిపోయి', "ఆయుధాలు ధరించి అడవుల్లో దూరుతున్నారు– తద్వారా సమాజాన్ని మార్చాలనీ, విప్లవం తేవాలని తహతహలాడిపోతున్నారు. ఈ సమాజాన్ని మనం మార్చలేకుంటే వారు మారుస్తారు" అంటున్నాడు సభలో– మహాసభలో– "మహామహులున్న మహాసభ"లో వాస్తవాన్ని గుర్తించిన ఒక ప్రజానాయకుడు. ఇతని ఉపన్యాసంలో ప్రజలూ పేదరికమూ కుళ్లూ కంపూ దోపిడీ వగైరా వంచన రాజకీయ వ్యాపార దినుసులు జాస్తీగానే ఉన్నాయి. అందు చేతనే కాబోలు, శ్రోతల్లో కూర్చున్న పా.మ. కునికాడు. అది కునుకేకాదు, గంట నిడివిగల నిద్ర. అంటే, ఉపన్యాసం జోలపాటే అయిందన్న మాట. అయినా ఆ ఉపన్యాసంలో వెలువడిన ఈ వాక్యం ఆలోచించదగింది :

"ఈ సమాజాన్ని మనం మార్చలేకుంటే, వారు మారుస్తారు." దీని అర్థం అగాధం– పదాల అర్థం కాదు, పదాల వెనకాతలవున్న అర్థం: వారు మారుస్తారు ! అమ్మయ్యో ! అలా జరక్కూడదు. వారు మార్చకుండా ఉండాలంటే ముందుగా మనమే మార్చాలి. మాటలతో యేమార్చి వ్యవస్థను మార్చినట్టు ఒప్పిస్తాం- అదే మనకీ వారికీ తేడా, వారు 'యువకులు'- మనం అక్షరాలా పెద్దలం, పెద్దమనుషులం, విజ్ఞులం, బాధ్యత నెరిగినవాళ్లం. ఇదీ అంతరార్థం.

రంగాచార్యులు సాహిత్యపరంగా అద్వైతి ఎలాగూ కాదు, విశిష్టాద్వైతీ అయి నట్టులేదు- ద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నారు. పామునైనా చలిచీమ లెందుకు చంపాలి? వాదించూ, వివరించూ, ఒప్పించూ. అంతేగాని తిట్టకూ, కొట్టకూ, చంపకూ.

"మనిషి మన శత్రువు కాదు, విధానం మన శత్రువు- వ్యవస్థ మన శత్రువు. వ్యవస్థను మార్చారు- మనిషిని మార్చలేమా?" పా.మ. కలలో కోపఘూర్ణిత ప్రజా తరంగం ఒకటి తన ఇంటి మీదికి వచ్చి ఒంటి మీదికి రాకముందు, దాన్ని అల్లంత దూరాన ఆపుటూ 'ప్రజానాయకుడు' (కాబోయే ప్రధాని కాబోలు) పలికిన 'పసిడి పలుకులు' ఇవి. అతడింకా ఇలా సెలవిచ్చాడు- "మీకున్న ఈ ఉద్రేకం, ఈ ఉత్సాహం, ఈ కోపం దారిద్ర్యం మీదికి మళ్లించండి. పేదరికాన్ని, పశుత్వాన్ని, అజ్ఞానాన్ని, అవిద్యను, అమాయకతను నాశనం చెయ్యాల్సి ఉంది. పదండి పోదాం.... మానవతా రాజ్యం నిర్మిద్దాం."

మానవీయత సంతరించుకున్న సోషలిజం (సోషలిజం విత్ ఏ హ్యూమన్ ఫేస్) అంటే ఇదేనా? కాబోలు-

యం. యన్. రాయ్ జీవిత స్మృతుల్లో, సోవియట్ విప్లవ విజయం తర్వాత తమ రాజకీయ ప్రత్యర్థులలో ఒకొక్కరూ మరణదండన పాలౌతూండటం చూచి విప్లవ కారుడుగా తన కఠినమైన బాధ్యతను నిర్దాక్షిణ్యంగా నెరవేరుస్తూ, మరోవైపున మని షిగా కన్నీళ్లు విడిచే సోవియట్ కమిస్సార్ (జెర్జిన్స్కీ?) ప్రస్తావన ఉంది. కలకూ వాస్తవానికీ ఎంత తేడా! కలలోనూ మార్పుచెందని పాములాంటి పా.మ.ని అయ్యో! పాపం! అని విడిచిపెట్టించిన ఈ 'ప్రజానాయకుడు' తన "మానవతారాజ్యం" మళ్లీ పాముల పుట్టగా మారదని ప్రజలకు హామీ ఇవ్వగలడా? శ్రామిక విప్లవ మొకటేగాదు, ఏ విప్లవమైనా, పరమ నిర్దాక్షిణ్యమైన వ్యవహారం. విప్లవం తర్వాత విజయ పరిరక్షణ కోసం మాజీ-పీడకుల పీచమణిచేందుకు శ్రామికరాజ్యం నియంతృత్వంగా వ్యవహరిం చక తప్పదు. పారిస్ కమ్యూన్ చరిత్ర నుంచి మార్క్స్ తీసిన గుణపాఠం ఇది. అంతేగాని, విప్లవం పూలబంతులాటో సరసమో కాదు. కాదనేది రష్యాలోనూ చైనా లోనూ నిరూపితమైవుంది. రంగాచార్యులు కలనువెన్నాడి వాస్తవాన్ని తన్నివేస్తున్నారు.

"అత్యాచారా లనబడేవాటిని వ్యతిరేకించడం అటుంచి, ద్వేషపాత్రులైన వ్యక్తు లకూ ద్వేషపూరితమైన స్మృతులుగల ప్రభుత్వ భవంతులకూ వ్యతిరేకంగా ప్రజా ప్రతీకార చర్యలను సహించడమే గాక, వాటికి నాయకత్వం సైతం వహించాలి."

(అడ్రెస్ ఆఫ్ ది సెంట్రల్ కమిటీ టు ది కమ్యూనిస్టు లీగ్ 1850). విప్లవ శ్రామిక వర్గాన్ని వుద్దేశించి హితోపదేశం చేస్తున్న రంగాచార్యులు గాంధీమహాత్మునికి బలిపెట్టిన వ్యక్తి— మరెవరోకాదు— కార్ల్‌మార్క్సు. సోషలిజం విషయంలో గాంధీకీ నెహ్రూకీ భావసంఘర్షణ జరిగినప్పుడు (1934), దోపిడీశక్తులను అదుపులో పెట్టాలని అంటూనే అది నిర్బంధ పూర్వకంగా మాత్రం జరగరాదని గాంధీ అన్నాడు. మార్క్సు చెప్పిం దైనా విప్లవ సమయంలో ప్రజల ద్వేషం, క్రోధం, ప్రతీకారం గురించేగాని 'వ్యక్తి హింసావాదం' (టెర్రరిజం) అనబడే దాన్ని గురించి కాదని గుర్తించాలి.

చంపదగిన యట్టి శత్రువు తన చేత
జిక్కెనేని వాని జంపరాదు....

రంగాచార్యుల విప్లవ తత్వానికీ భారత మతనైతిక తత్వానికీ తేడాలేదు. రంగాచార్యులకు తత్వమైతే ఉంది, విప్లవం మినహా, కాకుంటే, ఆయనది విప్లవ మతం లాగుంది— విప్లవ హైందవమా, మధోక్ హైందవ సోషలిజంలాగా ? "ప్రేమ పెంచడం మా ధ్యేయం, తుంచడం కాదు." సొంపైన మాటలు ! ఏమిటా ప్రేమ, ఎవరికి ఎవరిమీద ? సర్వభూతదయలా సర్వమానవ ప్రేమా ? అయితే కలకన్నా హీనమే. నిర్దిష్ట మానవ వర్గాలు నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట సంబంధాలు కలిగి తలపడి పోరాడే జీవిత తలంలో "సర్వేజనా స్సుఖినోభవంతు" లకు "సహనా భవతు" లకూ తావుండదు.

"మతం పాలకులకు నీతి బోధించింది. పాపపుణ్యాలను సృష్టించింది. బలవంతునికి పాపభీతి కలిగించింది. తద్వారా బలహీనుణ్ణి ఆదుకుంది. అప్పుడు జనం మతాన్ని మన్నించింది." మతానికి ఒకనాడుండిన సామాజిక ఉపయోగం విషయంలో మార్క్సు కూడా ఇలా కొంత చెప్పాడు గాని, అంత మాత్రాన మతాన్ని నెత్తికెత్తుకో లేదు. జనం మతాన్ని మన్నించిందెప్పుడట ? పాశవిక దశలో బలవంతుడే పాలకుడు కాగా, బలహీనుడు బతకటమే కష్టమై, అతనికి 'రక్షణ' యివ్వడానికి బలమైన రాజ్యాంగ యంత్రం లేనప్పుడట ! నిశ్చితంగా ఏ మతం మానవ సమాజ చరిత్రలో ఈ పని చేసిందో రంగాచార్యులే చెప్పాలి. మనిషిలో భావదాస్యం కలిగించింది. తాను కల్పించుకున్న భయాన్ని అతీతశక్తులుగా దేవతామూర్తులుగా మార్చి భక్తినీ విధేయతనూ నేర్పింది. తన నిస్సహాయతనూ పరాధీనతనూ మతంద్వారా ప్రకటించుకున్నాడు ఆదిమ మానవుడు. ఇక, రాజ్యాంగ యంత్రం వచ్చి బలహీనులకు రక్షా కవచమైందా ? వర్గవిభజన ఏర్పడిన గణసమాజంలో వర్గ సంఘర్షణను శాంతింప

జేసేందుకు, విరుద్ధవర్గాలకు అతీతంగా ఉన్నట్టు భ్రమగొలిపి, కలవారి కొమ్ముగాచేందుకే రాజ్యాంగయంత్రం ఉపకరించింది. దానికి మతం సైదోడయింది. తోడు దొంగా అయింది. కాబట్టే రాజకీయాధికారానికి పోటీపడజూచిన సందర్భాల్లో ఈ రెండింటి కలహాలను ప్రజలు వాడుకొని ఉండవచ్చు. ఈ వాస్తవాలేమీ రంగాచార్యులకు పట్టవు. రాజ్యావతరణ తర్వాత వర్గాలు, వర్గపోరాటం పుట్టుకొచ్చాయని అనడం, చరిత్రను తల్లకిందులుగా చూపడమే.

అద్దంలో చందమామ కావలసినట్టుగా వుంది రంగాచార్యులకు. చివరికి, గుణ కర్మ విభాగాన్ని బట్టి వర్ణాలేర్పడ్డాయన్న గీతావచనానికి గూడా ఉపపత్తి కల్పించాలని చూస్తున్నారు. "వాటి ఉత్పత్తికి అది అవసరం అయినాయి." 'నాటి' ఉత్పత్తికి కాబోలు! కుల విభజన లేకుండా ఉత్పత్తికి వీలు లేదా యేమిటి అనాడు?. భోజన ప్రతిభోజనాల గురించీ వివాహ సంబంధాల విధి నిషేధాల గురించీ, ఏ వృత్తి కావృత్తి తన చుట్టూ అడ్డుగోడలు లేపి, కులాలుగా మార్పు చెందితేనే తప్ప ఉత్పత్తి జరక్కుండా వచ్చిందా? ఉత్పత్తి శక్తుల ప్రాథమిక దశలో వర్గభజన వృత్తి కులాల రూపం తీసుకుందని కొశాంబీ అంటాడు. అయితే సమాజం, మతం, ఈ విభేదాలకు ముద్ర గొట్టి నిలిపింది. జీవితంలో, భావంలో, ఇవి జీర్ణించి పోయాయి. నేటిదాకా వీటి పాదు కదల్లేదు. "రైళ్లూ విమానాలూ వచ్చి ప్రపంచం దగ్గర అయింతరువాత కులాలు వాటంతటవే చెరిగిపోయాయి" అని భూతకాల క్రియారూపాన్ని తమ భవిష్యద్దర్శనంలో కాలజ్ఞానతత్వంలో వాడగలుగుతున్నారు రంగాచార్యులు. వాటంతట ఏవీ పోవు.

ఒకటిమట్టుకు నిజం. భవిష్యత్తనేది సైతం భూతకాలం నుంచి వెనువెంటనే పూర్తిగా స్వతంత్రించదు. కాలగర్భం నుంచి బయటబడిన కొత్తసమాజం శరీరమంతటా తన తల్లిఅయిన పాత సమాజం తాలూకు మరకలూ మచ్చలూ చాలాకాలం వుండిపోతాయని చెప్పాడు మార్క్సు. ఇప్పటికీ 'సోషలిస్టు' దేశాల్లో మతం గతానికి చెందిపోలేదంటే, రంగాచార్యుల కలలో అది మిగిలి ఉండటం ఆశ్చర్యకరం కాదు.

సమసమాజంలో ఒక గ్రామం. అక్కడ యువకులు 'ప్రతాప రుద్రీయం' నాటకం! వేస్తున్నారు. శ్రమను కీర్తించే నాటకాలకు కరువేమో! కొత్త రచయితలింకా పాతకే అంకితమై ఉన్నారేమో! కొత్త-పాత, పాత-కొత్త రచయితలు మిగిలి ఉన్నారేమో! "పేరయ్య రాజంట పేరెల్లి రాణంట" అంటూ 'చాకలి పేరిగాడు' తన కులాన్నింకా తానే తక్కువ చేసుకుంటూ వుంటాడేమో!

మూగవోయిన 'యుగ' స్వరం



'ప్రభుత్వం మనది
ఏమయినా చెయ్యొచ్చు
నోరు మనది నాటెం మనది ఏమయినాతినొచ్చు
అహం మనది అధికారం మనది
ఎవర్తినయినా చెరచొచ్చు....
చివరికి చీకటినే ఖాయం చెయ్యాలి....
ఎదురు తిరిగిన ప్రతివాడికి
ఒక గొయ్యి తవ్వించాలి—
ఎవడైనా మాట వినకపోతే
ఇనుప టోపీ చూపించు
తోలు తుపాకీ చూపించు
నారిని చూపించు నాణాన్ని చూపించు
బ్లూఫిలిం చూపించు
చెయ్యి జారితె బొందలగడ్డ చూపించు
నక్కరాసె పాటలకు
బాణీ కట్టడం చాతనయితె చాలు
మళ్ళీ మబ్బు అతుక్కునె వరకూ
ఈ సలహా చాలు
నీదే రాజ్యం
చీకటి ప్రభుత్వం
కొత్తరాగం పాడు
కొత్త బాణీ కట్టు.'

'నల్లని సత్యం' గురించి 72జూన్ సృజనలో రాసాడు 'యుగ'. అప్పటి కాయన వయస్సు 22. అకస్మాత్తుగా ఈ సంవత్సరం జనవరి 23న మరణించాడు.

'ప్రేమ', 'మంచి', 'అందం', 'ఆనందం', 'సర్వసమానత'— ఈ మాటల మాయ, మాయ మాటల లోకంలో మేలుకుని నిద్రిపోతూ నిద్రలో మేల్కొంటూ రచిస్తున్నట్టున్నారు ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం తాజా కార్యదర్శి దాశరధి రంగాచార్యులు. వీరిది వట్టి పిచ్చిమాలోకమని కొట్టి వేసేందుకు తాము అర్భకులేమీ కాదు. అ.ర.సం. సోషలిజం ఎంత సరసమైపోయింది! కారుచవక!

బలే మంచి చౌక బేరమూ
కనీ కొనుడు సుజనులార!
బలే మంచి....
బలే మంచి....
బలే మంచి చౌక బేరము!

(నెల్లూరు డిస్ట్రిక్టు జైలులో 28-5-1976న రాసిన ఈ వ్యాసాన్ని సాపు రాసేప్పుడు కొన్ని చిన్నమార్పులు తప్పలేదు.)

చనిపోయేముందు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. ఇ. బి. యుగ పుట్టింది బందరులో. బిఎస్సీ పూర్తిచేసి ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఎన్. డి. సి. ఎ. చేసాడు. 1967 నుంచి 'ఆర్ట్ లవర్స్' సభ్యుడు. 72 నుంచి 'ఆర్ట్ వేవ్' అధ్యక్షుడు. 12 నాటికలు, 10 వ్యాసాలు, 10 కవితలు, 200 కార్టూన్ లు (వివిధ పత్రికల్లో) 300 ఇలస్ట్రేషన్స్, 60 కవర్ పేజీలు- మరెన్నో బొమ్మలు వేసాడు. 'యుగార్ట్స్' స్థాపించి నిర్వహించాడు.

ఆరేళ్ళ తర్వాత అనుకోకుండా ఆయన నుంచి సృజనకో కవిత వచ్చింది. దాని వెంటనే ఆయన హఠాన్మరణ వార్త వచ్చింది.

పగలంతా ఎర్రగా కాలిన
అస్థిపంజరం- చలికాలంలో
భయంకరమైన చలిలో
ఇంకా మండుతూనే వుంది
వర్షం కురిసినా, నీళ్ల గుమ్మరించినా
అది ఆరదు
దాన్ని అనుకున్న మిగతా ఎముకల
గూళ్లు కూడ తగలడ్తూనే ఉంటాయి

కాని వాటి జీవితంలో చల్లారవు
....
నా దేశం నా దేశం అని ఏడ్చే
ఓరి మోగని టపాకాయా....
ఎవడి వీపుమీద ఎక్కి
నా దేశం అని అరుస్తున్నావో
వాడి కాళ్ళు ఎక్కడున్నాయో తెలుసా ?

యుగ వేదనను ప్రతిస్పందించిన 'యుగ' భవిష్యత్తులో యుగ స్వభావాన్ని మరింత స్పష్టంగా స్పందించి కలంలో కలల అలలేకాదు గమ్యాన్ని కూడ కళవరించే వాడని అనిపిస్తోంది. 'తొణికిన స్వప్నం' 'యుగ' మరణానికి సృజన హృదయ పూర్వకంగా విచారాన్ని ప్రకటిస్తున్నది.

ప్రకృతి మానవుడుగా అభివృద్ధి చెందిన 'ప్రకృతి (సహజ) చరిత్ర'లో చరిత్ర దానంతటది ఒక 'నిజమైన' భాగం. పరిసరాల విజ్ఞాన శాస్త్రాన్ని ఈనాడు తనలో భాగంగా చూస్తున్నట్లుగానే ప్రకృతి శాస్త్రం మానవ విజ్ఞాన శాస్త్రాన్ని కూడ తనలో భాగంగా చూసే రోజొకటి వస్తుంది.

— మార్క్స్

కథలు కావాలి

ప్రజా జీవితాన్ని, విప్లవ చైతన్యాన్ని సజీవంగా స్పందించే కథల కోసం సృజన రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నది.

భాషా, సాహిత్యాలపై లూసున్:

వర్తమాన హంతకులు

సంస్కృతిపరులైన పెద్దలు "దేశీయ వాడుకభాష అసభ్యంగానూ, నీచంగా జుగుప్సాకరంగానూ" వుంటుందంటారు.

చైనాలో నిరక్షరాస్యులందరికీ వచ్చేది మాట్లాడడం మాత్రమే. కనుక, వారి భాష మరి "అసభ్యంగానూ, జుగుప్సాకరం"గానే వుంటుంది. నావంటి వాళ్లందరం "సరైన (భాషా)జ్ఞానంలేక, మా తెలివి తక్కువతనం కప్పిపుచ్చుకోడానికే వాడుకభాషను సమర్థిస్తున్నాం". అంటే మేమూ అసభ్యంగానూ, నీచంగా జుగుప్సాకరంగానే వుంటున్నామని యిక వేరే చెప్పనవసరంలేదు. కాని, వచ్చిన చిక్కంతా ఏమిటంటే ఈ సంస్కృతీ పరులుకూడా, రెండు గ్లాసుల సారాయినీ ప్లేటు మాంసాన్నీ కూడా పరమ ప్రామాణికమైన గ్రాంధిక భాషలో వర్ణిస్తూ కూచునే 'అద్దంలో పూలు' నవల [లిజుచెన్ (1763_1830) రచన] లోని సేవకుడిలాగా, నిత్యమూ గ్రాంధిక భాషనే వుపయోగిస్తూ కూచోలేరు. మహత్తరమైన వారి ప్రాచీనతా స్వభావాన్ని ప్రామాణిక గ్రంధరచనల్లో మాత్రమే ప్రదర్శించి, తీరా మాట్లాడడం వచ్చేసరికి వారుకూడా యీ 'అసభ్యమూ, జుగుప్సాకరమూ' అయిన వాడుక భాషలోనే పడిపోతున్నారు. చైనా అంతటా, నలభై కోట్ల మంది ప్రజలూ మాట్లాడే భాష 'జుగుప్సాకరమైనది' నిజంగా ఎంత శోచనీయం.

మనుషులుగా వుంటే తృప్తిలేదు, వీరు అమరులై పోవాలనుకుంటారు. భూమి మీద బతుకుతూనే వీరు స్వర్గంలో విహరించ గోరుతారు. ఆధునికులై, ఆధునిక (నాగరికతా) వాయువులు పీలుస్తూనే, వీరు చావసిద్ధంగావున్న కన్‌ఫ్యూసియన్ నీతులనూ, మృత భాషనీ ప్రజల నెత్తిన రుద్దజూస్తున్నారు. వర్తమానానికి ఎంత అవమానం! వీరు "వర్తమానానికి హంతకులు". ప్రస్తుతాన్ని ఖూనీ చేయడం ద్వారా వీరు భవిష్యత్తును కూడా హత్యచేస్తారు.

కాని భవిష్యత్తు మన వారసులది!

Murderers of the Present (1919)

— అనువాదం : సారధి

సాహిత్యమూ - చెమటా

షాంఘైలో ఒక ప్రొఫెసరు సాహిత్యం గురించి యిలా ఉపన్యసిస్తున్నాడు. సాహిత్యం అజరామరమైన మానవతా లక్షణాలను వర్ణించాలి; లేకుంటే అది కలకాలం నిలువదు. ఉదాహరణకు, ఇంగ్లండ్‌లో షేక్‌స్పియరూ మరి కొద్దిమందీ శాశ్వత

మానవతా లక్షణాలను గురించి రాశారు కనుకనే వారి గ్రంథాలను ఇప్పటికీ చదువు తున్నారు. ఇతరులు అలా చేయనందువల్లనే వారి సాహిత్యం నశించిపోయింది.

చదవేస్తే ఉన్నమతి పోయింది, అన్నట్టుంది యిది. ఇంగ్లీషు సాహిత్యంలో పూర్వకృతులు అనేకం తప్పకుండా నశించిపోయే వుంటాయని నేనూ ఒప్పుకుంటాను. కాని అవి అన్నీ అనంతమైన, శాశ్వతమైన మానవతా లక్షణాలను వర్ణించక పోవడం వల్ల మాత్రమే నశించిపోయేయని నా కిప్పటివరకూ తెలియదు. అయితే, ఇప్పుడీ విషయం తెలిసింది కనుక, అవి సరిగ్గా ఆ కారణం వల్లనే నశించిపోయేయని ఖచ్చిత మైన నిర్ధారణకు రావడానికి, ఆ నశించిపోయిన గ్రంథాలను యీ ప్రొఫెసరు ఎక్కడ చూడగలిగాడా అని నాకు అర్థంకాకుండా వుంది.

నిలిచివున్నదంతా మంచి సాహిత్యమూ, నశించిపోయినదంతా చెడ్డదీను. చాలా బావుంది. ఒక దేశాన్ని ముట్టడించి, పట్టుకుంటే నువ్వు రాజువి; ఓడిపోతే బంది పోటువి. ఆహా! ఈ చరిత్ర సిద్ధాంతాన్ని సాహిత్యంమీద రుద్దబోకండి.

మానవతా లక్షణాలు, అసలు నిజంగా ఎన్నటికీ మారకుండా వుండేవేనా?

కోతి, కోతినిపోలిన మనిషి, ఆదిమ మానవుడు, ప్రాచీన మానవుడు, ఆధునిక మానవుడు, భావి మానవుడు.... జీవి యిలా పరిణామం పొందేదైతే, మానవతా లక్ష ణాలు కూడా మార్పులేకుండా వుండజాలవు. మనిషికి పూర్వపు కోతి సంగతి వదిలి పెట్టండి, కనీసం లిఖిత చరిత్రకు ముందటి మనిషి యొక్క అనుభూతులనైనా సరే మనం సరిగా ఊహించగలమా అంటే, అదీ సందేహమే. భావి మానవుడు నేటి మనల్ని అర్థం చేసుకోలేడేమో కూడా. శాశ్వత మానవతా లక్షణాలను గురించి రాయడం నిజంగా చాలా కష్టం.

ఉదాహరణకు, చెమటపోయడమే తీసుకోండి. పూర్వం మనిషికి చెమటపోసే దనే నేను నమ్ముతున్నాను. ఇప్పుడూ మనిషికి చెమట పోస్తుంది. ఇక ముందు చాలాకాలం వరకూ మనిషికి చెమటపోస్తూనే వుంటుంది. అందువల్ల సాపేక్షికంగా, యిది 'శాశ్వత మానవతా లక్షణం'గానే లెక్కించవచ్చుననుకుంటాను. అయితే, నాజూ కైన యువతుల చెమట సువాసనాభరితంగా వుంటుంది; మొద్దుల్లావుండే, ఎద్దుల్లాటి శ్రామికుల చెమట కంపుకొడుతూ వుంటుంది. మరి, నేను చిరకీర్తిగల రచయితను కావాలంటే. నా సాహిత్యం కలకాలం నిలవాలంటే నేను ఏ చెమటగురించి రాయడం మంచిది? సువాసనల చెమట గురించా లేక కంపుకొట్టే చెమట గురించా? ఈ సమ స్యను పరిష్కరించే వరకూ సాహిత్య చరిత్రలో మన స్థానానికి భద్రతలేదు.

పారిస్ కమ్యూన్

సి. వి.

"మానవ చరిత్రలో ప్రప్రథమంగా శ్రామికవర్గ రాజ్య సంస్థాపనార్థం జరిగిన మహోజ్వల ప్రయత్నమే పారిస్ కమ్యూన్! 1871 మార్చి 18 వ తేదీన కార్మికవర్గం సాధించిన చారిత్రాత్మక విజయమే పారిస్ కమ్యూన్! శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంత పితామహులైన మార్క్సు-ఎంగెల్సులు పరోక్షంగా పాల్గొన్న ఈ శ్రామికవర్గ మహా విప్లవం, ప్రపంచ సోషలిస్ట్ వ్యవస్థలో నూతనాధ్యాయాన్ని నెలకొల్పింది. విపరీత విపత్కర పరిస్థితుల్ని సైతం అత్యంత ధీరోదాత్తంగా ఎదుర్కొని, 72 రోజులు మాత్రమే జీవించినా, యూనియన్ దోపిడీగాళ్ళ గుండెల్లో బండరాళ్ళు విసిరి, వారిని గడగడ లాడించింది. యావత్ పీడిత తాడిత జనతా సందోహానికి భవిష్యత్ వెలుగుబాటని చూపించి, మహోజ్వల చరిత్రని సృష్టించి, దారుణాతి దారుణమైన దౌర్జన్య కాండకి గురియై కాలగర్భంలో లీనమైంది.

అమరవీరుల రక్తపుటేరుల్లో, మాతృమూర్తుల కన్నీటిధారల్లో ముంచెత్తబడిన పారిస్ కమ్యూన్ శాశ్వతంగా మటుమాయమైందని నరరూప రాక్షసులంతా చంకలెగరవేసుకొని సంబరపడ్డారు! కాని, ఈ సంబరం పతాకస్థాయి నందుకొన్న వారి బుద్ధి మాంద్యానికి ప్రబల నిదర్శనం మాత్రమే! విశ్వశ్రామికవర్గం అద్యతన భవిష్యత్తులో సాధించనున్న మహోజ్వల విజయాల్ని సూచించే అపూర్వ ఘటనయే పారిస్ కమ్యూన్. అందుచేతనే మార్క్సు మహనీయుడు, పారిస్ కమ్యూనార్డులను రాబోవు యుగం దూతలుగా, నవ సమాజ వైతాళికులుగా, భవిష్యత్ ప్రపంచ నిర్మాతలుగా,

---

ఉదాహరణకు, ఇంగ్లండ్‌లో ప్రాచీన నవలల్లో ఎక్కువభాగం స్త్రీలకోసమే రాయబడ్డట్టు విన్నాను. అంటే సహజంగానే వాటిలో సువాసనల చెమటదే పైచేయి అయివుంటుంది. కాని, పంథొమ్మిదో శతాబ్దం చివరికల్లా రష్యన్ సాహిత్య ప్రభావం వల్ల వారి సాహిత్యంలోకూడా కంపు చెమట చెప్పుకోదగినంత ఎక్కువగానే చొరబారింది. మరి వీటిలో ఏది కలకాలం నిలుస్తుందో?! ఇప్పుడప్పుడే తేల్చి చెప్పలేం.

చైనాలో, టావోయిస్టులు టావో గురించి మాట్లాడటం విన్నా, సాహిత్య విమర్శలు చూసినా రక్తం గడ్డకట్టి పోవలసిందే తప్ప, చెమట పోయడానికి సాహసం వుండదు. కాని, చైనాలో కూడా చెమటపోయడం శాశ్వత మానవతా లక్షణమే!

Literature and Persperation (23-12-1927)

— అనువాదం : సారథి

వేనోళ్ళ ప్రస్తుతించాడు. "ప్రస్తుతకాలంలో మనమంతా పారిస్ కమ్యూన్ భుజస్కంధాలపై నిలిచి వున్నాం" అనీ, "సోవియట్ రాజ్యాధికార పిండ స్వరూపమే (ఎంబ్రియో ఆఫ్ ది సోవియట్ పవర్) పారిస్ కమ్యూన్" అనీ, మార్క్సిస్టు సిద్ధాంత మహోపాధ్యాయుడైన లెనిన్ కమ్యూన్ని ప్రశంసించాడు. మార్క్స్ - ఎంగెల్స్ లెనిన్ స్టాలిన్లను సిద్ధాంత ఆచరణ రంగాల్లో ప్రభావితం గావించి, దేశదేశాల విప్లవ యోధులకి నేటికీ ఆదర్శప్రాయంగా పరిణమించి, మాసపేతి హాసంలో అపూర్వ చరిత్రని సృజించి అజరామరమైన పారిస్ కమ్యూన్ తీరు తెన్నుల్నీ, జనన మరణాల్నీ, భవిష్యత్ శ్రామికవర్గ విప్లవానికి అది ప్రసాదించిన అమూల్యానుభవాల్నీ" తన వచన కవితా మహాకావ్యం 'పారిస్ కమ్యూన్'లో వివరించిన సి.వి. 'తొలిపలుకు' లోంచి స్థలాభావం వల్ల కొన్ని ముఖ్యమైన చారిత్రకాంశాలను మాత్రమే కింద యిస్తున్నాము.— సంపాదకుడు.

పారిస్ కమ్యూన్ ఆవిర్భావం

ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన హోటల్-డి-విల్లీపై 1871 మార్చి 18వ తేదీన ఎర్రజెండా ఎగిరింది! యుగయుగాలుగా పీడిత ప్రజల కాళ్ళకీ చేతులకీ కళ్ళకీ మెడళ్ళకీ వేయబడ్డ బానిస సంకెళ్ళు ఆ చరిత్రాత్మక దినంనాడు పెళ్లున బద్దలైపోయాయ్. నాటి పారిస్ సామాన్య ప్రజల ఆనందానికి పట్టపగ్గాల్లేవు. తరతరాల దారుణ దాస్యంనించి ప్రప్రథమంగా విముక్తిజెందిన వారి సంబరాన్ని వర్ణించడానికి భాషలో పదాల్లేవు.

"భూకంపంలా విప్లవం బద్దలైనప్పుడు, కార్మికవర్గం పారిస్‌నుపరిపాలిస్తుంది"; "పారిస్ అధికారం యెవరిచేతుల్లో వుంటే, వారే మొత్తం ఫ్రాన్సును పాలిస్తారు" అని మార్క్స్ స్పష్టం జేశాడు.

నేషనల్‌గార్డ్స్‌చే యెన్నుకోబడ్డ సెంట్రల్ కమిటీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంగా అధికారం చేపట్టి, ఈ విధంగా ప్రకటించింది— "పాలకవర్గ వైఫల్య విద్రోహాలవల్ల పారిస్ కార్మికులు, పౌర రక్షణ బాధ్యతల్నీ తమ చేతుల్లోకి తీసుకోవలసిన సమయ మాసన్నమైందని గ్రహించారు. ఈ విధంగా పరిస్థితిని అదుపులో పెట్టేందుకు పూనుకొన్నారు."

ఈ విప్లవాన్ని ప్రధానంగా ఆర్గనైజ్ చేసినవారు సాయుధులైన బ్లాంకిస్టులు. వారు పారిస్‌లో 4 వేల మంది వరకూ వున్నారు. 1871 సెప్టెంబరు 17వ తేదీన ఆగస్ట్ బ్లాంకీ అరెస్ట్ చేయబడ్డాడు. కమ్యూన్ జీవించినంతకాలమూ, ఆయన బంది

ఖానాలోనే వున్నాడు. పారిస్‌లో స్వల్ప సంఖ్యలో వున్న మార్క్సిస్టులు విప్లవానికి పథకంవేయలేదు. కాని విప్లవం ప్రారంభంకాగానే అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

పారిస్ కమ్యూన్‌కు మార్క్స్ - ఎంగెల్స్‌ల సపోర్ట్

థేర్స్ ప్రభుత్వంపై మార్చి 18న పారిస్ కార్మికులు తిరుగుబాటు జేశారనే వార్త లండన్‌కు చేరగానే, మహత్తర విప్లవకారుడైన మార్క్స్ ఆ విప్లవాన్ని హృదయపూర్వకంగా బలపర్చేందుకు తక్షణం ముందుకొచ్చాడు. మీనమేషాలు లెక్క వేయకుండా వారికి శాయశక్తులా సాయం చేయడానికి ఆయన ఉద్యమించాడు. పారిస్ పీడిత ప్రజలకు అండగా యావత్ ప్రపంచంలో బ్రహ్మాండమైన సౌహార్ద ఉద్యమం ప్రారంభించాలని పిలుపునిచ్చాడు. దేశదేశాల్లో వున్న ఇంటర్నేషనల్ శాఖలకు ఆయన లేఖలు రాసి, పారిస్ విప్లవ ప్రాధాన్యాన్నీ, దాని అంతరార్థాన్నీ వాటిలో సిద్ధాంతపరంగా విశదీకరించాడు.

అయితే ఈ సందర్భంగా ప్రధానమైన సిద్ధాంత సమస్య వొకటి తలెత్తుతోంది. "విపత్కర పరిస్థితుల్లో ఫ్రెంచి కార్మికవర్గం యిప్పుడు జీవిస్తోంది. శత్రువులు దాదాపు పారిస్ నగర ప్రాంగణంలో వుండగా, ప్రస్తుత సంక్షోభంలో కొత్త ప్రభుత్వాన్ని పడ గొట్టే ఎట్టి ప్రయత్నమైనా అత్యంత తీవ్రమైన తప్పిదమే కాగలదు" అని 1870 సెప్టెంబరు 9వ తేదీన మార్క్స్ ఫ్రెంచి కార్మికవర్గాన్ని హెచ్చరించాడు. (సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్ - పేజీ 30) ఈ విధంగా హెచ్చరించిన ఆయన, పారిస్‌లో విప్లవం ప్రారంభమైందని తెలిసిన తర్వాత ఎంచేత బలపర్చాడు ?

"పెట్టుబడిదార్లకి వ్యతిరేకంగా కార్మికులు సాగించే పోరాటంలో, వారుపొందే ఓటమికన్న, పోరాటం సాగించనందువల్ల వారిలో కలిగే నిస్పృహ (డిమోరలైజేషన్) ప్రమాదకరమైంది. ఏవిధమైన పోరాటం జరుపకుండానే, పారిస్ ప్రజలు తమను తాము నిరాయుధం చేసుకోవడానికి అంగీకరించినట్లయితే, ఆ స్థితిలో వారు పొందే నిస్పృహ, అనేకమంది "నాయకుల" లొంగుబాటుకన్న అత్యంత దురదృష్టకరమైంది" అని మార్క్స్ 1871 ఏప్రిల్ 17వ తేదీన కుగెల్‌మన్‌కు రాసిన లేఖలో స్పష్టంజేశాడు. "పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా వున్నాయని భావించిన స్థితిలోనే, పోరాటం ప్రారంభించేట్లయితే, ప్రపంచ చరిత్రను నిర్మించడం చాలా సులభమైన పని గదా ?" అని ఆయన ఆ లేఖలోనే ప్రశ్నించాడు.

అంతేగాదు– మార్క్స్, కుగెల్‌మన్‌కు 1871 ఏప్రిల్ 12వ తేదీన రాసిన లేఖలో, "ఏది ఏమైనా, పారిస్‌లో ప్రస్తుతం జరుగుతోన్న విప్లవాన్ని పాత వ్యవస్థకు చెందిన తోడేళ్లూ ఊరపందులూ వీధికుక్కలూ అణిచివేసినా– అది– 1848 జూన్ తిరుగుబాటు తర్వాత మన పార్టీ సాధించిన మహోజ్వలమైన కార్యం" అని పారిస్ విప్లవాన్ని ప్రశంసించాడు. "ఈ పారిస్ ప్రజల్లో ఎంతటి చారిత్రాత్మకమైన చొరవ, ఎంతటి మహత్తరమైన త్యాగనిరతి" అంటూ ఈ లేఖలోనే పారిస్ కమ్యూనార్డ్స్‌ను ఆయన వేనోళ్ళ ప్రస్తుతించాడు.

కమ్యూన్ సాధించిన ఘనకార్యాలు

సార్వజనీన ఓటింగ్ పద్ధతిపై కమ్యూన్‌కు జరిగిన ఎన్నికల్లో 92 మంది కౌన్సిలర్లు ఎన్నుకోబడ్డారు. వీరితోనే కమ్యూన్ నెలకొల్పబడింది. శాసనసభగా (లెజిస్లేచర్) కార్యనిర్వాహకవర్గంగా (ఎగ్జిక్యూటివ్) ఒకే సమయంలో కమ్యూన్ పనిచేయ నారంభించింది. యుద్ధం, ఆర్థిక వ్యవహారాలు, విదేశాంగ, కార్మిక, న్యాయ, సమాచార, జనరల్ సెక్యూరిటీ, విద్య, పబ్లిక్ సర్వీస్ శాఖలు– తొమ్మిదింటిని నెలకొల్పారు.

పారిస్‌ను ఆదర్శంగా తీసుకొని, మిగతా ఫ్రెంచి పట్టణాల్లో ఇలాంటి కమ్యూన్‌లను ఏర్పరచాలనీ, పారిస్‌లోని నేషనల్ డెలిగేషన్‌కు ప్రతినిధుల్ని పంపాలనీ ప్లాను వేశారు. అయితే యీ పథకం ఆచరణలో నెరవేరలేదు.

కమ్యూన్‌లో ప్రౌధానిస్టులూ, బ్లాంకిస్టులూ, నియోజాకొబిన్లూ మెజారిటీలో వుండగా, మార్క్సిస్టులు 18 మంది మాత్రమే వున్నారు. రేడికల్ పెటీబూర్జువా–కార్మిక–విప్లవ సంఘటనగా కమ్యూన్ రూపొందింది. కమ్యూన్‌లోని ప్రౌధానిస్ట్–బ్లాంకిస్ట్ మెజారిటీ, కమ్యూన్ కార్యకలాపాలపై, దాని జయాపజయాలపై స్పష్టమైన ప్రభావాన్ని కలగజేసింది.

థేర్స్ ప్రభుత్వ ఆజ్ఞలమేరకు, ఇంజనీర్లూ మేనేజర్లూ ఎకౌంటెంట్స్ అంతా పారిస్‌ను వదలి వెర్సైయిల్స్‌కి పారిపోయారు. కొత్తతరహా ప్రభుత్వ యంత్రాన్ని కిందినించి మీదదాకా పునర్నిర్మించుకోవలసిన గురుతర బాధ్యత పారిస్ కమ్యూన్ భుజస్కంధాలపై పడింది. తత్ఫలితంగా వారు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పని చేయాల్సి వచ్చింది. కమ్యూన్ ఉత్పత్తి కబుర్లు చెబుతో కాలం గడపలేదు. కష్టజీవుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకీ, ప్రజాస్వామ్యానికీ అడ్డుగోడలుగా నిలిచిన వాటిని చిత్తశుద్ధితో తొలగించ యత్నించింది.

భౌతిక బానిసత్వం నించి సామాన్య జనులకి విమోచనం

పెట్టుబడిదారీ ప్రభుత్వంలో సైన్యమూ, పోలీసులూ, ప్రజలపై దారుణ దమన కాండను అమలుజేసే సాధనాలుగా మాత్రమే వినియోగింపబడతారు. ప్రజలనించి యీ రెండు శాఖల్నీ వేరుజేసి, ప్రజల్ని అణచేందుకు వీటిని ఉపయోగించడంవల్ల, అది ప్రజాస్వామ్యాన్ని అణచడమే కాగలదు. అంచేత, కమ్యూన్ యీ సమస్యను ఆమూలాగ్రంగా పరిశీలించింది. దోపిడీ పాలక వర్గాల చేతుల్లోని "గుడ్డి ఆయుధం" ఐన సైన్యాన్ని (స్టాండింగ్ ఆర్మీ) కమ్యూన్ రద్దుచేసింది. యావత్ ప్రజల్నీ సాయుధులను గావించింది? ప్రజలంటే భయంలేని రాజ్యం (స్టేట్) మాత్రమే, ప్రజలకి సంపూర్ణ ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం మాత్రమే ఈ విధంగా ప్రజ లందర్నీ సాయుధుల్ని జేయడానికి సాహసించగలదు.

జడ్జీలు, మేజిస్ట్రేట్లు, నిరంకుశాధికారులు, (బ్యురాక్రసి) దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాల్నే నిరంతరం కాపాడుతోంటారు. అంచేత ప్రభుత్వాధి కారులంతా, ప్రజలచే ఎన్నుకోబడి, తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించనినాడు, వారు ప్రజలచే తొలగింపబడే హక్కును (the right of Recall) కమ్యూన్ కలుగజేసింది. ఈ విధంగా ఈ ప్రజావ్యతిరేక వ్యవస్థను కూకటివేళ్ళతో సహా పెకలించివేసింది.

అధికారులకీ ప్రజలకీ మధ్య, ఆర్థిక సంబంధమైన అడ్డుగోడలు తొలగించ డానికి, కమ్యూన్ సభ్యులు మొదలు, ప్రభుత్వోద్యోగు లందరూ కార్మికుల కిచ్చే జీతాలతోనే పనిచేయాలని కమ్యూన్ నిర్దేశించింది. ఉన్నతోద్యోగులకు, నెలకు 500 ఫ్రాంకుల జీతం నిర్ణయించింది. ఇది కార్మికులకిచ్చే వేతనంతో సరిసమానం; తత్ఫలితంగా ఉన్నత ప్రభుత్వాధికార్ల కిచ్చే పెద్దపెద్ద జీతబత్తేలూ, వారికిచ్చే సమస్త ప్రత్యేక సౌకర్యాలూ అదృశ్యమయ్యాయ్. మునిసిపల్ పరిపాలనా నిర్వహణ దగ్గర నుండి, ప్రభుత్వ కార్యకలాపాలన్నీ కమ్యూన్ కే అప్పగించబడ్డాయ్.

పెట్టుబడిదార్ల చట్టాన్ని అమలు జేస్తో, వారి వర్గ ప్రయోజనాల్ని నిరంతరం కాపాడే న్యాయశాఖ యొక్క కపటమైన పాత్రకు కమ్యూన్ స్వస్తి చెప్పింది. బూర్జువా వర్గం కనిపెట్టిన అత్యంత బూటకమైన వాటిలో న్యాయశాఖ స్వేచ్ఛ (Independence of the Judiciary) అనేది వొకటి. పరమ పవిత్రంగా పరిగణింపబడే యీ స్వేచ్ఛను గురించే న్యాయశాస్త్ర కోవిదులూ, వారి తరఫున వకాల్తా పుచ్చుకొన్న బుద్ధిహీనులైన మేధావులూ వొద్దస్తమానం మాట్లాడుతోంటారు. వొచ్చేపోయే ప్రభు

త్వాలకి విధేయంగా వుంటామని ప్రమాణస్వీకారం జేస్తో, ఆయా ప్రభుత్వాలకి చాకిరీ జేసే న్యాయస్థానాల బూటకపు స్వాతంత్ర్యానికి కమ్యూన్ తిలోదకాలు వొదిలింది. ఈ విధమైన చర్యలద్వారా బూర్జువా రాజ్యాంగ యంత్రం వెన్నెముకనే, కమ్యూన్ విరగ్గొట్టింది.

"స్వల్ప వ్యయంతో నిర్వహించబడే ప్రభుత్వం- అంటూ బూర్జువా విప్లవాలు పదేపదే వల్లించే ఊతపదాన్ని కమ్యూన్ ఆచరణలో పెట్టింది. అధిక వ్యయానికి హేతుభూతమైన సైన్యాన్నీ నిరంకుశోద్యోగ వర్గాన్నీ, రద్దుచేయడం ద్వారా కమ్యూన్‌కు యిది సాధ్యమైంది" అని మార్క్స్ వ్యాఖ్యానించాడు.

దోపిడీ సాంఘిక వ్యవస్థలో మతాధిపతుల పాత్ర

పోలీసుల, మానవ శిరచ్ఛేదకుల (హేంగ్‌మెన్) సహాయ సహకారాల్తోనే గాక, మతాధిపతుల తోడ్పాటుతోగూడా పెట్టుబడిదార్లు శ్రామిక జనసామాన్యాన్ని పాలిస్తారు. "పేదలైన వారు ధన్యులు- దేవుని రాజ్యం వారిది" అనే కల్లబొల్లి కబుర్లతో, పేద ప్రజల్ని మోసగిస్తారు. భూస్వాములకి వెట్టిచాకిరీ జేయాలనీ ధనస్వాముల బొర్రల్ని బాగా పెంచాలనీ, దారిద్ర్యానికీ దౌర్జన్యానికీ పీడన తాడనలకీ వ్యతిరేకంగా తిరగబడ రాదనీ, హింసను అహింసతో, ఈర్ష్యాద్వేషాల్ని ప్రేమతో, ఆవేశ కావేషాల్ని కరుణతో జయించాలనీ, అట్టివారినే పరలోకంలో దేవుడైన యెహోవా ప్రేమిస్తాడనీ, మతాధిపతుల బురఖాలు వేసుకొన్న మానవరూప దానవులు సామాన్య ప్రజల్ని సదా వంచిస్తోంటారు. ఇహలోక సుఖాలు అనిత్యాలనీ, పరలోక సౌఖ్యాలు సత్యాలనీ, పెట్టుబడిదార్ల పంజరాల్లో వున్న ఈ చిలకలు కష్టజీవులకి చర్చిల్లో బోధిస్తుంటారు.

అంచేత మతాధిపతులచే అమలు జేయబడే వర్గబానిస బంధనాల నుంచి శ్రమజీవులకి మానసిక విముక్తిని కలగజేసేందుకి, ప్రభుత్వం నించి చర్చిని కమ్యూన్ వేరుజేసింది. చర్చికి చెల్లించే సబ్సిడీలను రద్దుజేసింది. అంతేగాదు- చర్చి ఆధిపత్యం నించి విద్యకు (పాఠశాల) విమోచన ప్రసాదించి, సామాన్య ప్రజలందరికీ ఉచితంగా విద్యాబుద్ధులు గరపటానికి కమ్యూన్ కృషిజేసింది.

నెపోలియన్ సైనిక తత్వానికి చిహ్నమైన "వెందోం" విజయ స్తంభాన్ని కమ్యూన్ నిర్మూలించింది. బేకరీల్లో (రొట్టెల షాపులు) కార్మికులు రాత్రిళ్లు పని జేయడాన్ని నిషేధించింది. యజమానులు కార్మికులపై విధించే జరిమానాలను రద్దు జేసింది. కమ్యూన్ అవతరణ తర్వాత, బడా పెట్టుబడిదార్లంతా ఫ్యాక్టరీలు మూసి

వేసి వెర్సైయిల్స్‌కు పలాయనించారు. ఫలితంగా 3 లక్షల మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. మూసివేయబడ్డ కర్మాగారాల్ని కమ్యూన్ స్వాధీనం జేసుకొని కార్మిక సహకార సంఘాల యాజమాన్యానికి అప్పగించింది. ప్రపంచ విప్లవోద్యమానికి చిహ్నమైన అరుణపతాకాన్ని, కమ్యూన్ తన జండాగా స్వీకరించింది. నిర్బంధ సైనిక సర్వీస్‌ను రద్దుజేయడం, రాజకీయ ఖైదీల విడుదల, మరణించిన నేషనల్ గార్డ్స్ కుటుంబాలకి పెన్షన్ యివ్వడం యిత్యాది చర్యలను తీసుకొంది.

పారిస్ విప్లవ విజయానంతరం, అన్ని తరగతులకి చెందిన ప్రజలు సాంఘిక రాజకీయ కార్యకలాపాల్లో పాల్గోవడం ప్రారంభించారు. కమ్యూన్ పాస్‌చేసిన శాసనాల్ని లక్షలాదిమంది ప్రజలు, ఫస్ట్ ఇంటర్నేషనల్‌కు చెందిన కార్మిక సంఘాల్లో, సహకార సంస్థల్లో, బహిరంగ సభల్లో, ప్రదర్శనల్లో ప్రతినిత్యం చర్చించేవారు. ఈ దశలో, పీపుల్స్ క్లబ్బులు యీ చర్చలకు కేంద్రాలుగా మారాయి. క్లబ్ మీటింగ్‌లకు చర్చి ఆవరణలను వినియోగించేవారు. చీకటి పడగానే చర్చిల్లోని ప్రార్థనా సమావేశాలు ముగించి, రాత్రి ఎనిమిది గంటలనించి చర్చివేదికల్ని బహిరంగ చర్చాకేంద్రాలుగా మార్చివేసేవారు. ఈ విభిన్న ప్రదేశాల్లో కష్టజీవి ప్రజాసామాన్యం సాగించిన చర్చలద్వారా, కమ్యూన్ పాస్‌చేసిన చట్టాలకు అంగీకారం–లేదా–విమర్శ లభించేది.

పారిస్ వీరనారీమణులు

సమాజంలోని స్త్రీల స్థితిగతుల్నిబట్టి, ఆ సమాజ పురోగతి ప్రధానంగా ఆధారపడివుంటుంది. వంటింటి కుందేలుగా, సంతానోత్పత్తిజేసే మానవ యంత్రంలా స్త్రీ వున్నంతకాలమూ, ఆ యింటికి పురోగతి, ఆ జాతికి ప్రగతి అసాధ్యం. మానవ జాతిలో దాదాపు సగభాగమున్న మహిళలు, అజ్ఞానాంధకారంలో గానుగెద్దుల్లా బతుకు తోస్తున్నంత కాలం, వారు కనిపెంచి పెద్దజేసే పిల్లలకి భవిష్యత్తులేదు. వాటితో యాంత్రికంగా కాపరంజేసే భర్తలకి సుఖశాంతులూ వుండవు. అంచేత, ఏ విప్లవోద్యమానికైనా, మహిళల అండదండలు అత్యవసరం. ఈ నేపథ్యరంగంలో, ప్రప్రథమ శ్రామికవర్గ మహా విప్లవంలో పారిస్ వీరాంగనలు నిర్వహించిన ధీరోదాత్తమైన పాత్రను పరిశీలిద్దాం!

పారిస్ కమ్యూన్ సాధించిన ఘన విజయాలు ఒక యెత్తు; కమ్యూన్ ఆవిర్భావానికి పూర్వంనించి, దాని పరాజయం వరకూ సాగిన వీరోచిత విప్లవచరిత్రలో అపర కాళికల్లాంటి పారిస్ వీరవనితలు ప్రదర్శించిన అద్వితీయమైన సాహసాలు మరొక యెత్తు. అవి–ప్రపంచ విప్లవోద్యమంలోనే చిరస్మరణీయాలు.

థేర్స్ నిశాచర సైనికులు 1871 మార్చి 17వ తేదీ రాత్రి మూడు గంటలకి నేషనల్ గార్డ్స్ యొక్క ఆయుధ సామగ్రిని స్వాధీనం జేసుకోడానికి దొంగచాటుగా పన్నాగం వేసినప్పుడూ, అంతర్యుద్ధం ప్రారంభమైన పిదప బ్యారికేడ్స్ వినక— భర్త సరసన భార్య, అన్న ప్రక్కన చెల్లి, తండ్రి ప్రక్కన కొడుకు నిలిచి, పోరాడే సందర్భంలోనూ, కమ్యూన్ పరాజయానంతరం జరిగిన అమానుష బర్బర హింసా కాండ కాలంలోనూ, కోర్టు విచారణ పేరిట జరిగిన పేరిగాళ్ళ తతంగంలోనూ పారిస్ మహిళామణులు ప్రదర్శించిన సాహసం, వజ్ర సంకల్పం, వర్గచైతన్యం, విప్లవదీక్ష నభూతో నభవిష్యతి. అట్టి పాత్రను నిర్వహించిన అజ్ఞాత నారీమణులు వందలు వేలసంఖ్యలో వున్నారు. చరిత్ర కందినవారిలో లూసీ మైఖేల్, ఎలిజబెత్ డెమిట్రి లాంటి మానినీ మణులు, మానవ స్వాతంత్ర్యోద్యమంలో మణిపూసలు. వీరేగాక అనేకమంది వీరవనితలుగూడా వున్నారు. విభిన్న వృత్తులకి జెందిన ఈ ఆదిశక్తులు, బ్యారికేడ్స్ నిర్మించడం దగ్గరనించి, బొందిలో ప్రాణమున్నంతదాకా పోరాడి, శత్రు వుల పాలిట సింహస్వప్నంలా పరిణమించారు।

చింపిరి పేలికలు ధరించిన స్త్రీలు, పట్టుబట్టలు గట్టిన శ్రీమంతుల కూతుళ్లు, అమ్మలు, అమ్మమ్మలు, పసిబిడ్డలు అంతా— వారంతా— పారిస్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని పరిరక్షించ కదంతొక్కుతో ఆడపులుల్లా కదనరంగాని కెళ్లారు. బస్తాల్ని యిసకతోనింపి, బండరాళ్ళ రోడ్లకడ్డంగాపేర్చి బ్యారికేడ్స్ నిర్మించారు. ఈ నిర్మాణం వారి చేతుల్లో అత్యున్నతమైన కళగా రూపుదాల్చింది. గ్యాస్‌లైట్ల ఆసరాతో రాత్రింబవళ్ళు తిండీ తిప్పల్లేకుండా మాతృభూమి దాస్యనిగళ విచ్ఛేదనకి వారు పరాక్రమించారు.

కమ్యూన్ ఓటమి తర్వాత, కోర్టు విచారణ తతంగంలో పాల్గొన్న మహిళా కమ్యూనార్డ్ - లూసీ మైఖేల్, జలదగంభీర స్వరంతో యీ విధంగా ప్రకటించింది— "నేను నిస్సందేహంగా విప్లవోద్యమానికి చెందిన దానినేనని ప్రకటించడానికి గర్వ పడుతున్నా. నే చేసిన పనులన్నిటికీ నాదే బాధ్యతని చెప్పడానికి ఏమాత్రం జంకను." కోర్టులో విచారించిన థేర్స్ కిరాయి గూండాలు ఆమెకు అజన్మాంత ఖైదు విధించారు.

నరకతుల్యమైన బతుకుల్ని గడిపిన పారిస్ సాధారణ స్త్రీలు, నాగమ్మ రుద్ర మ్మల్లా స్వీయవర్గ ప్రయోజనాలకోసమో, చాంద్‌బీబీ ఝాన్సీలక్ష్మివలె సింహాసనాల్ని రక్షించుకోవడం కోసమో పోరు సల్పలేదు. దరిద్ర జనతా సందోహ స్వాతంత్ర్యం కోసం, వారి జీవనప్రాంగణంలో ముత్యాల ముగ్గులు పచరించడంకోసం, చీకటి కొట్ల లాంటి వాళ్ళ కొంపల్లో కనీసం ఆముదం దీపాల్ని పెట్టాలనే మహోజ్వల ఆదర్శం

కోసం పోరాడి మరణించారు. ప్రప్రథమ శ్రామికవర్గ మహావిప్లవంలో అరివీరభయంకరలై, బరితెగించి స్వదేశీ విదేశీ దురాక్రమణదారుల్ని తరిమివేసేందుకు సంగ్రామ రంగంలో నిలిచి పోరాడిన యీ పారిస్ వీరాంగనలు అమరులు- చరిత్ర నిర్మాతలు!

"ఒకానొక విప్లవోద్యమ విజయం- మహిళలు ఏమేరకు పాల్గొన్నారనే దానిపైనే ఆధారపడి వుంటుందని, యావత్ విముక్తి పోరాటాల అనుభవం చాటిచెప్తుతోంది" అని లెనిన్ చెప్పిన సూక్తి, పారిస్ వీరవనితల పట్ల ప్రత్యక్షర సత్యం!

పారిస్ కమ్యూన్ - లెనిన్

పెట్టుబడిదారీ వ్యవస్థను తొలగించి, దాని స్థానంలో స్థాపించవలసిన నూత్న సమాజ ప్రాథమిక రూపం యేవిధంగా వుండాలో, కమ్యూన్ స్పష్టంజేసిందని మార్క్స్ అన్నాడు. కమ్యూన్ నిర్మాణ రూపానికీ, సోవియట్ స్వరూపానికీ మధ్య వున్న గాఢమైన సంబంధమూ, పోలికా, దీనినే రుజువుచేసింది. అంచేతనే సోవియట్ పవర్‌కి, కమ్యూన్ పిండరూపమని లెనిన్ వ్యాఖ్యానించాడు.

పెట్టుబడిదార్ల ప్రభుత్వాన్ని బలప్రయోగం ద్వారా కూలదోయడం వల్లనే కార్మికులు తమ అధికారాన్ని నెలకొల్పుకోగలుగుతారని, కమ్యూన్ నిర్ద్వంద్వంగా స్పష్టంజేసింది.

17:9 నాటి ఫ్రెంచి విప్లవంలో భూస్వామ్య అభివృద్ధి నిరోధక శక్తులు, సమరశీల శక్తుల పోరాటాన్ని అణచడానికి విదేశీయుల్తో చేతులుకలిపినట్లే, 1871 మేలో కూడా ఫ్రెంచి పెట్టుబడిదార్లు, కమ్యూన్‌ను నాశనం జేయడానికి ప్రష్యన్ బ్రిస్మార్క్‌తో చేతులు కలిపారు. అంచేత స్వీయవర్గ ప్రయోజనాల సాధనకై దేశానికి ద్రోహం జేయడానికి బూర్జువా వర్గం ఏమాత్రం సందేహించదని కమ్యూన్ నిరూపించింది.

శ్రామికవర్గ నియంతృత్వం

కార్మికవర్గ నియంతృత్వానికి, కమ్యూన్ ప్రత్యక్ష నిదర్శనమైంది. "పెద్ద మనుషులారా! వర్గ ఆస్తిని రద్దుజేయడానికే కమ్యూన్ పూనుకొన్నది. దోపిడిజేసే వారిని, దోపిడీ జేయడానికే అది సిద్ధమైంది" అని- కమ్యూన్ వర్గస్వభావాన్ని మార్క్స్ విశదీకరించాడు. "దోపిడీవర్గాలకి వ్యతిరేకంగా కష్టజీవులు సాగించిన పోరాటంనుండి కమ్యూన్ ఉద్భవించింది" అనీ, "కార్మికుల ఆర్థిక విముక్తిని సాధించడానికి అవసరమైన రాజకీయ రూపం చిట్టచివరకు కనిపెట్టబడింది" అనీ ఆయనన్నాడు.

("A Political form at last discovered under which to work out the economic emancipation of labour.")

సోషలిజాన్ని వల్లిస్తూ, వర్గపోరాటమంటే గజగజ వణికిపోయే సోషల్ డెమోక్రటిక్ ద్రోహుల్ని వుద్దేశించి, ఎంగెల్స్ యిలా అన్నాడు- "గౌరవనీయులారా! శ్రామికవర్గ నియంతృత్వం ఏవిధంగా వుంటుందో మీరు చూడదలిచారా? అయితే పారిస్ కమ్యూన్ వేపు చూడండి- అదే శ్రామికవర్గ నియంతృత్వం" (ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం గ్రంథానికి ఎంగెల్స్ రాసిన ఉపోద్ఘాతం- పేజి 18) వర్గశత్రువులపై నియంతృత్వం, కష్టజీవులకు ప్రజాతంత్రం- యిదే శ్రామికవర్గ నియంతృత్వం. శ్రామికవర్గ నియంతృత్వమే పారిస్ కమ్యూన్ సారాంశం. ఈ శ్రామికవర్గ నియంతృత్వాన్ని నీరుగార్చేందుకు బెరన్‌స్టీన్ మొదలు కాట్‌స్కీ వరకూ వున్న రకరకాల రివిజనిస్ట్ ప్రముఖులూ నిరంతరం కృషిచేశారు. మార్క్సిస్ట్-లెనినిస్ట్ మౌలిక సూత్రమైన ఈ కార్మికవర్గ నియంతృత్వానికి తిలోదకాలిచ్చి, దాని స్థానంలో "యావన్మంది ప్రజల రాజ్యం" అనే మోసపూరిత నినాదాన్ని, కొన్ని సోషలిస్ట్ దేశాల్లో నేడు ప్రవేశపెట్టారు. ఈ విషం ఎంత లోతులకి వెళ్ళిందంటే, ప్రపంచంలోని అనేక కమ్యూనిస్ట్ పార్టీలు కార్మికవర్గ నియంతృత్వ ఆవశ్యకతను గూర్చి ప్రస్తావించేందుకే నేడు తిరస్కరిస్తోన్నాయ్! తద్వారా పారిస్ కమ్యూన్ గుణపాఠాల్ని, మార్క్సిస్ట్ మౌలిక సూత్రాల్ని నిరాకరిస్తోన్నాయ్!

కమ్యూన్ అమూల్యమైన అనుభవాల్ని, మార్క్సిస్టు సిద్ధాంత మహోపాధ్యాయుడైన లెనిన్ భవిష్యత్తరాలకోసం కాపాడాడు. ప్రత్యేకంగా- "రాజ్యాంగ యంత్రం-విప్లవం"; "శ్రామికవర్గ విప్లవం- ద్రోహియైన కాట్‌స్కీ" అనే సిద్ధాంత గ్రంథాల్లో ఆయన కమ్యూన్ గుణపాఠాలు గూర్చి పదేపదే ప్రస్తావించాడు. రష్యన్ సోవియట్ స్వరూపం, కమ్యూన్ రూపానికి చెందినదేనని ఆయన అనేకసార్లు ఉద్ఘాటించాడు. "1905లోనూ. 1907లోనూ, రష్యన్ విప్లవం సృష్టించ ప్రారంభించిన రాజ్యాంగ యంత్ర స్వరూపమిదే" నని ఆయన నొక్కిచెప్పాడు. "1871 నాటి పారిస్ కమ్యూన్, 1905 నాటి రష్యన్ విప్లవానుభవాలు నిర్దేశించే బాటలో నడుస్తూ, కార్మికవర్గం పేద ప్రజలందర్నీ సంఘటిత పరచాలి" అని ఆయన 1917 మార్చి 11వ తేదీన రాశాడు.

పారిస్ కమ్యూన్ ప్రాధాన్యం

ప్రప్రథమ శ్రామికవర్గ మహావిప్లవం సాగుతోన్న సమయంలోనే, దానికిగల అనన్య సామాన్యమైన ప్రాధాన్యాన్ని మార్క్స్ అంచనా వేయగలిగాడు. ఆ విప్లవంలో

ద్దార్లిన పొరపాట్లను ఆయన కనుగొనగలిగాడు. శ్రామికవర్గ సిద్ధాంతాన్నీ, ఎత్తుగడల్నీ రూపొందించి, ఆ విప్లవానుభవంనించి అమూల్యమైన గుణపాఠాల్ని గ్రహించగలిగారు.

1871 ఏప్రిల్ 17వ తేదీన కుగెల్‌మన్‌కు రాసిన లేఖలో, శ్రామికవర్గం సాధించిన మహత్తర చారిత్రిక విజయంగా పారిస్ కమ్యూన్‌ను మార్క్స్ ప్రస్తుతించాడు. 1871 ఏప్రిల్ 21వ తేదీన కుగెల్‌మన్‌కు మార్క్స్ రాసిన లేఖ, మార్క్సిస్టు సిద్ధాంత సాహిత్రిలో అత్యంత ప్రాధాన్యమైంది. కమ్యూన్ నేర్పిన గుణపాఠ మేమిటో ఆ లేఖలో ఆయన యీ విధంగా వివరించాడు- "ఎయిటీన్త్ బ్రుమైర్‌లోని చివరి అధ్యాయాన్ని మీరు చదివే వుంటారు. ఇకముందు ఫ్రెంచి విప్లవం, గతంలోవలె నిరంకుశ-సైనిక యంత్రాంగాన్ని ఒకరి చేతిలోంచి మరొకరి చేతిలోకి మారనీయబోదనీ, ఆ యంత్రాంగాన్ని సర్వనాశనం చేయడానికి ఫ్రెంచి విప్లవం ప్రయత్నిస్తుందనీ నేను ఆ అధ్యాయంలో పేర్కొన్నాను. యూరప్‌లోని ఏ దేశంలోనైనా వాస్తవమైన ప్రజా విప్లవం నిర్వర్తించవలసిన ప్రాధమిక కర్తవ్యం యిదే. సరిగ్గా ఈ ప్రయత్నాన్నే వీరాగ్రగణ్యులైన మన పారిస్ కామ్రేడ్స్ సాగిస్తోన్నారు."

1871 మే 31వ తేదీన- అంటే- కమ్యూన్ పతనమైన రెండు రోజుల తర్వాత- కమ్యూన్‌ను సమర్థిస్తో, ఫస్టు ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ తరఫున మార్క్స్ ఒక డాక్యుమెంట్‌ను విడుదల జేశాడు. "సివిల్ వార్ యిన్ ఫ్రాన్సు" అన్న యీ రచన, శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంత పరంగానే గాక, సాహితీపరంగా గూడా అత్యంత ఉత్కృష్టమైంది. అంచేత ప్రతి విప్లవకారుడూ అభ్యుదయ సాహితిపరుడూ యీ మహోత్కృష్ట రచనను చదివి తీరాలి. ఈ గ్రంధంలో కమ్యూన్ గుణపాఠాల్ని ఆయన సూత్రీకరించి మానవేతిహాసంలో దాని విశిష్టతను వివరించాడు.

పాత రాజ్యాంగ యంత్రాన్ని సర్వనాశనం జేయవలసిన అవసరముందని మార్క్స్ ఖండితంగా చెప్పాడు. ఈ సూత్రీకరణ నూటికి నూరుపాళ్ళు సరియైనదని పారిస్ కమ్యూన్ నిరూపించడం మాత్రమేగాక, పాత రాజ్యాంగ యంత్రం స్థానే నూత్న రాజ్యాంగయంత్రాన్ని రూపొందించవలసిన అవసరం కలదనికూడా కమ్యూన్ అనుభవం రుజువుజేసింది. కమ్యూన్ కాలంలో ప్రాదుర్భవించిన నూత్న రాజ్యాంగ యంత్రం ద్వారానే, కార్మికవర్గ ఆర్థిక విముక్తి సాధించవలసి వుంటుందనే నిర్ణయానికి గూడా ఆయన వొచ్చాడు.

ఫస్ట్ ఇంటర్నేషనల్ ప్రసవించిన బిడ్డయే పారిస్ కమ్యూన్ – ఎంగెల్స్

"పారిస్ కమ్యూన్ పతాకమే, యూనివర్సల్ రిపబ్లిక్ పతాకం" అని ఎంగెల్స్ అన్నాడు. "మనం యిప్పుడు సోషలిజం యొక్క కనీస కార్యక్రమమని అంటోన్న దానినే, కమ్యూన్ అమలు జరిపేందుకు పూనుకొంది" అనీ, "ఎన్ని పొరపాట్లు జరిగినా పారిస్ కమ్యూన్, 19వ శతాబ్దంలో శ్రామికవర్గం వెలిగించిన మహోజ్వల జ్యోతి" అనీ లెనిన్ ప్రశంసించాడు. అంతేగాదు– ఆయన రాసిన సిద్ధాంత సంబంధమైన ప్రతి రచనలోనూ, కమ్యూన్ అనుభవాలను ఆయన ఉదహరించాడు. కమ్యూన్ గురించి ఆయన చేసిన సూత్రీకరణలూ, రాసిన వ్యాసాలూ, యిచ్చిన ఉపన్యాసాలూ– యివన్నీ– "రాజ్యాంగ యంత్రం – విప్లవం" అనే సిద్ధాంత గ్రంధంలో పొందు పరచబడ్డాయి.

పారిస్ విప్లవంలో పాల్గొన్న యోధాగ్రేసరులు, లక్షలాది పీడిత జనసంక్షేమం కోసం నెత్తురొడ్డి నేలకొరిగారు. తమ అకుంఠిత వీరత్వంద్వారా, అనన్యసామాన్య మైన త్యాగనిరతి ద్వారా, అంతర్జాతీయ కార్మికోద్యమంలో చరిత్రాత్మకమైన నూతనా ధ్యాయాన్ని ప్రారంభించారు. "పారిస్ కమ్యూనార్డ్స్ పవిత్ర స్మృతిని గౌరవించేది ఫ్రెంచి కార్మికులొక్కరే కాదు. సమస్త విశ్వంలోని శ్రామికులూ వారి పవిత్ర స్మృతిని గౌరవిస్తారు. జాతీయ లక్ష్యం కోసంగానీ, స్థానిక గమ్యం కోసంగానీ కమ్యూన్ పోరాడలేదు. సమస్త పీడిత తాడిత జనతా విముక్తి కోసం అది పోరాడింది. కమ్యూన్ జనన మరణాలకి చెందిన మహత్తర గాథ, పారిస్‌ను రెండు మాసాలకు పైగా తన అధీనంలో వుంచుకొన్న ప్రభుత్వ దృశ్యం, శ్రామికవర్గ వీరోచిత పోరాట గాథలు, కమ్యూన్ పరాజయం తర్వాత కార్మికులనుభవించిన చిత్ర హింసలు– యివన్నీ కష్టజీవుల్లో చైతన్యాన్ని రగుల్కొల్పి, వారి ఆశలను రేకెత్తించి, సోషలిజం కోసం వారి సానుభూతిని సమీకరించినయ్. పారిస్‌లో నినదించిన శతఘ్నుల భీకర గర్జనలు, శ్రామిక ప్రజల్లో వెనకబడియున్న వారిని సైతం గాఢనిద్రనించి మేల్కొల్పి, సోషలిస్ట్ విప్లవ ప్రచారానికి ప్రతిచోటా దోహదం జేశాయ్. కమ్యూన్ ఆదర్శం– సాంఘిక విప్లవాదర్శం; కష్టజీవి ప్రజాసామాన్యం యొక్క రాజకీయ ఆర్థిక విముక్తియే దాని లక్ష్యం. అది యావత్ ప్రపంచ కార్మికవర్గ గమ్యం. ఈ దృష్ట్యా, పారిస్ కమ్యూన్ అజరామరం, అమరం" అని లెనిన్ మహనీయుడు కీర్తించాడు.

పారిస్ యోధుల ఆదర్శం, లెనిన్ నాయకత్వాన సోవియట్ సోషలిస్ట్ విప్లవ పతాకాన్ని విజయవంతంగా ప్రతిష్టించడానికి దోహదంజేసింది. అప్రతిహతమైన

ఈ శ్రామికవర్గ చైతన్య స్రవంతి, ముందుకే- మున్ముందుకే- సాగింది. మరో పాతికేళ్ళ తర్వాత, తూర్పు యూరప్ దేశాల్లో కామ్రేడ్ స్టాలిన్ అద్వితీయమైన నాయకత్వాన సోషలిస్ట్ విప్లవాలు జయప్రదమయ్యాయ్. ఆ పిదప చైనా ప్రజా విప్లవం, అనంతరం ఉత్తర వియత్నాం, ఉత్తర కొరియా విప్లవాలు, ఆ తర్వాత క్యూబా విప్లవం విజయవంతమయ్యాయ్. పారిస్ కమ్యూనార్డ్స్ వెలిగించిన విప్లవ జ్యోతి, ఈ విధంగా యూరప్ నుండి ఆసియాకూ, ఆసియానుండి అమెరికాకూ వ్యాప్తి జెంది, తన వెలుగుల్ని దశదిశలా ప్రసరింప జేస్తోంది. నాటి పారిస్ యోధుల వజ్ర సంకల్పం, నేటి వియత్నాం వీరుల ప్రతిఘటనలో, వారి పోరాటాల పటిమలో పునరుజ్జీవిస్తోంది। అమెరికన్ సామ్రాజ్యవాదుల్ని మట్టి కరిపించి, ఆ మానవజాతి శత్రువుల సైనిక ప్రతిష్టను మంటగలిపి, వారితో భీషణ సమరం సాగించిన వియత్నాం ప్రజలే, పారిస్ వీరుల ధీరోదాత్త సాంప్రదాయాలకి నిజమైన వారసులు।

నూత్న శ్రామికరాజ్య స్వరూపం ఏవిధంగా వుంటుందో చూపింది గనుకనే, కమ్యూన్ చిరంజీవియైంది. భవిష్యత్ తరాలవారికి కార్మికవర్గ నియంతృత్వ లక్షణాల్ని అది నిర్దేశించింది. కమ్యూన్ ఏర్పరచబడ్డ పద్ధతి, పనిజేసిన తీరూ, తీసుకొన్న చర్యలూ, పాస్ జేసిన శాసనాలూ, ఇవన్నీ యుగయుగాల దోపిడీనుండి విముక్తి పొందడానికి, పోరు సల్పిన పీడిత ప్రజల ఆశయాలకి సజీవ చిహ్నాలుగా నిలిచాయ్.

సాయుధ విప్లవంద్వారా ప్రభుత్వాధికారాన్ని హస్తగతం జేసుకోవడం, కష్టజీవులు తమ భవితవ్యానికి తామే అధినాథులు గావడం- యిదే పారిస్ కమ్యూన్ సారాంశం। కమ్యూన్ జేసిన కృషి, మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని మహత్తరంగా పెంపొందింపజేసి సంపద్వంతం గావించింది. ఈ విషయాన్ని మార్క్స్-ఎంగెల్స్‌లే స్పష్టం జేశారు. ఊహ (యుటోపియా) నుండి విజ్ఞానశాస్త్రానికీ, విజ్ఞానశాస్త్రం నుండి వాస్తవానికి జరిగిన సుదీర్ఘ పరిణామంలో పారిస్ కమ్యూన్‌కు అత్యంత ప్రధానమైన స్థానముంది. చిక్కని చీకటిలో చక్కని వెలుగును ప్రసరించిన కమ్యూన్, వర్గరహిత సంఘ స్వర్గానికి పయనించే మహాప్రస్థానంలో తొలిమజిలీ. ప్రపంచ కార్మికోద్యమం పాలిట ఆశాజ్యోతిగా భాసించిన కమ్యూన్, పాలకవర్గాల దారుణ దమనకాండద్వారా ఆర్పివేయబడినా, అశేష గుణపాఠాల నిధియైన కమ్యూన్- చరిత్రలో మహోజ్వలాధ్యాయాన్ని సృజించింది.

పారిస్ కమ్యూనార్డుల నీడలు, ప్రపంచ పెట్టుబడిదారీ దోపిడీ దొంగల గుండెల్లో భయోత్పాతాన్ని నేటికీ సృష్టిస్తోనే వున్నాయ్। లెనిన్ శతజయంత్యుత్సవాలు

సంస్కృత సాహిత్యం వర్గ పరిణామాల ప్రతిబింబం

డి. డి. కోశాంబి

క్రీస్తుపూర్వం రెండవ సహస్రాబ్దంలో భారతదేశం మీదికి దండెత్తి వచ్చిన ఆర్యులు ఏదో ఒక సంస్కృత భాషారూపాన్ని మాట్లాడేవారు. ఆర్యులు ఆక్రమించిన భారతదేశ ప్రాంతాలలో ఈ రూపం వాడుకలో వుండేది. వేదాలలో ప్రాకృత ధోరణులు కనిపిస్తాయి. 'సంస్కృత' మనే శబ్దాన్ని బట్టి ('సంస్కరింపబడినది' అని అర్థం) అత్యంత సంపన్నమైన భాషగా కనిపించే సంస్కృతానికీ దేశభాషకీ మధ్య చాల ఎక్కువ భేదం ఉండక తప్పలేదు. అశోకుడు, కుషాన్ వంశ ప్రభువులు, శాతవాహన చక్రవర్తులు వేయించిన శాసనాలను బట్టి ఈ విషయం తెలుస్తుంది. అయినప్పటికీ, అటు తర్వాత వెలువడిన శాసనాలేమి, సాహిత్యమేమి అవి వెలువడిన ప్రదేశాల్లలోని ప్రజల భాష ఏదైనా సరే, సంస్కృత భాషలోనే వెలువడ్డాయి. ఈమార్పు ఎలా జరిగినట్టు? వైదిక భాష నుండి, మౌలిక సాహిత్య భాష మీదుగా దేశభాషలలోనికి అభివృద్ధి అయేందుకు మారుగా, జనసామాన్యం వాడుకభాషై వుండిన స్థితినుండి మౌలిక సాహిత్యభాషగా ఇది ఎలా అభివృద్ధి చెందినట్టు?

ఈ ప్రశ్నలకు సంస్కృత పరిణామాల వివరణే జవాబు చెప్పజాలదు. సంస్కృత భాషా సంస్కృతులలో వచ్చిన పరిణామాలు, భారతదేశపు ఉత్పత్తి విధానాల అభివృద్ధి క్రమం నుండీ ఉత్పన్నమైనవి మాత్రమే. ముఖ్యంగా బ్రాహ్మణ వర్గానికి చేకూరిన విశిష్టమైన స్థితిలో ఇది ముడిబడి ఉన్నాయి. చాణక్యుని కాలానికి ప్రాచీనమైన గణ వ్యవస్థ అంతరించసాగింది. ఆనాటి బ్రాహ్మణత్వం కర్మకాండపై ఆధారపడి ఉండేది. గ్రామీణ ఆర్థిక విధానానికి సుస్థిరతను చేకూర్చే అంశంగా బ్రాహ్మణవర్గం ఉపయోగపడుతూ, కర్మకాండను కొనసాగించింది. మంత్రతంత్రాలన్నీ సంస్కృత భాషలోనే

జరుగుతోన్న సమయంలో, పారిస్‌లోని పెర్రీ-లాఛెయిజ్ స్మశానవాటికలోవున్న కమ్యూనార్డుల సమాధుల్ని ధ్వంసంజేయడానికి ఫాసిస్టు గూండాలు ప్రయత్నించడమే ఇందుకు ప్రబల తార్కాణం! పారిస్ కమ్యూనార్డ్స్‌ను ఏ మహత్తర ఆశయాలు ప్రభావితం గావించాయో, ఆ ఆశయాలే యావత్ పీడిత ప్రజల్ని ప్రభావితం గావించి, మానవాళి విముక్తికి త్రోవ చూపుతోన్నాయ్. అంచేతనే కమ్యూన్ అనుభవాలు నేటికీ సమస్త దేశాల్లోని విప్లవకారులకి శిరోధార్యాలు. "వర్కింగ్ మెన్స్ పారిస్- దాని కమ్యూన్- నవ సమాజానికి మహోజ్వలమైన నాందిగా నిరంతరం కీర్తింపబడుతుంది" అని, శతాబ్దం క్రితం మార్క్స్ మహనీయుడు చెప్పిన జోస్యం నేటికీ ప్రత్యక్షర సత్యమే!

ఉండటం, అది ప్రజలకు వాడుకభాష గాకపోవడం, దానికి ప్రాచీనతమూలాన గౌరవం చేకూరడం జరిగాయి. బ్రాహ్మణ వర్గం ఇలా ఆ భాషను ప్రాణావశిష్టంగానైనా నిలబెట్టింది.

వైశ్యులనూ శూద్రులనూ క్షత్రియులు అణగదొక్కడం యజుర్వేదంలో కనిపిస్తుంది. కర్షకులైన వైశ్యుల నుండి హెచ్చుపన్నులు వసూలు చేస్తూ శ్రమజీవులను దోచుకుతింటూ వీరు తమ ఆధిక్యాన్ని కొనసాగించుకుంటూ వచ్చారు. దేశంమీదికి దండెత్తి వచ్చిన విదేశీయులలో బలాధికులూ, ధనాధికులూ ఆయుధ బలోపేతులూ దేశంలోని ఉన్నత వర్గాలలో స్థానం సంపాదించుకున్నారు. ఈ కొత్త ఉన్నతవర్గాల సమైక్యాన్ని సూచించే కొత్త సాధనంగా సంస్కృతం ఉపయోగపడింది. సాంఘిక ఆధిక్య సూచకమైందన్న మాట. మధ్యయుగాలలో పార్శీ, ఆధునిక యుగంలో ఇంగ్లీషు ఈ వర్గ ప్రయోజనాన్నే నెరవేర్చాయి. అశోక చక్రవర్తికి ఆస్థానకవి ఎవడూ లేడు. కౌటిల్యుని అర్థశాస్త్రం పేర్కొన్న రాజ భృత్యులలోనూ కనిపించడు. పాళీ సాహిత్యంలో జాతక కథలకంటె మరింత లౌకిక రచనలు కనిపించవు. ఉత్పత్తిలో అదనం (సర్‌ప్లస్) సరికొత్తగా వినియుక్తం కాసాగిందన్న భౌతిక వాస్తవాన్ని ఈ మార్పు ప్రతిబింబిస్తుంది.

సంస్కృత సాహిత్యంలో శృంగారమూ మత విషయమూ ప్రాముఖ్యం వహించాయి. బ్రాహ్మణుడు దీనికి ప్రవర్తకుడు కావడమే ఇందుకు హేతువు. తనవర్గం పురోహిత వర్గం. మరింతమందిని తాను పురోహితులుగా రాబట్టాలి. శృంగారం రాజులకు ఆహ్లాదం కలిగిస్తే, మతం తమ లౌకికాధిక్యానికి పనికివచ్చింది. వాత్స్యాయనుని కామ సూత్రం ఉన్నత వర్గాలవారి విషయ సౌఖ్య పరత్వానికి ఉపయుక్తమైన గ్రంథం. మహాయాన బౌద్ధుల చైత్య మందిరాలలో కనిపించే శిల్పాలలోని భోగపరాయణత్వమూ అలాంటిదే.

సూత్రాల పద్ధతిలో వ్యాకరణం పెంపొందడం మూలంగా సంస్కృతం క్రమాభివృద్ధిని సాధించ గలిగింది. సూత్రాలను భట్టీయంవేసి విద్యార్థి భాషను లొంగదీసుకునే వీలుంది. సూత్రశైలి సంస్కృత భాషావాఙ్మయానికి ప్రామాణికమై కూర్చుంది. ఆ సూత్రాలకు వివరణనిస్తూ భాష్యాలు వెలువడసాగాయి. అలంకారిక గ్రంథాలు కూడ భాష్యాలను ఆక్షేపించాయి. సంస్కృత భాషకు పాణిని తొలి వ్యాకర్త. తనకంటె ముందుండిన వ్యాకర్తల కృషి అతని 'అష్టాధ్యాయి' రచనలో కానవచ్చినా అది వెలువడి తత్పూర్వాల నన్నింటినీ హతమార్చింది. అలాగే, సంస్కృత భాషా పురోభివృద్ధికిగల

అవకాశాలను కూడా అది హతమార్చింది. కనీసం ఆ భాష అనేక భాషలుగా చీలిపోగల అవకాశాలనైనా అసాధ్యం చేసింది. పాణిని వ్యాకరణానికి కాత్యాయనుడు ఒక భాష్యం రచించినా, పతంజలి రచించిన మహాభాష్యమే గొప్పది. సాధారణ జీవితానికి సంబంధించిన ప్రస్తావనలు అందులో బహుళంగా దొర్లాయి. అయితే శబ్దాలనేవి పరమ శాశ్వతాలనే భావవాద ధోరణినే అదికూడ చేపట్టింది. శబ్దాన్ని 'పదార్థం' అని సంస్కృతంలో పిలిచే వారంటేనే చాలు, సంస్కృత భాషకు అస్థి మూలంలోనే, దాని ప్రధాన ప్రవర్తకుడైన బ్రాహ్మణుని అస్థి మూలంలోనే, భావవాదం ఇంకిపోయిందని చెప్పవలసిన పనిలేదు.

ఋగ్వేదం తప్ప తక్కిన వేదాలు మూడూ, మరి ఉపనిషత్తులూ శబ్దమార్మికతతో నిండి ఉన్నాయి. అలంకార భారం సంస్కృత భాషాలక్షణమై పోయింది. రచనకు ప్రాణభూతమైన అర్థాన్ని అడుక్కితొక్కి వేసేంత సామగ్రి- డొంక తిరుగుడు శైలి, జటిల సమాసాలు, అసంఖ్యాకమైన సమానార్థక పదాలు. అత్యంత అతిశయోక్తి పర్వతం- భాషమీద పడింది. దానస్తుతులనే చూచినట్లయితే, దాత పేరుగానీ అతని ఘనకార్యం గురించిన వివరాలుగానీ కనిపించవు. సంస్కృత భాష పరమోన్నతదశకు చేరుకున్న స్థితిలోగూడా, అతి సౌందర్యవంత మనిపించవచ్చునేమోగాని, అర్థవంత మని అనిపించదు. సరళత్వం దానికి చుక్కెదురు. లోతుదానికి లేనిగుణం. అది ఒక ప్రజా సముదయానికి గాక, ఒక వర్గానికే పరిమితమైన సాహిత్యం.

ఉత్పత్తి విధానంలోగానీ, శరీర శ్రమలోగానీ, వర్తక ఒప్పందాలలోగానీ ఆసక్తి లేని ఒకానొక భోగపరాయణమైన శ్రీమంతుల వర్గంతోటి అది సుదీర్ఘకాలం లంకెపడి వారి గుత్తగా ఉండిపోయింది. దారంలా తేలికైన భావాలను పరమ జటిలమైన పద్ధతిలో చుట్టుకుంటూ మెలిక తిప్పుకుంటూ పోవడానికి కావలసినంత, కావలసినంతకంటె ఎక్కువ తీరిక దానికి లభించింది. పామర జనానికి అది గహనం కావాలి. అందుచేత వచనం కనుమరుగైపోసాగింది. సాహిత్య లోకంలోనే ప్రాణం నిలుపుకున్న పదాలు ఎన్నెన్నో ఉపార్థాలు సంతరించుకున్నాయి. కాబట్టి ఒక రచనకు అర్థంచెప్పడమంటేనే వ్యాఖ్యానాలు మూలార్థాన్ని విప్పచెప్పబోయి మరింత కప్పివేసే స్థితి వచ్చింది. కౌటిల్యుని అర్థశాస్త్రంలోనూ, అనేక దానశాసనాలలోనూ ఎదురయ్యే పరిపాలనా సంబంధమైన పదాలు ఇప్పుడు తెలియకుండా పోయాయి. సంకల్ప పూర్వకంగానే అర్థం నిగూఢం చెయ్యబడిన తాంత్రిక మర్మవాద రచనల్లో శబ్దాలు మాత్రమే మిగిలాయిగాని వాటి అర్థాలు అంతర్ధాన మయ్యాయి. ఒక ప్రత్యేక విషయానికి ఒక పరిభాష, ఒకరి

పరిభాష మరొకరికి బధిర ఘోష. దేనికది విడివడి అరలై గదులై పోయింది. దేవతా విగ్రహ నిర్మాణం, చిత్రలేఖనం, వాస్తుశిల్పం, గణితం, జ్యోతిశ్శాస్త్రం, అలంకార శాస్త్రం, ఆయుర్వేదం— ఇలా కుమ్మరికీ కమ్మరికీ వడ్రంగికీ వస్త్రకారునికీ— ఇలాంటి వృత్తి జీవుల కెవ్వరికీ వాస్తవంగా పనికొచ్చే ముక్క ఒక్కటైనా ఉంటే ఒట్టు! వాస్తవ జీవితానికి ఉపయోగంగానీ ఆచరణీయతగానీ శూన్యం. చారిత్రక రచన అంటూలేదు. మంత్రతంత్రాలలో కర్మకాండో పారలౌకిక విషయాలలో అతుకందని, పోకకు పొందని ఊహలతో గూడిన కవిత్వమో— సంస్కృత రచనలలో ఎక్కువరాశి వీటిదే.

ఉన్నత ప్రమాణాన్ని సాధించుకున్న సంస్కృత సాహిత్య మహర్దశ 'పైదినుండి వృద్ధిపొందిన భూస్వామ్య విధానం'[1]తోటి ముడిబడి ఉంది. 'కిందినుండి భూస్వామ్య వ్యవస్థ'[2] వృద్ధి పొందసాగిన తదనంతర కాలాన, సంస్కృత సాహిత్య ప్రాభవం మారాకు వేసిన మాట నిజమే గాని, అంతకంటె ముఖ్యమయిన విషయం దేశభాషా వికసనం.

కొత్తగా తలెత్తే ప్రతివర్గమూ అపూర్వంగా గొప్ప సాహిత్యాన్ని సృష్టించదు. ఎందుచేతనంటే ప్రతి కొత్తవర్గమూ ప్రగతిశీలమైనది కాదు. దానికి విధిగా సాహిత్యం తోటి అక్కరకూడా ఉండదు. సమాజాన్ని మొత్తంగా వెనకటికంటే ఎక్కువ ఉత్పత్తిని సాధించగల కొత్తరూపంలోకి అది నడిపించనూలేదు. అయితే, సరికొత్తగా ఒక గొప్ప సాహిత్యరూపం అవతరించిందంటే, ఏదో ఒక కొత్తవర్గం నాయకత్వాన ఒక కొత్త సాంఘిక రూపం ఉదయించిందని అర్థంచేసుకోవాలి. సోషలిజంలో మాత్రమే ఇది సంభవం కాదు. కొత్త ప్రజా సాహిత్యం రూపొందేందుకు చాలా జాగౌతుంది. ఒకానొక సాంఘిక రూపం కరడుగట్టి సెప్పుడల్లా, అంతవరకు ప్రగతిశీలంగా వుండి

(An Indication to the study of Indian History)

1. 'పైదినుండి అభివృద్ధిచెందిన భూస్వామ్యం' అంటే ఒక చక్రవర్తిగానీ మహారాజుగానీ సామంతుల నుండి కప్పం వసూలుచేసే వ్యవస్థ. ఈ సామంతులు తమతమ రాజ్యాలలో స్వతంత్ర ప్రభువులు.

2. 'కింది నుండి అభివృద్ధి చెందిన భూస్వామ్యం' అంటే రాజ్యానికీ రైతాంగానికీ మధ్య గ్రామసీమల్లో తలెత్తి, గ్రామీణ జనసామాన్యం మీద దండనాధికారం పొందిన భూస్వాముల వ్యవస్థ. రాజుకు అవసరమైనప్పుడు సైనిక సేవ చేస్తూ రాజ్యంతోటి ప్రత్యక్ష సంబంధం ఈ వర్గానికి కద్దు. మొదటి వ్యవస్థలో, రాజోద్యోగులే శిస్తు వసూలుచేసేవారు. రెండవ దానిలో, ఈ భూస్వాములో వారి తాబేదారులో ఆ పని చేసేవారు. వర్తకం, సరుకుల తయారీ— రెండవ దానిలో హెచ్చు.

సమాజాన్ని కొత్త ఉత్పత్తి విధానంలోకి తీసుకొచ్చి నిలిపిన వర్గం ఇప్పుడు ఆ సమాజాన్ని దోచుకుతినే పనికి తన శక్తియుక్తుల నన్నింటినీ వినియోగిస్తూ తదనుగుణంగా సాహిత్య రూపాలు మార్పు చేర్పులను దరిజేరనివ్వదు. ఫలితం, సంస్కృతి క్షైణ్యం. సమస్త ప్రజాకోటి పక్షాన గనక తాను ప్రారంభంలో మాట్లాడకుండా పోయి ఉంటే, సమకాలంలోగానీ తదనంతరం కాలంలోగానీ కొత్త సాహిత్యానికి అశేషమైన ఆకర్షణ సమకూరి ఉండేది కాదు. సమస్త ప్రజాకోటి పక్షాన మాట్లాడడం కొనసాగిస్తే మాత్రం ఏ వర్గంతోడ్పాటైతే తాను ముందుకొచ్చి నిలిచిందో, ఏ వర్గం స్వప్రయోజనాలతోటి తాను లంకె పడిందో, ఆ పోషక వర్గమే కొత్త సాహిత్యాన్ని ధిక్కరించి వెయ్యక తప్పదు. వర్గ సమాజాల సాహిత్యంలో హెచ్చుగా మహారచయితలు ప్రారంభ కాలంలోనే ఎదురౌతారంటే పై కారణం వల్లనే. వారి రచనలు తత్పూర్వ కాలానికి చెందిన సాంప్రదాయికమైన, గతానుగతికమైన రూపాలలో మొదలై, చివరకి ఆ సంప్రదాయాల్ని వట్టి డొల్లగా పరిగణించి తోసిపేస్తాయి.

ఎప్పటికప్పుడు తలెత్తుతూ వచ్చిన కొత్తకొత్త దేవతా ఆరాధనకూ కర్మకాండకూ మత తంతుకూ ప్రాచీనతా గౌరవాన్ని, అధికారికతనూ సమకూర్చిపెట్టడమే సంస్కృత భాషకు అత్యంత ప్రధానమైన ఉపయోగమై కూర్చుంది. శ్రుతి స్మృతులకు మార్పు చేర్పులు చెయ్యడం అసాధ్యం గనక కొత్తగా చేసిన రచనలకు ప్రాచీనతా ముద్ర వెయ్యడమే శరణ్యమైంది. మహాభారతాన్ని భృగువంశస్తులిలాగే చేసారు. పురాణాలు ఈ పనికి మరీ ఎక్కువ వీలిచ్చాయి. దానాల గురించీ గ్రహశాంతి గురించీ విగ్రహ ప్రతిష్ఠాపన గురించీ బ్రాహ్మణుల మహీసురత్వం గురించి యాత్రా కేంద్రాల స్థల పురాణాలు గురించీ ఎన్ని చేర్పులో జరిగాయి. భూస్వామ్య వ్యవస్థ వేళ్ళుపాతుకున్నాక, 'భవిష్యపురాణం' పేరిట పూర్వాపర శబ్దాలకు పొంతన లేనంతటి హాస్యాస్పదంగా ('భవిష్యం' అంటే రాగల కాలం, 'పురాణం' అంటే గతకాలం, వెరసి భవిష్యపురాణమంటే రానున్న గతకాలం) ఒక పురాణం తయారైంది.

ఆర్య సంస్కృతి వ్యాపించిన ప్రాంతాలలో దేశభాషా సాహిత్యాలు తలెత్తినప్పుడు, అవి సంస్కృత సాహిత్యాన్నే నమూనా చేసుకున్నాయి. సామాన్యుడికి గూడా బోధపడేట్లు ప్రజా భాషలోనే కబీర్, తుకారామ్‌ల వంటివాళ్ళు రచించినప్పటికీ, వారి పాటలనిండా మత భావాలే వ్యాపించాయి. మతం రాజ్యానికి సాధనంగా మారింది. ఇది ఎంతగా జరిగిందంటే, ఎలాంటి నిరసనగానీ మత పరిభాషనే ఆశ్రయించి, ఆ చట్రానికే లోబడి వెలువడక తప్పలేదు.

లేఖ :

వాళ్ళ రాజకీయ విశ్వాసాలే వాళ్ళను తీసుకవచ్చాయి

ఉప్పెనపై రిపోర్టు (ఫిబ్రవరి)లో ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థులు నా ప్రోత్సాహంతో దివి సీమ వచ్చినట్టు రాసారు. కొంత సహాయం చేసానుగాని ఉత్సాహమూ ప్రోత్సాహమూ కూడా పూర్తిగా విద్యార్థులదే. వాళ్ళంతా ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ అన్న వామపక్ష విద్యార్థి సంఘానికి చెందినవాళ్ళు. వాళ్ళ సంస్థ, రాజకీయ విశ్వాసాలు వాళ్ళని ఢిల్లీ నుండి దివిసీమకు తీసుకువచ్చాయి కాని నేనుకాదు.

సి. వి. సుబ్బారావు – ఢిల్లీ

త్వరలో వెలువడనున్నది

చెరబండరాజు నవల

మా పల్లె

Statement about ownership and other particulars about newspaper

SṚJANA

1.	Place of publication	Warangal 506 001
2.	Periodicity of its publication ...	Monthly
3.	Printer's Name	P. Hemalatha
	Nationality	Indian
	Address	Hanamkonda, Warangal 506 001
4.	Publisher's Name	P. Hemalatha
	Nationality	Indian
	Address	(same as above)
5.	Editor's Name	P. Hemalatha
	Nationality	Indian
	Address	(same as above)
6.	Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	——

I, P. Hemalatha hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- P. Hemalatha
Publisher.

SRJANA Telugu Monthly March 78 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

వెలువడింది

పోరాటాల శ్రీరాములు

